



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

ఒడిదుడుకులను తట్టుకుని నిలబడ్డ ఆర్థిక వ్యవస్థ

మోదీ మౌనం... ప్రజా విశ్వాసంపై నేరుగా దాడి

నిరసనకారులను వైరస్‌తో పోల్చుతారా?

07

సంపుటి 29, సంచిక: 12 | బుధవారం | 01-07-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## 30 నెలల్లో రైతు

# తలెత్తుకునేలా పాలన

### ప్రజాప్రభుత్వంలో పండగలా వ్యవసాయం





ప్రజాపక్షం/రంగారెడ్డి

రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడి, మంత్రులు వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఎంపి, ఎమ్మెల్యేలతో కలిసి ల్యాప్‌టాప్‌లో బటన్ నొక్కి రైతు భరోసా నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, 30 నెలల ప్రజాపాలనలో రైతు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నామని చెప్పారు. వ్యవసాయం దండగ కాదు.. పండుగగా భావించే పరిస్థితిని ప్రజా ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందన్నారు. గత బిఆర్‌ఎస్ పదేళ్లలో దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ సిఎం కెసిఆర్ ప్రభుత్వంపై రేవంత్‌రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలోని కల్వకుంట్ల కుటుంబం చేసిన అప్పులు, తప్పుల భారం ఇప్పుడు తమ ప్రభుత్వం భరిస్తోందన్నారు. "బకాయిలు పెట్టింది బకాసురుడు.. కట్టే పాపం మాకా..." అంటూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. నాడు ఉద్యోగులకు వాయిదా పద్ధతిలో జీతాలు చెల్లించే పరిస్థితి నెలకొందని, ధనిక రాష్ట్రాన్ని ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకెళ్లారని తెలిపారు. దీంతో ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ తరువాయి 8లో

- రైతుకు పెట్టుబడిభారం తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం
- సాగుకు ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్
- రైతు భరోసా కింద ఇప్పటివరకు రూ.36వేల కోట్లు అందించాం
- రైతులు తక్కువ నీటితో పండే పంటలు వేసుకోవాలి
- గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పుచేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది
- ఉద్యోగులకు వాయిదా పద్ధతిలో జీతాలిచ్చే పరిస్థితి దాపురించింది
- కెసిఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే భార్యాభర్తల ఫోన్లు వినడం తప్ప చేసేదేమీ లేదు
- పదవి కాదు.. మాటే శాశ్వతం
- ఉన్నది ఉన్నట్టు చెబుతా... చెప్పిందే చేస్తా
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటన

- శిల్పకళా వేదికగా రైతు భరోసా పంపిణీ
- తొమ్మిది రోజుల్లో రైతు ఖాతాల్లో రూ.9వేల కోట్లు వేస్తామని ప్రకటన

## 'సర్' ప్రక్రియ, ఇసి పాత్రపై

# సిజెఐకి లేఖ

- చర్చించేందుకు లేఖపై 23 రాజకీయ పార్టీలు సంతకాలు
- కలిసొచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ, డిఎంకె



(ఫైల్ ఫొటో)

**న్యూఢిల్లీ :** దేశంలో ప్రస్తుతం 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 'సర్' ప్రక్రియ, ఎన్నికల సంఘం పాత్ర, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై చర్చించేందుకు 23 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర ఎంపి మంగళవారం నాడు భారత ప్రధాన న్యాయమూర్తికి (సిజెఐ) ఒక ఉమ్మడి లేఖ రాశాయి. ఈ లేఖపై సంతకాలు చేసిన వారిలో 'ఇండియా' కూటమిలోని ప్రధాన పార్టీలతో పాటు, ఆ కూటమికి దూరంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), డిఎంకె కూడా ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీలు 'స్యూర్ సంఘీభావం, ఐక్యత, ప్రతిఘటన' అనే సూత్రానికి కట్టుబడి ఉన్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తరువాయి 8లో



ఆర్మీ స్టాఫ్ నూతన చీఫ్‌గా...

### జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతల స్వీకరణ

07



## సిఎస్‌గా సంజయ్ జాజు బాధ్యతల స్వీకారం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ తరువాయి 12లో

# 3 నెలల్లో టిపిఎస్‌లు




- 'మంచాల, వంగూరు, పోల్కంపల్లి'లో వేగంగా పనులు
- ప్రయోగాత్మకం ఫలిస్తే ఇక జిల్లాలకు విస్తరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' (టిపిఎస్) ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ నెల 17న ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి మంచి మైలేజీ వచ్చింది. దీంతో రాష్ట్రంలోని తమ నియోజకవర్గాల్లో కూడా టిపిఎస్‌ను ఏర్పాటు చేయాలని పలువురు ఎంఎల్‌ఎలు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరుట్లలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'కు (టిపిఎస్) ఆదరణ పెరుగడంతో రాష్ట్రంలో మరో మూడు టిపిఎస్‌లను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఆరుట్ల తరహాలోనే ప్రయోగాత్మక ప్రాజెక్ట్‌లో భాగంగా మంచాల, వంగూరు, పోల్కంపల్లిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులను వచ్చే మూడు నెలల్లో తరువాయి 8లో

## ఖరీఫ్ పంటలసాగు 23 శాతం ఢమాల్

- గతేడాది జూన్‌లో 236.46 లక్షల హెక్టార్లలో సాగు
- ఈ ఏడాది 182.72 లక్షల హెక్టార్లుగా నమోదు



**న్యూఢిల్లీ :** ఒకవైపు నైరుతి రుతుపవనాల రాకలో జాప్యం, మరోవైపు నెమ్మదించిన పురోగతి కారణంగా ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగు గణనీయంగా తగ్గింది. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం... జూన్ నాటికి మొత్తం సాగు విస్తీర్ణం 182.72 లక్షల హెక్టార్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో 236.46 లక్షల హెక్టార్ల పటంలు సాగు కాగా, దానితో పోలిస్తే ఈ ఏడాది 23 శాతం తక్కువ సాగు విస్తీర్ణం తరువాయి 8లో



## ట్రంప్‌నకు భారీ షాక్

### జన్మహక్కును సమర్థించిన అమెరికా సుప్రీంకోర్టు

హక్కును అడ్డుకోవడం రాజ్యాంగ ఉల్లంఘన

**వాషింగ్టన్:** జన్మహక్కును పరిమితం చేస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులను ఆ దేశ సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. 150 సంవత్సరాలుగా అమెరికాలో అమలులో ఉన్న ఒక సంప్రదాయబద్ధమైన ఈ జన్మహక్కును సుప్రీంకోర్టు సమర్థిస్తూ ట్రంప్ ఉత్తర్వులను కొట్టివేసింది. అమెరికాలో జన్మించే బిడ్డలకు పౌరసత్వ హక్కును తిరస్కరించడం రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా సుప్రీంకోర్టు పేర్కొంది. ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వు రాజ్యాంగంలోని 14వ సవరణను ఉల్లంఘించిందని స్పష్టం చేస్తూ ఆ ఉత్తర్వును న్యాయస్థానం తిరస్కరించింది. న్యాయమూర్తుల ధర్మాసనంలో 6–3 ఓటింగ్ ద్వారా ఈ మెజార్టీ తీర్పు ప్రకటించారు. దీంతో నవంబరులో తరువాయి 12లో

## దోహాలో అమెరికాతో

# పరోక్ష చర్చలే...

- కొద్దిరోజులు ఏ స్థాయిలోనూ ప్రత్యక్ష చర్చలు లేవు
- ఎంఒయును ఉల్లంఘిస్తే ప్రతిస్పందిస్తాం : పెజెష్కియన్
- అమెరికా కట్టుబడితే మేమూ ఎంఒయును గౌరవిస్తాం
- భిన్నాభిప్రాయాల మధ్య పెరిగిన చమురు ధర




**దోహా:** అమెరికా ప్రతినిధులతో రాబోయే కొద్ది రోజులుపాటు ఎలాంటి ముఖాముఖీ సమావేశాలు లేవని ఇరాన్ విదేశాంగమంత్రిత్వశాఖ ప్రకటించింది. కేవలం ఎంఓయు ఒప్పందంలోని నిబంధనల అమలు కార్యాచరణపై మాత్రమే బహుశా దోహాలో చర్చలు జరుగుతాయని, అమెరికా ప్రతినిధులను నేరుగా కలిసే ప్రణాళిక ఇరాన్‌కు లేదని పేర్కొంది.ఈ చర్చల్లో ఇరాన్ ఆస్తుల విడుదల అంశం కూడా ఉంటుందని పేర్కొంది. ట్రంప్ చెప్పినదానికి భిన్నంగా ఒకరోజు ఆలస్యంగా బుధవారం దోహాలో చర్చలు జరుగుతాయని అల్ జజీరా తరువాయి 12లో



# పశ్చిమ బెంగాల్‌లో అధికారి దూకుడు

పశ్చిమ బెంగాల్ ప్రగతిశీల రాష్ట్రం. బెంగాల్ ఇవాళ ఏమి ఆలోచిస్తుందో రేపు దేశం అదే ఆలోచిస్తుంది అనే నానుడి బెంగాలీల మేధాశక్తికి ప్రశంస. సంఘ సంస్కర్తలు ఈశ్వర చంద్ర విద్యాసాగర్, రాజా రామ్మోహన్‌రాయ్, ఆధ్యాత్మిక వేత్త రామకృష్ణ పరమహంస, వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర చటర్జీ, జాతీయ గీత రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్‌లకు పుట్టినిల్లు. మరోవైపున బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా అనేక తిరుగుబాట్లకు పుట్టినిల్లు. ప్రసిద్ధ సమరశీల స్వాతంత్ర్య సమర యోధుడు, విదేశంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ కార్యస్థానం బెంగాల్. జాతీయ మనోభావాలకు తోడు కమ్యూనిస్టు – సోషలిస్టు భావజాలానికి బలమైన పునాదులున్న రాష్ట్రం. అటువంటి రాష్ట్రం ఇవాళ విచారకరంగా మితవాద– మతవాదుల పరిపాలనలోకి వెళ్లింది. కోతికి కొబ్బరికాయ దొరికినట్లు చేతికందిన అధికారాన్ని నిరంకుశ పాలనకు, ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వ ఎజండాకు ఉపయోగిస్తున్నాడీ బిజెపి ముఖ్యమంత్రి సువేందు అధికారి.

తృణమూల్ కాంగ్రెస్ 15 సంవత్సరాల అరాచక పాలనలో మృగ్యమైన శాంతి–భద్రతలను పునరుద్ధరిస్తే, పరిరక్షిస్తే ప్రజల సంతోషిస్తారు. ప్రస్తుతం సర్కారీ గూండాలు రివర్స్ దాడులు సాగిస్తున్నారు. జిల్లాల్లో టిఎంసి నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు కనిపిస్తే బిజెపి కార్యకర్తలు కోడిగ్రుడ్లతో దాడి చేస్తున్నారు. రెండోవైపున, రకరకాల కేసులతో పోలీసుల వేధింపులు, అరెస్టులు సాగుతున్నాయి. ఈ అరాచకాన్ని కాంగ్రెస్, కమ్యూనిస్టులు నిరసిస్తున్నారు. టిఎంసి, అత్యధిక మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపిల తిరుగుబాటుతో, కిందిస్థాయిలో నాయకుల రాజీనామాలు, బ్యాంక్ అక్కౌంట్ల స్తంభన వంటి అనూహ్యమైన ప్రతికూలతలతో గందరగోళంలో ఉంది. ప్రతిపక్షాలు (లెఫ్ట్ ఫ్రంట్, కాంగ్రెస్, టిఎంసి) ఎవరిదారిలో వారు ప్రయాణిస్తున్నప్పటికీ, వెనకాముందుగా ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు బయలుదేరక తప్పదు. అటువంటి పరిస్థితిని ఊహించికావచ్చు, బిజెపి ప్రభుత్వం ముందు జాగ్రత్తగా సరికొత్త నిరంకుశ చట్టాలు తెస్తున్నది. ''పశ్చిమ బెంగాల్ ప్రజల భద్రత, సాంఘిక వ్యతిరేక కార్యకలాపాల వ్యతిరేక బిల్లు,2026''ను అధికారి ప్రభుత్వం సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టింది. సాంఘిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు భావించిన వ్యక్తులను అరెస్టు చేసి, కోర్టుముందు హాజరు పరచకుండా 12 నెలలపాటు బెయిలు లేకుండా జైల్లో ఉంచే అధికారాన్ని ఈ బిల్లు పోలీసులకు ఇస్తున్నది. ''గూండా'' అని ముద్రవేసి ఎవరినైనా నిర్బంధంలో ఉంచే ఈ నిరంకుశ బిల్లు సాధారణ న్యాయసూత్రాలకు, జీవించే హక్కుకు విఘాతం. 'గూండాలను' సంవత్సరంపాటు వారి ప్రాంతం, జిల్లానుంచి బహిష్కరించే అధికారాన్ని కూడా ప్రభుత్వం చేజిక్కించుకుంది. రాజకీయ వైషమ్యాలు తీవ్ర స్థాయిలో ఉన్న రాష్ట్రంలో ఈ చట్టం ఎవరికి వ్యతిరేకంగా ఉద్దేశించిందో ఇట్టే ఊహించుకోవచ్చు. రాజకీయ కార్యకర్తలను సైతం 'గూండాల' పరిధిలోకి తెచ్చి కక్ష సాధింపు చర్యలకు దుర్వినియోగపరిచే అవకాశం మెండుగా ఉంటుంది. అనుకూలంగా 176, వ్యతిరేకంగా 41 ఓట్లతో బిల్లు శాసనసభ ఆమోదం పొందింది. తృణమూల్‌కు చెందిన 20మంది ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. కలహాలు, చట్టవిరుద్ధ సమావేశాలు, హింసాయుత నిరసనల సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు కలిగే నష్టాలకు వ్యక్తులను ఆర్థికంగా బాధ్యులను చేసే 'పశ్చిమ బెంగాల్ ప్రజాభద్రత పరిరక్షణ(సవరణ) బిల్లు, 2026ను కూడా శాసనసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.

బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ ఎజండా ప్రకారం, రాష్ట్రంలోని ప్రజలందరికీ ఏకరీతి పౌర స్మృతి(యుసిసి)ని అమలు చేసే బిల్లును ఆగస్టులో ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి అధికారి ప్రకటించారు. పౌరులందరికీ ఉమ్మడి పౌరస్మృతి అమలు కోసం కృషి చేయాలని రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లో ఉందంటూ, భిన్నమతాల ముఖ్యంగా ముస్లిం మైనారిటీల వ్యక్తిగత చట్టాలను రద్దు చేసి వివాహం, విడాకులు, వారసత్వ ఆస్తి వగైరా విషయాల్లో ఏకీకృత చట్టం బిజెపి ఎజండాలోని ప్రధానాంశాల్లో ఒకటి. అయితే కేంద్ర ప్రభుత్వం నేరుగా చట్టం చేయకుండా బిజెపి పాలిత రాష్ట్రాల ద్వారా శాసనాలు తెచ్చి క్షేత్రస్థాయి పరిస్థితిని పరీక్షిస్తున్నది. ఉత్తరాఖండ్, గుజరాత్, అసోం తర్వాత పశ్చిమ బెంగాల్ యుసిసి శాసనం తెస్తున్నది. రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి రంజన్ ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలో ఒక కమిటీ వేస్తున్నామని, అది అన్ని మతాల వ్యక్తిగత చట్టాలను సమీక్షించి నెలరోజుల్లో సిఫారసులు చేస్తుందని, రాష్ట్రంలో 6మాసాల్లో యుసిసి అమలు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానాన్ని అమలు జరుపుతామని ముఖ్యమంత్రి చెప్పారు. అయితే మిగతా రాష్ట్రాల్లో వలె గిరిజనులను లేదా ఆదివాసీలను ఈ చట్టం పరిధినుంచి మినహాయిస్తున్నారు. ఈ చట్టం వల్ల హిందువులకు జరిగే మేలేమీ లేకపోగా ముస్లింలు, క్రైస్తవులు ఇబ్బందులపాలవుతారు. గత జనాభా లెక్కల ప్రకారం బెంగాల్‌లో ముస్లింలు 27 శాతం.

ఇదిలావుండగా, కోల్‌కతా నగర చరిత్రను విస్మరించి వీధుల పేర్లనుంచి పఠాన్ లేదా మొగలాయీ పేర లేకుండా చేయటానికి ముఖ్యమంత్రి కంకణం కట్టుకున్నారు. తిరోగమనం, అణచివేత తమ కార్యక్రమంగా ముందుకుసాగుతున్న బిజెపి ప్రభుత్వానికి ప్రగతిశీల బెంగాలీ సమాజం నుంచి ప్రతిఘటన తప్పదు. ●



## ప్రజలు ఇంకా ఎందుకు విరాళాలు ఇస్తున్నారు?

**అన్ని రకలా మతపరమైన ప్రదేశాలలో బంగారం, వెండి, విరాళాలు దోచుకోబడుతుండటానికి సంబంధించిన అనేక సాక్ష్యాలు వెలుగులోకి వస్తున్నప్పటికీ, ప్రజలు ఇంకా ఎందుకు విరాళాలు ఇస్తున్నారు? విపశ్యన గురు గోయెంకా జీ చెప్పినట్లుగా దేవునికి మీ డబ్బు అవసరం లేదు. దానికి బదులుగా ఈ ఏడాది అవసరం ఉన్న వారికి జీవనోపాధి కల్పించటం, ఆశ్రయం ఇవ్వటం, నిరుపేదలకు సహాయం చేయటం, వర్షపు నీటి సేకరణకు ఎందుకు అండగా ఉండకూడదూ? కనీసం మీ డబ్బు దేవుడు కోరుకుంటున్న విషయాలను మీరు కళ్ళారా చూడగలుగుతారు!**

- సుచేతా దలాల్, జర్నలిస్ట్




# వైద్యులే ప్రాణ దాతలు

ఈ సృష్టిలో భూమి ఏర్పాటు నుండి వైద్య వృత్తి ఉంది. వైద్యం అందించే విధానంలో మార్పులు వచ్చినా రోగులకు వైద్యులు ప్రాణ దాతలుగా సేవలు అందిస్తున్నారు. మానవుడికి తల్లిదండ్రులు జన్మనిస్తే ప్రమాదాలు, జబ్బుల బారిన పడినప్పుడు పునర్జన్మ ఇచ్చేది మాత్రం వైద్యులు అనే విషయం మన అందరికి తెలిసిందే. నేడు పెరిగిన రేడియేషన్, ఆహారపు అలవాట్లు వల్ల రకరకాల అనారోగ్య సమస్యలతో సతమతమౌతున్నారు ప్రజలు. పర్యావరణం సమతుల్యత లేకపోవడం, వాతావరణంలో విచిత్రమైన మార్పులు వంటివే కాకుండా మనం పండించే ప్రతిదీ రసాయనాలతో వస్తున్నవే. ప్రస్తుత సమాజంలో డాక్టర్‌ల అవసరం తప్పనిసరి అయింది, వారు నిర్విరామం గా సేవలు అందిస్తున్న రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ ఉండటంతోమరికొంతమంది వైద్యుల అవసరం ఉంటుంది. కావున ప్రతి ఇంట్లో ఒకరు అయినా డాక్టర్ చదివే విధంగా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి. ప్రభుత్వ, ప్రైవైట్ ఆస్పత్రులు నిరంతరం రోగుల తాకిడి ఎక్కువ ఉన్న వైద్యులు మాత్రం అధైర్య పడకుండా ఓపికతో సేవ లు అందిస్తూ ఆపద్భాంధవులుగా నిలుస్తున్నారు. డాక్టర్‌ల సేవలకు గాను ప్రభుత్వాలు గౌరవించి వారికి రావాల్సిన జీతభత్యాలపై ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ వారి సమస్యలపై అధ్యయనం చేస్తూ నివేదికలు తెప్పించుకుని పరిష్కారానికై కృషిచేస్తే మరింత ఉత్సాహంతో వైద్య సేవలు అందిస్తారు. డాక్టర్‌లు రోగులపట్ల తల్లిలా, తండ్రిలా వైద్యం అందించి కోలుకునే వరకు కుటుంబ సభ్యులకు సూచనలు చేస్తూ మన వెన్నంటే ఉండి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు తెలుపుతారు. నేడు దేశంలో వైద్యులకు ఉన్న ప్రాధాన్యత ప్రత్యేకమైనది అనే చెప్పవచ్చు. కరోనా సమయంలో వారు చేసిన సేవలు అనంతమైనవి. మనిషిని మనిషి తాకని సమయంలో కరోనాకు భయపడకుండా తమ ప్రాణాలకు సైతం పణంగా పెట్టి సేవలు అందించారు. దేశంలో మూడు వందల అరవై ఐదు రోజులు, ఇరవై నాలుగు గంటలు పని చేస్తున్న ఆస్పత్రులలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల సేవలు అభినందనీయం. డాక్టర్‌ల సేవలకు గాను ప్రతి ఏటా జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ వైద్య సేవ లు అందించిన వారిని సత్కరించుకుని, డాక్టర్ లకు కృతజ్ఞతలు తెలుపుదాము. వైద్యుల దినోత్సవాన్ని డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతి, వర్ధంతిని సందర్భంగా నిర్వహించుకుంటాము, ఇతను పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, వైద్యుడిగా సేవలు అందించారు. 2026లో జాతీయ వైద్యుల దినోత్సవం యొక్క ఇతివృత్తం ముసుగు వెనుక వైద్యులను ఎవరు స్వస్థపరుస్తారు? ఈ థీమ్ ముఖ్య ఉద్దేశం వైద్యుల శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. ప్రస్తుత కాలంలో యువత కూడా వైద్య విద్య చదవడానికి అధికంగా ఆసక్తి చూపుతున్నారు. యువ డాక్టర్ లు వైద్యానికి సంబంధించిన వివిధ అంశాలపై లోతుగా అధ్యయనం చేసి మంచి స్పెషలిస్ట్ డాక్టర్‌లుగా పేరు పొందుతూ ప్రపంచ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. నిరు పేద ప్రజలకు కూడా వైద్యం చేరువ అయ్యేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తూ, వైద్యుల హక్కుల సాధనకై వారి ఉన్నతికై శ్రమించాలి.

మిద్దె సురేష్, 9701209355

*(జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా)*

# బీయా లుంప్‌కిన్ (1918–2026) జీవితం – పోరాటం

## 9 దశాబ్దాలపాటు అమెరికన్‌లను ప్రభావితం చేసిన కమ్యూనిస్టు

**జెన్నీ కార్సన్**

ప్రముఖ అమెరికన్ కమ్యూనిస్టు నాయకురాలు బీయాట్రైస్ పాపిరో లుంప్‌కిన్ తమ 108వ జన్మదినోత్సవానికి కొద్దివారాల ముందుగా – జూన్ 14,2026 అర్ధరాత్రి తర్వాత కన్నుమూశారు. ''ఉద్యమ మాతృమూర్తి''గా కార్మికులు, ప్రగతిశీల నాయకులు ప్రేమతో పిలుచుకునే ఆమె 20వ, 21వ శతాబ్దాల్లో అసంఖ్యాకమైన ప్రజలను, ఉద్యమాలను ప్రభావితం చేసిన క్రియాశీలి, ఆర్గనైజర్, టీచర్.

బీయా తమ ఆవేశ స్వభావాన్ని తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా పొందారు. వారు రష్యా నుంచి 1905లో అమెరికాకు వలస వచ్చేముందు రష్యాలో వారు యూదు విప్లవకారులు. బీయా తండ్రి ఎన్‌రోమ్ హిర్ష్‌న్–మోరిస్ షాపిరో అనే కొత్త పేరుతో పాస్‌పోర్టు సంపాదించి న్యూయార్క్ నగరంలో అడుగుపెట్టారు. తల్లి దోరా ఒక సంవత్సరం తర్వాత ఆయన్ను చేరుకున్నారు. బీయా కుటుంబం 1927లో ప్రధానంగా యూదు కార్మికులు నివసించే హంటర్ పాయింట్ నైబర్‌హుడ్ బ్రాంక్స్ చేరారు. దోరా, మోరిస్ చిన్న లాండ్రీ దుకాణం తెరిచారు. బీయా తన బాల్యం అక్కడే గడిపారు. యూనియన్‌గా ఏర్పడిన ఫ్యాక్టరీ కార్మికులు అక్కడ చేరుతుండేవారు. బీయా తల్లిదండ్రులు తమ సోషలిస్టు దృక్పథం నిలుపుకున్నారు. ''నేను ఏ పక్షమో నా పుట్టుకతోనే తెలిసింది'' అంటారు బీయా. ఆమె 9వ ఏట పాసైన్, ఎన్.జెలో జౌళి కార్మికుల సమ్మెను బలపరచటానికి తొలిసారి రైలు ఎక్కారు. ఆమె స్కూలు పత్రిక ఎడిట్ చేశారు. అరిస్టా హానర్ సొసైటీ సభ్యురాలు. అయితే 1931 మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవ ప్రదర్శనలో పాల్గొనటానికి స్కూలుకు ఎగనామం పెట్టినందుకు ఆమెను ఆ బాధ్యతలన్నిటి నుంచీ తొలగించారు. 1933లో మోన్రో హైస్కూల్‌లో ఆమె పోరాట ప్రసంగం తర్వాత 15ఏళ్ళ బీయా నేషనల్ స్టూడెంట్స్ లీగ్‌లో చేరారు. ఆ తర్వాత కొద్ది కాలానికే యంగ్ కమ్యూనిస్టు లీగ్‌లో చేరారు. బీయా తరచూ అంటుంటారు : ''అప్పటి నుంచి నాకు తీరిక లేదు. ఆకలిగొన్న కుటుంబాలకు ఆహారంకోసం ఎప్పుడూ కార్మికుల సమ్మెలు జరుగుతుండేవి. 'డైలీ వర్కర్' పత్రిక అమ్మటానికి తలుపులు తట్టేదాన్ని, లేదా ఓటు వేయటానికి జనాలను తీసుకొచ్చేదాన్ని''. హిట్లర్‌ని, తలెత్తుతున్న ఫాసిజాన్ని ఖండిస్తూ ఆమె ప్రసంగాలు చేసేవారు. 1934 లో హైస్కూలు విద్య తర్వాత ఉచిత విద్య అందించే సిటీ కాలేజి హంటర్ కాలేజీలో చేరారు.

హంటర్ కాలేజిలో పాలధర ఐదు నుంచి ఆరు సెంట్‌లకు పెంచినపుడు బీయా తదితర యంగ్ కమ్యూనిస్టు లీగ్ సభ్యులు బాయ్‌కాట్ నిర్వహించి, పెంచిన ధర ఉపసంహరించేటట్లు యాజమాన్యానికి నచ్చజెప్పారు. నాజీ జర్మనీ రాయబారి సందర్శనకు వ్యతిరేకంగా నిరసన నిర్వహించి డీన్ బ్లాక్‌లిస్ట్‌లో చేరారు. కొద్ది వారాల అనంతరం శాంతి కోసం విద్యార్థుల సమ్మెలో తన క్లాస్‌మేట్స్‌ను ప్రోత్సహించి వారు చేరేటట్లు చేసిన బీయాని డీన్ సస్పెండ్ చేశారు.

1930వ దశకంలో న్యూయార్క్, ఇతర నగరాలు పరివర్తన చెందుతున్న కాలంలో ఆమె అనేక కార్మిక సమ్మెల్లో చురుకుగా పాల్గొన్నారు. 1935లో డిపార్ట్‌మెంట్ స్టోర్ ముందు పికెటింగ్‌కు గాను బీయా తొలిసారి అరెస్టు అయినారు. ఆమెకు నిండా 20ఏళ్లు పూర్తి కాలేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్స్(సిఐఒ) కింద న్యూయార్క్ నగరంలో 30వేల కు పైబడిన లాండ్రీ కార్మికులను ఆర్గనైజ్ చేసేందు కు 1937లో సిఐఒ రిక్రూ ట్ చేసిన 30మంది ఆర్గనైజర్లలో ఆమె ఒకరు. లాండ్రీ కార్మికుల్లో అత్యధికులు ఆఫ్రికన్ – అమెరికన్ స్త్రీలు. వారి జీవితాలు దుర్భరంగా ఉండేవి. ఆర్గనైజర్లు ప్లాంట్ వైపు వస్తున్నారని తెలియగానే కార్మికులు పరుగెత్తుకువచ్చి, 'ఓ సిఐఒ అమ్మాయీ, మాకూ యూనియన్ కావాలి' అని అరిచేవారు. కొద్ది మాసాల్లోనే బీయా 20వేల మంది కార్మికుల ను లాండ్రీ వర్కర్స్ ఇండస్ట్రియల్ యూనియన్‌లో నమోదు చేశారు. ఆమె ఉద్యోగాలు మారుతూ 1942లో బఫెలో చేరారు. సిల్వానియా రేడియోలో ఎలక్ట్రానిక్స్ తనిఖీ ఉద్యోగంలో చేరారు.

1940 దశకంలో ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చారు. వారి పేర్లు కార్ల్, జీన్‌లీ. మొదటి భర్త నుండి 1946లో విడాకులు తీసుకున్న తదుపరి ఒక మంచి కుటుంబంలో ఫ్రాంక్ లుంప్‌కిన్‌ను వివాహం చేసుకున్నారు. వారి వివాహం 1949 అక్టోబర్ 22న షికాగోలో జరిగింది. వారికి ఇద్దరు సంతానం కలిగారు. గర్భవతి అనే కారణాన బీయా అలైడ్ రేడియోలో ఉద్యోగం కోల్పోయారు.

అది మెకార్తీ కాలం. ఎఫ్‌బిఐ ఏజంట్లు ఈ అంతర్వర్ణ దంపతుల గూర్చి వాకబు చేస్తున్నా ఫ్రాంక్, బీయా ఇద్దరూ సమాజ సేవలో నిమగ్నమైనారు. త్రాగునీటిలో మురుగునీరు కలుస్తున్నదానికి వ్యతిరేకంగా వారు పదేళ్ల పోరాటం చేశారు. సిటీ అప్పుడు పారిశుద్ధ్య కార్మికులను నియమించింది. లుంప్‌కిన్‌లు అనేక పౌరహక్కుల పోరాటాల్లో పాల్గొన్నారు. వాటి ఫలితంగా1964, 1965లో పౌరహక్కులు, ఓటింగ్ హక్కులు చట్టాలు వచ్చాయి.

బీయా తమ 47వ ఏట ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. షికాగో పబ్లిక్ స్కూల్‌లో టీచర్‌గా చేరారు. ఉత్తరోత్తరా మాల్కొం ఎక్స్ కాలేజీలో గణితంలో అసోసియేట్ ప్రొఫెసర్ స్థాయికి చేరారు. ఆఫ్రికన్ అమెరికన్ స్టడీస్, లాటినో స్టడీస్, మహిళల స్టడీస్ కోసం విద్యార్థుల డిమాండ్‌ను స్వాగతించారు. పాఠ్యపుస్తకాలు ఈ విషయాలకు చాలామేరకు స్థానం కల్పించనందున ఆమె పరిశోధకురాలు, గ్రంథ రచయిత అయి బహుళ సంస్కృతుల విద్యను ప్రతిపాదించారు. గణితం, సైన్స్‌లో బహుళ సంస్కృతుల మూలాలపై ఆమె పరిశోధనాత్మక వ్యాసాలు, గ్రంథాలు రచించారు. బీయా విద్యారంగంలో కృషి చేస్తూనే ఆర్గనైజింగ్, రాజకీయ కార్యకలాపాలు కొనసాగించారు. 1974లో 'కోయిలేషన్ ఆఫ్ లేబర్ యూనియన్ ఉమన్' వ్యవస్థాపక సమావేశంలో పాల్గొన్నారు. సిఎల్ యు డబ్ల్యు జాతీయ కార్యవర్గం బోర్డులో సభ్యురాలి గా, దాని షికాగో చాప్టర్ కార్యవర్గంలో ఇరవై ఏళ్ల పాటు సభ్యురాలిగా పనిచేశా రు. కొత్తగా ట్రేడ్ యూనియన్‌లలోకి వచ్చే సోదరీమణులకు చోదకశక్తిగా సహాయమందించారు.

1979లో బీయా, ఫ్రాంక్ షికాగో సౌత్ షోర్ వాడకు మకాం మార్చారు. 1983లో మేయర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఆఫ్రికన్–అమెరికన్ హరాల్డ్ వాషింగ్టన్ విజయానికి తోడ్పడ్డారు. విస్కాన్‌సిన్ స్టీల్ కర్మాగారం కార్మికులకు జవాబుదారీగా ఉండేందుకు ఫ్రాంక్ 17సంవత్సరాల పాటు అవిరామ పోరాటం చేశారు. అది 1980లో మూతపడినప్పటికీ బీయా మద్దతుతో, లేబర్ లాయర్ సహాయంతో న్యాయ పోరాటం సాగించి మాజీ కార్మికులకు 19మిలియన్ డాలర్లు రాబట్టారు. ఆయన 2010లో మరణించారు.

2013 బీయా తమ ఆత్మకథ ''***జాయ్ ఇన్ స్ట్రగుల్ : మై లైఫ్ అండ్ లవ్***'' ప్రచురించారు.

ఆమె తమ 90వ ఏట వయో వివక్షకు వ్యతిరేకంగా సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్‌పై పోరాటం చేశారు.100వ సంవత్సరంలో చికాగోలో కార్మికవాడలో తిరిగి లేబర్ పార్టీ అభ్యర్థులకు ప్రచారం చేశారు. 'కార్మిక హక్కులు పురోగమించినపుడే మహిళల హక్కులు, పౌరహక్కులు మంచి గా పురోగమిస్తాయని' ఆమె విశ్వసించారు. అధ్యక్షునిగా బారక్ ఒబామా ఎన్నిక, తిరిగి ఎన్నికకు ఆమె ఎంతో కష్టపడి ప్రచారం చేశారు. బీయా వృద్ధాప్యంలో కూడా ఇల్లినోయిస్ అలయెన్స్ ఆఫ్ రిటైర్డ్ అమెరికన్స్ కార్యవర్గంలో, ఇంకా స్టీల్ వర్కర్స్, టీచర్స్ యూనియన్ రిటైరీ సంఘాల్లో పనిచేశారు.2012లో షికాగో టీచర్ల సమ్మెను బలపరుస్తూ కమ్యూనిటీ సభ్యులతో నడిచారు.

2017లో ఇల్లినోయిస్, షికాగోల్లో రిటైరీస్, యువకార్మికుల కోయిలేషన్ ఇంటర్‌జెన్ ఏర్పాటుకు ఆమె సహాయపడ్డారు. ఈ అంతర్ తరాల, బహుళ వర్ణ గ్రూపు 15 డాలర్ల కనీస వేతనం కోసం, ఫ్రీ ట్యూషన్ ఇల్లినోయిస్, అందుబాటులో వైద్యం, సామాజిక భద్రత పరిరక్షణ కోసం కృషిని బలపరిచింది.

2020లో కోవిడ్–19 మహమ్మారితో లాక్‌డౌన్ కొనసాగుతుండగా, ఆ సంవత్సరం జరిగిన కీలకమైన ఎన్నికల్లో ఓటు వేసేందుకు మొత్తం శరీరాన్ని కప్పిన హజ్మత్ సూట్‌తో వీధుల్లోకి వచ్చిన బీయా ఫోటోలు టెలివిజన్ స్క్రీన్‌లపై కనిపించాయి, వార్తాపత్రికల మొదటి పేజీలకెక్కాయి. అప్పుడామె వయస్సు 102. కోవిడ్ సమసిపోయాక ఆమె మళ్లీ ట్రేడ్ యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.2022లో షికాగో కార్మిక ఉద్యమం ఆమెను 'గ్రాండ్ మార్షల్ ఆఫ్ ది లేబర్ డే పెరేడ్'తో సత్కరించింది. అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ పత్రిక 'పీపుల్స్ వరల్డ్'లో ఆమె చివరి వ్యాసం 2023 సెప్టెంబర్‌లో అచ్చయింది.

''అమెరికాలో ఫాసిస్టు నిరోధించటం ఎలా?'' అని ఆమె మార్గదర్శనం చేశారు. 2024 ఎన్నికల్లో మితవాదులను ఓడించటానికి ఐక్య సంఘటనను ఆమె ప్రోత్సహించారు.

2026 జూన్‌లో ఆమె మరణానంతరం అమెరికా కార్మిక సంఘాలు – ఎఎఫ్‌ఎల్–సిఐఒ, దాని అధ్యక్షుడు విజ్, షికాగో మేయర్, షికాగో టీచర్స్ యూనియన్, యుఎస్‌ఎ కమ్యూనిస్టు పార్టీ సహ అధ్యక్షుడు జోయి సిమ్స్ తదితరులు అర్పించిన నివాళులు కార్మికవర్గానికి బీయా సేవలను ఘనంగా ప్రస్తావించాయి.

ఒక వ్యక్తి చిత్తశుద్ధి, సామాజిక న్యాయంకోసం తపన వ్యక్తుల జీవితాలను, కుటుంబాలను, కమ్యూనిటీలను ఎలా పరివర్త న గావించగలదో చాటిచెప్పింది.ఆమె తన కృషి ద్వారా యువతరంలో 'మరో ప్రపంచం సాధ్యమే' నన్న విశ్వా సం కలిగించారు. బీయాట్రై లుంప్‌కిన్ వదిలివెళ్లిన చెరగని ముద్రను గుర్తుచేసుకున్నప్పుడు చరిత్రగతిని మార్చగలిగిన మన సామర్థ్యం గూర్చి నిరాశకు తావులేదు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎన్నడూ?



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

విద్యను రాజ్యాంగం ప్రాథమిక హక్కుగా గుర్తించిన దేశంలో.. అది ఎంతోమందికి భారంగా మారుతోంది. చదువుకోవాలనే తపన ఉన్నా చదువు కొనలేని దుస్థితి ఏర్పడింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా విద్యార్థుల కష్టాలు, బాధలు తీరడం లేదు. ప్రభుత్వాలు విద్యను తమ బాధ్యతగా, విద్యార్థులను మానవ వనరులుగా చూడటం మర్చిపోయింది. ఎన్నికల హామీలుగా విద్యారంగ పథకాలను ప్రకటించడం, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం, వాటి ఊసెత్తకపోవడం షరా మామూలైంది. విద్యను పూర్తిగా ప్రభుత్వరంగం నుండి తప్పించడానికి, ప్రైవేట్‌పరం చేయడానికి ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు పడే పాట్లు అంతా ఇంతా కాదు. మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం పై పాలకులకు ధ్యాస ఉండటంలేదు. కానీ ఏ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే ఆ ప్రభుత్వ సిఎం, మంత్రుల, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు సుందరీకరణకు నిధులు ఇస్తారు. త్వరితగతిన పనులు పూర్తవుతాయి. మరి పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఉండే హాస్టళ్లకు మౌలిక సదుపాయాల కల్పన పై వాటి అభివృద్ధి పై దృష్టిపెట్టరు. వారి సమస్యలు తెలుసుకోరు. యూనివర్సిటీలకు పూర్తి స్థాయి విసిలను నియామకం చేసినా ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేస్తేనే విద్య ప్రమాణాలు మెరుగుపడతాయి. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రతిపక్షంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి నేడు అధికారంలోకి వచ్చాక విద్యాశాఖ తన వద్దే ఉన్నా ప్రైవేట్ మేనేజ్ మెంట్ల ఫీజుల దోపిడీపై మాట్లాడటం లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యార్థినులకు స్కూటీ లు, విద్యార్థులకు ల్యాప్‌టాప్ లు ఇస్తామని ప్రకటించారు. కానీ ఈ హామీల అమలుపై మాట్లాడటం లేదు. బడ్జెట్‌లో విద్యకు 15%నిధులు కేటాయిస్తామని ప్రకటించి మొదటి, రెండు, మూడు బడ్జెట్‌లల్లో కేవలం 7% నిధులు మాత్రమే కేటాయించారు.



ఫీజు రీయింబర్స్మెంట్ పథకం పేద విద్యార్థులకు ఎంతో ఆసరాగా ఉంటూ లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తుంది. ఫీజు బకాయిలు ఇవ్వండి అంటూ విద్యార్థులు, యాజమాన్యాలు రోడ్డెక్కి ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నేడు రాష్ట్రంలో పెండింగ్ ఫీజు రీయింబర్స్మెం ట్ బకాయిల విడుదల విషయం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వద్ద వరకు చేరుకుంది. ప్రభుత్వం ఒక సారేమో గతంలో మాదిరిగా కాకుండా జీవో నెంబర్ 7 తీసుకువచ్చి విద్యార్థుల అకౌంట్లో ఫీజు బకాయిలు వేస్తామని చెప్పింది. కాలేజీ యాజమాన్యాలు హైకోర్టుకు వెళ్తే ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజు బకాయిలు విడుదల చేసుకోవచ్చని ఆదేశాలు ఇచ్చింది. మరల ప్రభుత్వం జీవో నెంబర్ 7 రద్దు చేసి జీవో నెంబర్ 8,9 తీసుకువచ్చింది. ఏ జీవో తీసుకువచ్చినా ఫీజు రీయింబర్స్మెంట్ విడుదలపై స్పష్టత లేదు. మళ్లీ హైకోర్టు నిన్నటికి నిన్న యాజమాన్యాలకు అనుకూలంగానే తీర్పు ఇచ్చి ఫీజులు వసూలు చేసుకోమని చెప్పింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య చదువుకోవడానికి పైసలు లేక ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నత విద్య అభ్యసించాక విద్య పూర్తయి సర్టిఫికెట్లు తీసుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఫీజు బకాయిలు రాలేదని పైసలిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ యజమాన్యాలు చెప్పడంతో పైసలు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోనివారు లక్షల్లో ఉన్నారు. 2020–21, 2021–22, 2022–23, 2023– 24, 2024–25,2025–26 విద్యా సంవత్సరాలకి పెండిం గ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిల మొత్తం రూ.10వేల కోట్ల వరకు ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం 2026–27 కూడా అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయి. మళ్ళీ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లకు దరఖాస్తులు చేసుకునే గడువు రానుంది. ఈ ఫీజు రీయింబర్స్మెంట్ పథకానికి నిధులు ఇవ్వకుండా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిం ది.

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ బాగాలేదు.. కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారంటూ వేల కోట్ల అప్పులు చేస్తు పరిపాలన చేస్తున్నామని మాట్లాడుతున్నారు. మరి గత 30 నెలల్లో చేసిన అప్పుల్లో విద్యార్థుల చదువులకు నిధులు ఎందుకు ఇవ్వలేదు. సరే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకుండా వేలకోట్ల రూపాయల భారం వేసింది. అవి ఒకేసారి విడుదల చేయడం సాధ్యం కాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మూడు సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లను అయినా విడుదల చేస్తే బాగుండేది. ప్రభుత్వం ఓట్లు ఉన్నవారికి పెండింగ్ నిధులు విడుదల చేస్తూ ఓట్లు లేని విద్యార్థులకు ఫీజు బకాయిలు విడుదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. 'ఫీజు బకాయిలు విడుదల చేయండి తమ చదువులకు ఇబ్బంది లేకుండా చూడండి' అంటూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు రోడ్డెక్కి ఉద్యమిస్తున్న, సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు భవన కిరాయిలు కట్టే పరిస్థితి లేదు అని తాము కళాశాలలు నడపలేము అంటూ ప్రైవేట్ డిగ్రీ, పిజి కళాశాలల వారు కొన్ని నెలల కింద కళాశాలలు బంద్‌చేసి సెమిస్టర్ పరీక్షలు బహిష్కరిస్తే నాలుగు రోజుల్లో విడుదల చేస్తామని చెప్పి నేటికి 6నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విడుదల లేదు.

ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అనే విషయా న్ని నేటి ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలి. రాష్ట్రంలో విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్ద ఎందుకు విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావట్లేదు. ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలపై సిఎం ఎందుకు మాట్లాడటం లేదు. సిఎం తన వద్ద విద్యాశాఖ ఎందుకు పెట్టుకున్నారు అనే సందేహం ఉంది. విద్యాశాఖ తనవద్ద పెట్టుకున్న సిఎం విద్యాశాఖపై సమీక్షలు చేయకుండా కనీసం చదువులకు నిధులు ఎందుకు విడుదల చేస్తలేరు అనే ప్రశ్న విద్యార్థులకు కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విద్యాశాఖపై వెంటనే సమీక్ష నిర్వహించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను మొత్తం ఒకేసారి విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులు తీర్చి, రాష్ట్రంలో విద్యారంగం బలోపేతానికి కృషి చేయాలి.

# తిరుమల తరహా యాదగిరిగుట్ట అభివృద్ధి

అధికారులకు
సిఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



ప్రజాపక్షం/హైదరాబాద్ :యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయ క్షేత్రాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, యాదగిరిగుట్ట అభివృద్ధిలో తిరుమల తరహా విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. ఎంసిఆర్ హెచ్ఆర్‌డి (ఎంసిఆర్‌హెచ్ఆర్‌డి) బోధి పెవిలియన్‌లో యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనులపై సిఎం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ యాదాద్రిలో భూముల కేటాయింపులు, గెస్ట్ హౌస్‌ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో అత్యున్నత ప్రమాణాలు, పారదర్శకత ఉండాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణ కోసం అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. ఆలయ నిర్మాణంపై ఇంజనీర్ల కమిటీ ఇచ్చిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని గడువు విధించారు. భూముల కేటాయింపులు, గెస్ట్ హౌస్‌ల నిర్మాణంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అనుసరిస్తున్న విజయవంతమైన విధానాలను అధ్యయనం చేసి, వాటిని యాదాద్రికి అనుగుణంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మఠాలు, కుల సంఘాలకు భూముల కేటాయింపు కోసం ఒక స్పష్టమైన, పటిష్టమైన విధానాన్ని రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏ సందర్భంలోనూ భూమిపై యాజమాన్య హక్కులు మారకూడదని, అవి ఎల్లప్పుడూ ఆలయ సంస్థ వద్దే ఉండాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ కోసం మార్కెట్ ధర ప్రకారం భూమిని కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. క్షేత్రంపై గెస్ట్ హౌస్‌ల నిర్మాణం కోసం ముందుకు వచ్చిన వారి జాబితాను రూపొందించి, విడతల వారీగా అనుమతులు మంజూరు చేయాలని సిఎం సూచించారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో అత్యాధునిక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని సిఎం దిశానిర్దేశం చేశారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంఎల్ఎ కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సిఎంఓ సెక్రటరీ మానిక్ రాజ్, సిఎంఓ ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు, యాదాద్రి జిల్లా ఉన్నతాధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# త్వరగా డేటా సెంటర్ ప్రారంభం

- సమగ్ర డేటా సెంటర్, ఎఐ మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలి
- ప్రముఖ పారిశ్రామిక వేత్త సునీల్ భారతి మిట్టల్‌కు సిఎం రేవంత్‌రెడ్డి సూచన





ప్రజాపక్షం/హైదరాబాద్: చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని, తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్, ఎఐ మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌కు సూచించారు. హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ , ఎఐ కార్యకలాపాలపై దృష్టి పెట్టాలన్నారు. ఎంసిఆర్ హెచ్ఆర్‌డి బోధీ పెవిలియన్‌లో సిఎం రేవంత్ రెడ్డిని సునీల్ భారతి మిట్టల్ మర్యాద పూర్వకంగా కలిశారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు. భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేసి సమన్వయం చేసుకోవాలని మిట్టల్‌కు సిఎం సూచించారు. ఇందుకు సునీల్ మిట్టల్ స్పందిస్తూ భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఎటిసిల లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని చెప్పారు. ఎయిర్ టెల్‌కు రెండో హెడ్ క్వార్టర్‌లా హైదరాబాద్‌ను చూస్తున్నామని ఆయన తెలిపారు. డేటా సెంటర్ల కెపాసిటీని మరింత పెంచడానికి ముందుకు వస్తామని, ఫైబర్ కనెక్టివిటీ మరింత పెంచడంపై సునీల్ మిట్టల్ ఆసక్తి చూపించారు. తెలంగాణ ప్రభుత్వ విద్యలో తీసుకువస్తున్న సంస్కరణలను మిట్టల్‌కు సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ పాఠశాలను పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని, నిరుద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఐటిఐలను ఎటిసిలుగా మారుస్తున్నామని, పాలిటెక్నిక్ కళాశాలను అభివృద్ధి చేస్తున్నామని సిఎం తెలిపారు.

**మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలి : సిఎం**

స్వయం సహాయక సంఘాల నుంచి రుణాల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నందున మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఉన్నతాధికారులకు చెప్పారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల తో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సిఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఎంసిఆర్ హెచ్‌డిఎఫ్‌సిలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌డిఎఫ్‌సి సమకూర్చిన రెండు అంబులెన్స్‌లకు ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఎంఆర్ఐ స్కానర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బ్యాంకు ప్రతినిధుల తో మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలతో లాజిస్టిక్ పార్కులు, గోడౌన్లు, రైస్ మిల్లులు ఏర్పా టు చేస్తున్నామని, అందుకోసం పెద్ద ఎత్తున రుణాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఏర్పాటు

బోర్డు చైర్మన్‌గా ఎం.సత్యనారాయణ రెడ్డి



ప్రజాపక్షం /హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రెవెన్యూ (ఎండోమెంట్స్–1) శాఖ జిఒ జారీ చేసింది. ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఎం. సత్యనారాయణ రెడ్డిని నియమించగా, సభ్యులుగా ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి, కొనిదెల సురేఖ, చిలప్పగారి విజయరాజం, తూళ్ల విజయేందర్, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కాంతామణి, ఎం. రాఘవేందర్ రావు, డా. లక్ష్మీ నారాయణ నాయక్‌తో పాటు ఫౌండర్ ట్రస్టీను నియమించింది. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ ప్రధాన కార్యదర్శి, ఎండోమెంట్స్ కమిషనర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, వైటిడిఎ వైస్ చైర్మన్, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి, స్థానాచార్యులు లేదా సీనియర్ ప్రధాన అర్చకులను ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నియమించింది. ఫౌండర్ ట్రస్టీ, ఎక్స్‌అఫీషియో సభ్యులు మినహా మిగిలిన సభ్యుల పదవీకాలం రెండేళ్లు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్తగా నియమితులైన చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం నిర్వహించేందుకు యాదగిరిగుట్ట దేవస్థానం ఈవోకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# రాష్ట్రంలో కొనసాగుతున్న 'సర్'


- ఈనెల 24 వరకు ఇంటింటి సర్వే
- అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల
- సిఇఒ సి. సుదర్శన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను భారత ఎన్నికల సంఘం కొనసాగిస్తోంది. అక్టోబర్ 1 అర్హత తేదీ గా నిర్ణయించి చేపట్టిన ఈ సవరణలో భాగంగా జూన్ 15 నుంచి 24 వరకు సన్నాహక కార్యక్రమాలు, అధికారులకు శిక్షణ, ముద్రణ పనులు పూర్తయ్యాయి. జూన్ 25 నుంచి బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు) రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. ఈనెల 24 వరకు బిఎల్ఓలు ఇంటింటి సందర్శన కొనసాగించనుండగా, అదే తేదీలోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా పూర్తి చే స్తారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించి, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణలు, అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తారు. వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 28 వరకు కొనసాగి, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 33 జిల్లాలు, 119 శాసనసభ నియోజకవర్గాల్లో మొత్తం 35,985 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు నమోదై ఉండగా, వీరిలో 1,67,60,643 మంది పురుషులు, 1,70,62,9 46 మంది మహిళలు, 2,859 మంది ట్రాన్స్‌జండర్ ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహా య ఎన్నికల నమోదు అధికారులు, బిఎల్ఓలకు ముందస్తుగా స మగ్ర శిక్షణ అందించడంతో పాటు రాజకీయ పార్టీలతో ప లు దఫాలు సమావేశాలు నిర్వహించినట్లు సిఇఒ తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, ఎన్నికల నమోదు అధికారుల కార్యాలయాల్లో మొత్తం 1,035 హెల్ప్‌లైన్‌లు ఏర్పా టు చేసినట్లు చెప్పా రు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకు ని బిఎల్ఓలకు కిట్లు, ఫారం 6, ఫా రం7, ఫారం8 దరఖాస్తులు, రెయిన్‌కోట్లు అందజేశారు. రాజకీయ పార్టీ ల విజ్ఞప్తి మేరకు జిహెచ్ఎంసి పరిధి లో ఎన్యూమరేషన్ ఫారాలను ఆంగ్లంలో, మిగతా ప్రాంతాల్లో తెలుగులో ముద్రించగా, ఉర్దూ మాట్లాడే ప్రజల సౌకర్యార్థం డమ్మీ ఫారాలను ఉర్దూలో కూడా అం దుబాటులో ఉంచినట్లు తెలిపారు. జూన్ 25 నుంచి ప్రారంభమైన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నా టికి 2,02,32,055కు చేరిందని, ఇది మొత్తం పంపిణీ లో 59.81 శాతమని చెప్పారు. ఓటరు జాబితాల సవరణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని, అలాగే 2కే రన్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు

# 2న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్

- సిపిఐ సంపూర్ణ మద్దతు
- జులై 15న బిసి విద్యార్థుల చలో హైదరాబాద్: జాజుల శ్రీనివాస్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పాత పద్ధతిలోనే అమలు చేయాలని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిసి జెఎసి ఆధ్వర్యంలో జులై 2న తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీల బంద్ చేపట్టనున్నట్లు బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద 'జులై 2న జరిగే కాలేజీల బంద్'ను విజయవంతం చేయాలని కోరుతూ జాజుల శ్రీనివాస్ గౌడ్, సిపిఐ నాయకులు అజీజ్ పాషా, బిఆర్ఎస్ శాసనమండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి తదితరులు కలిసి మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి బిసి జెఎసి చేస్తున్న ఆందోళనకు సిపిఐ పార్టీగా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని, 2న జరిగే కాలేజీల బంద్‌లో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల యజమాన్యాలు, ఉపాధ్యాయులు సంపూర్ణంగా సహకరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినప్పటికీ రాష్ట్రంలోని 14 లక్షల మంది పేద ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు రావాల్సిన రూ. 7వేల కోట్ల ఫీజుల బకాయిలను విడుదల చేయకుండా పేద విద్యార్థులను ఉన్నత విద్య నుండి దూరం చేయాలని కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు. సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక తప్పిదానికి పాల్పడుతుందని, ఫీజులు ఇవ్వకపోవడంతో వేల మంది విద్యార్థులు ఉన్నత విద్యను మధ్యలోనే వదిలేస్తున్నారని, ఇంకొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి నేతలు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఏరోమార్ట్ హైదరాబాద్ 2026' లో ప్రత్యేక ఆకర్షణగా

# అపోలో మైక్రో సిస్టమ్స్ స్టాల్

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగానికి ఊతమిచ్చే లా హెచ్ఐసిసి, నోవాటెల్ హోటల్‌లో మంగళవారం నుండి గురువారం వరకు ఘనంగా జరుగుతున్న అంతర్జాతీయ 'ఏరోమార్ట్ హైదరాబాద్ 2026' ఎక్స్‌పోలో అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్ స్టా ల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన ఉత్పత్తులను ఈ సంస్థ ప్రదర్శనకు ఉంచింది. ఈ స్టాల్‌ను దేశ, విదేశాల నుండి విచ్చేసిన ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు పెద్ద సం ఖ్యలో సందర్శించా రు. సంస్థ అందిస్తున్న డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ సొల్యూషన్స్, ఏవియానిక్స్ సిస్టమ్స్‌ను చూసి వారు ప్రత్యే క ప్రశంసలు కురిపించారు. ఈ ఎక్స్‌పోకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్త మ్ కుమార్ రెడ్డి అపోలో మైక్రో సిస్టమ్స్ స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ మార్కెటిం గ్ విభాగ మేనేజర్లు రాఘవేంద్ర రాజ్ , రాకేష్‌లు మంత్రికి స్వాగతం పలికి, సంస్థ తయా రు చేస్తున్న ఉత్పత్తుల వివరాలను, రక్షణ రంగం లో సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. సం స్థ ఆవిష్కరణలను మంత్రి ఆసక్తిగా తిలకించి, అపోలో మైక్రో సిస్టమ్స్ బృందాన్ని అభినందించారు. బోయింగ్, ఎయిర్‌బస్, లాక్‌హీడ్ మార్టిన్, జిఇ ఏరోస్పేస్ వంటి దిగ్గజ అంతర్జాతీయ సంస్థలతో పాటు స్వదేశీ సంస్థలు పాల్గొంటున్న ఈ సదస్సు లో, హైదరాబాద్‌కు చెందిన అపోలో మైక్రో సిస్ట మ్స్ తనదైన ముద్ర వేసిందని నిర్వాహకులు తెలిపారు.

# కమ్యూనిస్టుల త్యాగనిరతితోనే ప్రజా పోరాటాలు

సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/మంచిర్యాల : కమ్యూనిస్టు పార్టీ అంటేనే త్యాగాలకు మారుపేరని, ప్రజా ఉద్యమాల కోసం ఎందరో అమరవీరులు తమ ప్రాణాలను అర్పించారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంచిర్యాల జిల్లాలో జరుగుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సిపిఐ శ్రేణుల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరవీరుల త్యాగాల వెల్లువలోనే నేడు పార్టీ జెండా మన భుజస్కంధాలపై నిలిచిందని గుర్తుచేశారు. శాఖా కార్యదర్శి నుంచి జిల్లా కార్యదర్శి వరకు వివిధ బాధ్యతల్లో ఉన్న నాయకత్వమంతా అచంచలమైన విశ్వాసంతో క్యాడర్ విధానాన్ని అమలు పరచాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల్లో విశ్వాసాన్ని నింపు తూ, నిత్యం ప్రజల మధ్య నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం శ్రమించాలని స్పష్టం చేశారు. అంతరంగిక సమస్యలు ఏవైనా ఉంటే సామరస్యంగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలే తప్ప, క్రమశిక్షణా రాహిత్యానికి తావివ్వకూడదన్నారు. పార్టీ చట్రాన్ని, నిర్మాణాన్నితో సిపుచ్చి వ్యవహరించే అన్యవర్గ ధోరణులను, అతివాద, మితివాద వాదనలను పూర్తిగా విడనాడాలని హితవు పలికారు. ఒక కమ్యూనిస్టుకు కష్టం వస్తే తోటివారు చేయూతనిచ్చే విశాల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ త్యాగనిరతితో నిలబడటమే బూర్జువా పార్టీలకు, మనకు ఉన్న వ్యయాసమని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. బూర్జువా వర్గాలను ఎండగట్టాలంటే మనం నీతివంతంగా ఉంటూ, సిద్ధాంతాలను ఆచరణలో పెట్టి ముందుకు పోవాలని స్పష్టం చేశారు.

**ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలి**


ప్రస్తుత తరుణం పోరాటాల, ఉద్యమాల యుగమని కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజా ఉద్యమాల నిర్వహణలో ఎన్ని ఆటంకాలు, కష్టాలు ఎదురైనా నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు. మనం కేవలం ఒకటి, రెండు స్థానాలకే పరిమితం కాకుండా, రానున్న రోజుల్లో నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకత్వాన్ని పటిష్టం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో ఉన్న మిత్రుత్వాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసమే చూడకుండా, ప్రజల పక్షాన నిలబడి పోరాడటానికే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క మాట తప్పినా, ప్రజల తరపున నిలదీసి కొట్లాడతామని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం జరిపిన పోరాటాల వల్లే మంచి ఫలితాలు వచ్చాయని, పోరాటాలు చేసిన చోటే ఆశించిన ఫలితాలు దక్కుతాయని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఘనమైన ఉద్యమ చరిత్ర ఉందన్న ఆయన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధులు, సింగరేణి కార్మిక హక్కుల కోసం అసువులు బాసిన వీరులు ఈ గడ్డపై ఉన్నారని కొనియాడారు. అమరులైన విటి అబ్రహం, నరసయ్య, గుండ మల్లేష్‌ల త్యాగనిరతిని, పోరాట పటిమను ఈ సందర్భంగా గుర్తుచేశారు. భవిష్యత్తు ఉద్యమాల్లో వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతుల కార్యక్రమంలో రా ష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడు పు ప్రభాకర్ రెడ్డి, నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ నాయక్, ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి బద్రి సాయి కుమార్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, విలాస్, మేకల దాసు, కలిందర్ అలీ ఖాన్, పూర్ణిమ, నళిని, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, భీమనాథుని సుదర్శన్, దాగం మల్లేష్, కా రుకూరి నగేశ్, రేగుంట చంద్రకళ, వీర భద్రయ్య, ముస్కే సమ్మయ్య, బాజీ సైదాలు పాల్గొన్నారు.

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

HMDA Act, 2008లోని u/s. 15 (4) ప్రకారం పబ్లిక్ నోటిఫికేషన్
(G.O.Ms.No. 167 MA & UD Dept., తేదీ : 16.06.2026)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (Act No.8 of 2008)లోని సెక్షన్ 15 యొక్క సబ్ సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, G.O.Ms. N0.538 MA & UD, తేదీ 29.11.2001 ద్వారా ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ CDA మాస్టర్ ప్లాన్ ప్రకారం ఊహించిన రోడ్ నెట్ వర్క్‌కు ప్రభుత్వం ఈ కింది మార్పును చేస్తోంది.
**G.O.Ms.No. 90 MA & UD, తేదీ : 11.06.2020 ద్వారా ప్రభుత్వం ఆమోదించిన ప్రతిపాదిత 30మీటర్ల వెడల్పు గల మాస్టర్ ప్లాన్ రోడ్ (RDP) పాత బొంబాయి హైవే ఖాజాగూడ రోడ్డు నుండి వయా IBM. INESCO బిల్డర్ (ఖాజాగూడ చెరువుకు కుడివైపు) మీదుగా రాయదుర్గ్ పైగా (గ్రామంలోని సర్వే నెంబర్లు 66/9, 66/8, 66/7 మరియు ఖాజాగూడ (గ్రామం), శేరిలింగంపల్లి (మండలం) రంగారెడ్డి 'జిల్లా)లోని సర్వే నెంబర్లు 39, 38 & 40 గుండా వెళ్లేది G.O.M.s. No.538 ప్రకారం MA & UD, తేదీ : 29.11.2001 ద్వారా నోటిఫై చేయబడిన CDA మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇప్పుడు తొలగించబడింది.**
పై వివరాలు http: //gazette. telangan.gov.in // మరియు http: // hmda.gov.in // వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయి.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (RR), HMDA
DIPR R.O. No. : 5205-PP/CL/ADVT/2026-27, Date: 30-06-2026



# హెచ్ఎండిఎ ప్లాట్ల ఇ–వేలానికి భారీ స్పందన!

మోకిలలో గరిష్ఠంగా గజం ధర రూ.1.09 లక్షలు

మేడిపల్లి, మోకిల వేలం ద్వారా రూ.351.48 కోట్ల ఆదాయం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండిఎ) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్లాట్ల ఇ–వేలానికి కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. నగర శివారులలో హెచ్ఎండిఎ అభివృద్ధి చేసిన లేఅవుట్‌లకు మార్కెట్‌లో ఉన్న భారీ క్రేజ్‌ను ఈ వేలం మరోసారి నిరూపించింది. జూన్ నెలలో నిర్వహించిన మేడిపల్లి, మోకిల (ఫేజ్3) లేఅవుట్‌ల వేలం ద్వారా ప్రభుత్వానికి మొత్తం రూ.351.48 కోట్ల ఆదాయం సమకూరింది. మోకిలలో రికార్డు ధర.. రూ.231 కోట్లు దాటిన ఆదాయం

- హైదరాబాద్‌కు పశ్చిమ దిశగా వేగంగా అభివృద్ధి చెందుతున్న మోకిల లేఅవుట్ ఫేజ్3 ఇ–వేలానికి అత్యధికమంది పోటీ పడ్డారు. జూన్ 29, 30 తేదీల్లో నిర్వహించిన ఈ వేలంలో ఉంచిన మొత్తం 100 నివాస స్థలాలు (ప్లాట్లు) పూర్తిగా అమ్ముడయ్యాయి.
- **కనీస ధర :** గజానికి రూ.50,000 కాగా, వేలంలో సగటున రూ.75,640 ధర పలికింది.
- **గరిష్ఠ ధర :** మోకిలలో అత్యధికంగా ఒక గజం ధర రూ. 1,09,500 పలికి రికార్డు సృష్టించింది. అత్యంత తక్కువ ధర రూ.66,500 గా నమోదైంది.
- మొత్తం 30,625 చదరపు గజాల విస్తీర్ణం గల ఈ 100 ప్లాట్ల అమ్మకం ద్వారా హెచ్ఎండిఏకు రూ.231.65 కోట్ల అదాయం సమకూరనుంది.

### మేడిపల్లి లేఅవుట్‌లోనూ జోరు...

- అంతకుముందు జూన్ 24న నిర్వహించిన మేడిపల్లి లేఅవుట్ ఈవేలానికి కూడా మంచి స్పందన వచ్చింది. ఇక్కడ వేలానికి ఉంచిన 68 ప్లాట్లలో 63 ప్లాట్లు అమ్ముడయ్యాయి.
- **కనీస ధర :** గజానికి రూ.45,000 కాగా, ఇక్కడ అత్యధికంగా గజానికి రూ.80,000 ధర పలికింది.
- సగటున గజానికి రూ.56,260 చొప్పున 21,299 చదరపు గజాల విస్తీర్ణం అమ్ముడవగా, రూ.119.83 కోట్ల ఆదాయం లభించింది.

### మార్కెట్ నమ్మకానికి నిదర్శనం హెచ్ఎండిఎ

ఇ–వేలానికి వచ్చిన స్పందనపై హెచ్ఎండిఎ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. కొనుగోలుదారులు, పెట్టుబడిదారులలో హెచ్ఎండిఎ లేఅవుట్‌లపై ఉన్న నమ్మకానికి, నగరంలో ప్రణాళికాబద్ధమైన నివాస స్థలాలకు ఉన్న డిమాండ్‌కు ఈ పోటీనే నిదర్శనమని తెలిపారు. ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్ కారిడార్‌లో ఈ విజయవంతమైన వేలం మరింత అభివృద్ధికి, పెట్టుబడులకు మార్గం సుగమం చేస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## త్వరితగతిన పెండింగ్ ప్రాజెక్టుల పనులు పూర్తి

ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నట్లు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏఓసి ప్రాజెక్టుకు సంబంధించి రక్షణ శాఖకు చెందిన భూమికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 5.78 ఎకరాల భూమి కేటాయింపు, షామీర్‌పేట్‌లోని ఎల్ఎల్ఆర్ ప్రాంతంలో 153 ఎకరాల భూమి బదిలీ అంశం ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏఓసి పనులు ప్రారంభించేందుకు అవసరమైన రైల్వే భూముల సేకరణ, భూసేకరణ విధానంపై అధికారులతో చర్చించారు. టికెఆర్ ఈ ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే ఆస్తులపై చర్చించారు. ప్రజలకు తక్కువ నష్టం జరిగేలా ప్రత్యామ్నాయ మార్గాన్ని గుర్తిస్తూ, నిర్మాణాల స్వభావం ఆధారంగా జాబితా సిద్ధం చేయాలని సూచించారు. సమావేశానికి హాజరైన ప్రభావిత భవనాల యజమానులతో కమిషనర్ స్వయంగా చర్చించారు. ఆర్.కె. పురం ఆర్ఓబి నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే ఆస్తులపై సమీక్షించిన కమిషనర్, టిడిఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఉప్పల్ ఫ్లైఓవర్‌కు సంబంధించి మిగిలిన ఫౌండేషన్ పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రామంతాపూర్ వైపు ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన 'సర్వే ఆఫ్ ఇండియా' భూమి సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు సచిత్ గగ్వార్, రాధీక గుప్త, వికాస్ మహాతో, చీఫ్ సిటీ ప్లానర్ బి.ప్రదీప్ కుమార్, ఎల్.బి.నగర్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్, ఇంజనీర్లు రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం

అడిషనల్ సిఇఒ వెంకటేశ్వరరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వరరెడ్డి మంగళవారం కార్వాన్, చార్మినార్ నియోజకవర్గాల్లో పర్యటించారు. ఓటర్ల ప్రత్యేక నమోదు (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పరిశీలించారు. పర్యటనలో ఆయనతో పాటు చార్మినార్, కార్వాన్ నియోజకవర్గాల ఎన్నికల నమోదు అధికారులు (ఇఆర్ఒలు) పాల్గొన్నారు. అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వరరెడ్డి కార్వాన్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు (పిఎస్ నెంబర్ ) 10, 26 లతో పాటు చార్మినార్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు 166, 169 ల పరిధిలోని ప్రాంతాలను సందర్శించారు. స్థానికంగా ఎన్యూమరేషన్ ఫారాలు ఏ విధంగా పంపిణీ అవుతున్నాయనే విషయమై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బూత్ స్థాయి అధికారులకు (బిఎల్ఓలు) కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి బిఎల్ఓ తమ పరిధిలోని ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు స్వయంగా అందజేయాలన్నారు. ఫారాలను నింపడంలో ఓటర్లకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. ప్రత్యేక ఓటర్ల నమోదు (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆయన స్థానిక ఓటర్లతో మాట్లాడారు. వారి నుంచి అభిప్రాయాలను సేకరించారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఓలకు మాత్రమే అందజేయాలన్నారు. ఆ విధంగా సమర్పించిన వారి పేర్లు మాత్రమే డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేర్చబడతాయని ఆయన స్పష్టం చేశారు.

## వైద్యవృత్తి అత్యంత పవిత్రమైనది

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి స్వర్ణకుమారి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనదని, ప్రాణాలను కాపాడే అవకాశం అందరికీ దక్కదని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఒ) డాక్టర్ డి.స్వర్ణ కుమారి అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం(డాక్టర్స్ డే) పురస్కరించుకొని ప్రజాపక్షం ప్రతినిధితో ఆమె మాట్లాడుతూ వైద్యులు తమ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సేవా, ధర్మంగా భావించాలన్నారు. రోగులు ఆస్పత్రికి వచ్చే సమయానికి శారీరకంగానే కాదు, మానసికంగానూ ఆందోళనలో ఉంటారని, అలాంటి సమయంలో వారి పట్ల వైద్యులు ప్రేమగా, ఆప్యాయంగా మాట్లాడితే వారికి సగం ధైర్యం వచ్చినట్లేనని తెలిపారు. వైద్యులు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తే ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. ప్రజలు కూడా వైద్యులను గౌరవించాలని, వైద్యులు సూచించే చికిత్స, మందులను సక్రమంగా పాటించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రి సిబ్బందితో సహకరిస్తే మెరుగైన వైద్య సేవలు అందించడం సులభమవుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడం వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యత అని డిఎంహెచ్ఒ స్వర్ణకుమారి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తోటి వైద్యులకు ఆమె డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ విద్య బలోపేతం బాధ్యత ఉపాధ్యాయులదే

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్




**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ప్రభుత్వ విద్య బలోపేతం బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ .నవీన్ నికోలస్ పేర్కొన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్‌పిహెచ్ఎస్) సాహెబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఆదర్శ ప్రయోగశాలల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుభవాత్మక, నైపుణ్యాధారిత విద్యను మరింత బలోపేతం చేసేందుకు భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, అపారెల్ (దుస్తుల తయారీ) ల్యాబ్, ఫుడ్ అండ్ బెవరేజెస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఆదర్శ ప్రయోగశాలల సముదాయాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. భౌతికశాస్త్ర ప్రయోగశాలను నార్డ్ అభయ సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవం అనంతరం డైరెక్టర్ ప్రయోగశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారు నిర్వహిస్తున్న ప్రయోగాలను పరిశీలించి అభినందించారు. పనులను ఉప కార్య నిర్వాహక ఇంజనీర్ ఎస్.ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో పూర్తిచేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం పనితీరును ప్రశంసించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యా వాతావరణం అత్యుత్తమంగా ఉన్నాయన్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రయోగశాలలు, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు కలిసివస్తే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, నైపుణ్యాధారిత అభ్యాసం మరింతఅభివృద్ధి చెందుతుందన్నారు. పభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ నిరంతరం కృషిచేస్తుందని డైరెక్టర్ పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి విజ్ఞప్తిచేశారు. మంగళవారం ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌తో పాటు ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లలోని రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, ముఖ్యంగా గ్రేవ్ (యు ఐ) కేసుల దర్యాప్తు, సిసిటిఎన్ఎస్, ఈసాక్షి, అప్లికేషన్ వినియోగం, రికార్డుల నిర్వహణ, కేసుల నమోదు విధానం తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సిపి పోలీస్ క్వార్టర్స్‌ను సందర్శించి, అక్కడి వసతులు, పరిశుభ్రత, నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీసు సిబ్బంది పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని స్పష్టం చేశారు. తనిఖీలో మహేశ్వరం డిసిపి కె.నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎసిపి కెవిపి. రాజు, ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్ఒ ఎం.మహేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఎస్‌హెచ్ఒ సిహెచ్.జితేందర్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సరూర్‌నగర్‌లో భారీపేలుడు..ఇల్లు ధ్వంసం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సరూర్‌నగర్‌లో భారీ పేలుడు సంభవించి రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఇల్లు ధ్వంసమైంది. పేలుడు ధాటికి ఇంటి గోడలు, తలుపులు, కిటికీ అద్దాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే, ఘటన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నప్పటికీ ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఘటన అనంతరం ఇంట్లోని ఫ్రిడ్జ్, గీజర్ గ్యాస్ స్టవ్ , 3 గ్యాస్ సిలిండర్లతోపాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలించగా అన్ని సురక్షితంగా ఉండడంతో పేలుడు మిస్టరిగా మారింది. ఇంట్లో అగ్ని ప్రమాదానికి సంబంచిన ఆనవాళ్లు కనిపించలేదు. భారీ శబ్దానికి, ఇంటి ధ్వంసానికి కారణమేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సరూర్ నగర్ పరిధిలోని బాపూనగర్ రోడ్ నెంబర్4లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్, అతడి భార్య, కుమారుడితో కలిసి 24 ఏళ్లుగా నివాసముంటున్నారు. సమాచారం అందుకున్న సరూర్ నగర్ పోలీసులు, హైడ్రా సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రమాద కారణాలను అన్వేషిస్తున్నారు.

## కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా పనిచేస్తున్నదని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ఆరోపించారు. కందుకూరు మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఎఐటియుసి మహేశ్వరం కందుకూరు, బాలాపూర్ మండలాల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడానికి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, దీని ద్వారా పోరాడి సాధించుకున్న చట్టాలన్నీ నిర్వీర్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మిక సంఘాలు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆగస్టు 2న తుక్కుగూడలో జరిగే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పర్వతాలు కోరారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని పనిగంటలు అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, వ్యవసాయ నల్ల చట్టాలను ఉపసంహరించాలని, విద్యుత్ సవరణ బిల్లును తక్షణమే ఆపాలని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, ఇఎస్ఐ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని, అధిక ధరలను అరికట్టాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని పర్వతాలు డిమాండ్ చేశారు. సభలో ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ తీర్మానాలు ప్రవేశ పెట్టారు. ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మ గళ్ళ రాజు, దేవేందర్ గౌడ్, నాయకులు బ్రహ్మచారి, ప్రవీణ్, యాదగిరి, రవి, కోటేష్, శాంసన్, రేడియా నాయక్, లక్ష్మారెడ్డి కవిత, నల్ల వీని మరియమ్మ, సిద్ధు, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి అత్యుత్తమైనది

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** అత్యుత్తమైన వృత్తిగా భావించేది ఒక ఉపాధ్యాయుల వృత్తి మాత్రమే అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హయత్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసి పదవీ విరమణ పొందుతున్న పుచ్చకాయల ఇందిర అభినందన సభ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి డిఇఒ సుశీంద్రరావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వేంకటేశ్వర్లు, గోవర్ధన్‌రెడ్డి, రమాదేవి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, చెన్నగోని రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెగావత్ గణేష్ నాయక్, నక్క శ్రీనివాస్, మతిన్ షరీఫ్, కొండోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భూసమస్య పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/కేశంపేట :** పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలంటూ గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం కేశంపేట మండలం నిర్థవెళ్ళి గ్రామంలోని సర్వేనంబర్ 127లో ఉన్న భూ సమస్యలను పరిష్కారించాలని తహసీల్దార్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, ఉపసర్పంచ్ సపూరా ఆమేర్, వార్డు సభ్యులు చంద్రయ్య, రమేష్, చెన్నయ్య, రిజ్వానభేగం, మంజుల, రైతులు జబ్బర్‌ఖాన్, ముత్యాలు, మల్లేష్, ఖాజాపాషా, వాజీద్, బాలు పాల్గొన్నారు.

## పదవీ విరమణ సర్వసాధారణం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** ఉద్యోగ పర్వంలో పదవీ విరమణ సర్వసాధారణమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కొత్తూరు మున్సిపల్ కమీషనర్ బాలాజీ ఉద్యోగ పదవి విరమణ పొందిన నేపథ్యంలో కమీషనర్ బాలజీ దంపతులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కమిషనర్ బాలాజీ చేసిన సేవలు అభినందనీయమన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు జాండ గూడెం సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలని జాతీయ బీసి జనసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప డిమాండ్ చేశారు. మంగళవారం షాద్‌నగర్‌లో బీసి జనసేన ఆధ్వర్యంలో కళాశాలల బంద్ నిర్వహించారు.కార్యక్రమంలో నాయకులు బోయ చెన్నయ్య, వెంకటయ్య, నియోజకవర్గ అధ్యక్షులు గడ్డమీది రమేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల అఖిల్‌చారి, సాయి భరత్, వెంకటేష్, నరసింహులు, ప్రభాకర్, రాములు పాల్గొన్నారు.

## వీరేశం మృతి తీరని లోటు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** రజక ఉద్యమకారుడిగా, రజక వృత్తిదారుల కోసం కృషి చేసిన చల్లా వీరేశం మృతి బాధాకరమని సమాఖ్య ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. మంగళవారం ఉప్పల్ మండలం, న్యూ నాగోల్‌లోని ఎస్.ఏ డాంగే భవనంలో రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చల్లా వీరేశం మృతి పట్ల సంతాపం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఇవాళి అర్పించారు. కార్యక్రమంలో పగిళ్ల జ్యోజి, డి.సత్తయ్య, గోరుగంటి కృష్ణ, బొడ్డుపల్లి చుక్కయ్య, దండు నిరంజన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నందివనపర్తి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం నందివనపర్తి గ్రామ సర్పంచ్ విజయ్‌కుమార్, పాలక వర్గంతో కలిసి మల్‌రెడ్డి రంగారెడ్డిని తొర్రూర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి గ్రామ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, నాయకులు బిలకంటి చంద్ర శేఖర్‌రెడ్డి,ఉపసర్పంచ్ జెనిగే శ్రీశైలం, మూడేడ్ల వెంకట్‌రెడ్డి, నర్రే శ్రీశైలం, గ్రామ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహణ

### కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వివిధ పనులతో కార్యాలయాలకు వచ్చే వారిని ఆదరించి సహనంతో విని తమ విధి నిర్వహణలో భాగంగా సరైన సేవలందించటం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల నుండి, ఉన్నతాధికారుల నుండి మన్ననలు గుర్తింపు పొందగలుగుతారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. జిల్లా హౌజింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ మూర్తి, హౌజింగ్ విభాగ ఎఇ సుభాష్ రెడ్డి, కలెక్టర్ సిసి బాల భాస్కర్, కలెక్టరేట్ కార్యాలయ సబార్డినేట్ జర్మియాజ్‌ల పదవీ విరమణ సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కల్సి వారందరినీ శాలువాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. పదవీ విరమణ చేస్తున్న వారంతా తమ పదవీ కాలంలో సరైన సేవలందించటాన్ని కలెక్టర్ అభినందించారు.




## బోధన నాణ్యతకు 'అనురాగ్' శ్రీకారం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** ఉన్నత విద్యలో బోధనా నాణ్యత పరిశోధనా సామర్థ్యాల పెంపు లక్ష్యంగా అనురాగ్ విశ్వవిద్యాలయం పరిధిలోని అనురాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. జూన్ 15నుంచి 25 వరకు జరిగిన ఈ శిక్షణలో బోధన పరిశోధనకు సంబంధించిన ఆధునిక విధానాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ ఉట్ల బాలజీ ప్రారంభించారు. విభాగాధిపతి డాక్టర్ వి.విష్ణు వందన శాస్త్రీయ పరిశోధన తత్వం పరిశోధన పద్ధతులపై శిక్షణ ఇవ్వగా ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ బికె మిశ్రా పరిశోధన సమస్యల గుర్తింపు లక్ష్యాలు వాటి రూపకల్పనపై వివరించారు. రెండో విడతలో సమర్థవంతమైన కేస్ స్టడీ ఆధారిత బోధనపై ప్రొఫెసర్ సురేష్ గరిమెళ్ల శిక్షణ ఇచ్చారు. వ్యాపార వ్యూహాలు మార్కెటింగ్ ఆర్థిక నిర్వహణ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించిన కేస్ స్టడీలను అధ్యాపకులు విశ్లేషించారు. ఈ శిక్షణ బోధనా నైపుణ్యాలు, పరిశోధనా సామర్థ్యాల పెంపునకు దోహదపడింది




## లక్ష్మాపూర్ పెద్ద చెరువు మత్తడికి మరమ్మతులు

### నీటి లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టిన ఇర్రిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని లక్ష్మాపూర్ పెద్ద చెరువు మత్తడికి నీటి పారుదల శాఖ అధికారులు మంగళవారం మరమత్తులు చేయించారు. లక్ష్మాపూర్ పెద్ద చెరువు చిన్న మత్తడి నుంచి తరుచు నీరు లీకేజీ అవుతుందన్న రైతుల ఫిర్యాదు మేరకు సిమెంట్‌తో లీకేజీలు పూడ్చివేసినట్లు ఇర్రిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ్ తెలిపారు. గత వర్షాకాలంలో చెరువు నిండి అలుగులు పారుతున్న సమయంలో చిన్న మత్తడి నుంచి భారీగా నీరు లీకేజీతో పెద్ద మొత్తంలో చెరువు నుంచి నీరు వృధా అయింది. 'చెరువు నుంచి లీకవుతున్న నీరు' అని ప్రజాపక్షం జాతీయ దిన పత్రికలో కథనాలు ప్రచురించడంతో స్పందించిన అధికారులు తాత్కాలికంగా చర్యలు చేపట్టారు. కాగా ప్రస్తుతం చెరువులో నీరు లేక పోవడంతో మత్తడి వద్ద మరమత్తులుచేసి నీటి లీకేజీలు కాకుండా చర్యలు చేపట్టినట్లు వాసుదేవ్ తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్నందున నీరు లీకేజీ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని మత్తడి మరమత్తు పనులు చేయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లష్కర్ శ్రీనివాస్, కూలీలు పాల్గొన్నారు.

## రేపు డయల్ యువర్ డిఎం

**ప్రజాపక్షం/వికారాబాద్:** రేపు డయల్ యువర్ డిఎం కార్యక్రమం బుధవారం ఉదయం 11గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రయణీకులు బస్సు సౌకర్యాలు, టైమింగ్స్, సిబ్బంది ప్రవర్తన డిపో పరిధిలోని ఇతర సమస్యలపై నేరుగా డిపో మేనేజర్‌కు తెలియజేయవచ్చని ఆమే పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.



## వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం : ఎమ్మెల్యే మర్రి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన శస్త్ర చికిత్సల ద్వారా వైద్యానికి నోచుకోలేని నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం లభిస్తుందని, దీనికోసం అవసరమైన వారు వైద్యులిచ్చిన ప్రతిపాదన లేఖలతో తనను సంప్రదిస్తే మంజూరు చేయిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని పలువురికి చికిత్సల నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2,05,500లకు సంబంధించి పత్రాలు, చెక్కులను లబ్దిదారులకు ఆయన మంగళవారం అందించారు. షాహిన్ బేగంకు రూ. 18వేలు, సుగుణకు రూ.60 వేలు, ప్రేమ్‌కుమార్‌కు రూ.22,500, రాజుకు రూ.60 వేలు, ఉమారాణికి రూ.45 వేలు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాసరెడ్డి, సబిత, అనిల్ కిషోర్ గౌడ్, బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ టెలిఫోన్ కాలనీలో 1,166 గజాల స్థలానికి హైడ్రా ఫెన్సింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, మేడిపల్లి మండలం, బోడుప్పల్ గ్రామ పరిధిలోని టెలిఫోన్ కాలనీలో కబ్జాకు గురవుతున్న 1,166 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా మంగళవారం స్వాధీనం చేసుకుంది. తద్వారా స్థానిక 3వేల కుటుంబాలకు చెందిన సుమారు 10 వేలమంది నివాసితులకు పెద్ద ఊరట లభించినట్లయింది.




**ఐదు దశాబ్దాల నాటి లేఅవుట్..**

వివరాల్లోకి వెళ్తే 1974లో గ్రామపంచాయతీ లే అవుట్‌గా టెలిఫోన్ కాలనీ ఏర్పడింది. ఆ సమయంలో కాలనీవాసుల కోసం 1,166 గజాల స్థలాన్ని పార్కుగా కేటాయించారు. అయితే, ఈ విలువైన స్థలంపై కన్నేసిన కొందరు కబ్జాదారులు, దానిని 6 భాగాలుగా విభజించి ప్లాట్లుగా మార్చేందుకు ప్రయత్నించారు. కాలనీవాసులు ఆ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని చూసినప్పుడల్లా అడ్డుపడుతూ ఆటంకాలు సృష్టించారు.

**ప్రజావాణి ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం..**

కబ్జాదారుల వేధింపులు భరించలేక కాలనీవాసులు హైడ్రా 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా అధికారులు లోతుగా విచారణ జరిపారు. బోడుప్పల్ గ్రామంలోని సర్వే నెంబర్ 78,79లలో ఈ కాలనీ ఏర్పడినట్లు గుర్తించారు. గ్రామపంచాయతీ లేఅవుట్ అయినప్పటికీ ఇందులో ప్లాట్లు, భవనాలకు ఎల్ఆర్ఎస్, బిఆర్ఎస్ అనుమతులు కూడా మంజూరైనట్లు తేలింది. పార్కు పక్కనే ఉన్న ప్లాట్ల సేల్ డీడ్‌లను క్షుణ్ణంగా పరిశీలించగా, అందులో స్పష్టంగా 'పార్కు స్థలం' హద్దులుగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఆమోదిత లేఅవుట్, రిజిస్టర్డ్ పత్రాలు, క్షేత్రస్థాయి పరిశీలన, కాలనీ నివాసుల వాంగ్మూలాల ఆధారంగా ఆ స్థలం పూర్తిగా పార్కుకు సంబంధించినదేనని హైడ్రా అధికారులు తేల్చారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది, ఆక్రమణదారులు అక్రమంగా ఏర్పాటుచేసిన ఫెన్సింగ్‌లను తొలగించారు. హద్దులను నిర్ధారిస్తూ హైడ్రా ఆధ్వర్యంలో కొత్త ఫెన్సింగ్ వేసి, అది 'పార్కు స్థలం' అని పేర్కొంటూ అధికారిక బోర్డులను ఏర్పాటు చేశారు. హైడ్రా తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో టెలిఫోన్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## రైతు భరోసా నిధుల విడుదలపై హర్షం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వర్షాకాలం పంటకు రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అలియాబాద్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వార నగరంలోని శిల్పా కళావేదిక నుంచి సిఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేశారు . ఈ కార్యక్రమాన్ని రైతులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు కూర్చుని తిలకించారు. ఈ కార్యక్రమంలో అదన పు జిల్లా కలెక్టర్ విజయేందర రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా ఉద్యాన అధికారి శ్రీధర్, కౌన్సిలర్ జశ్వంత్‌రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ బిక్షపతి, బి బ్లాక్ కమిటి అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, రైతులు, మండల వ్యవసాయాధికారి రమేష్, ఎఇఒలు సుధీర్‌కుమార్, శ్రీనాథ్, హెచ్‌ఇఒ సాగరిక, ఆర్ఐ కవిత, తదితరులు పాల్గొన్నారు.



## ఇఎస్ఐ నాచారం ఆసుపత్రిలో బదిలీ ఉద్యోగులకు ఘన వీడ్కోలు

### కొత్తగా చేరిన 16 మంది ఉద్యోగులకు ఆత్మీయ స్వాగతం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగుల ఐక్యతే సంఘానికి బలమని, ఉద్యోగుల హక్కులు, సంక్షేమ పరిరక్షణ కోసం తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) నిరంతరం పోరాడుతుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్.మూర్తి తెలిపారు. ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి నివేదికను అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ఇఎస్ఐ ఆసుపత్రి, నాచారంలో బదిలీపై ఇతర ఆసుపత్రులకు వెళ్లిన ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ, కొత్తగా బదిలీపై చేరిన ఉద్యోగులకు మంగళవారం ఆత్మీయ స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాచారం ఇఎస్ఐ ఆసుపత్రిలో 20 నుంచి 25 సంవత్సరాల పాటు సేవలందించిన 36 మంది ఉద్యోగులను వారి విశిష్ట సేవలను గుర్తిస్తూ శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే కొత్తగా బదిలీపై చేరిన 16 మంది ఉద్యోగులకు శాలువాలు కప్పి స్వాగతం పలుకుతూ, వారి సేవలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.ఎస్. మూర్తి మాట్లాడుతూ బదిలీ అయిన ఉద్యోగులు కొత్త విధి స్థానాల్లో కూడా ఇదే సేవాభావంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.ప్రేమలత, బి.ప్రేమలత, జి. విక్టోరియా, వి.వేణుకుమార్, భాగ్య, చంద్రకళ, రాణి, రఘు, సంతోష్, సత్యనారాయణతో పాటు సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌ఏ నిబంధనలు పాటించాల్సిందే

### సిఎంసి కమిషనర్ సృజన

**ప్రజాపక్షం/దుండిగల్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన, వన్ వర్డ్ ఎవ్రీ డే ప్రోగ్రాంలో భాగంగా కుత్బుల్లాపూర్ జోన్, దుండిగల్ సర్కిల్59 పరిధిలోని వార్డు నెం.296 లో పర్యటించారు. ఈ పర్యటనలో స్థానిక సమస్యలను నేరుగా పరిశీలించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కె.వి.ఆర్ కాలనీలో సి.సి రోడ్ల నిర్మాణం చేపట్టడం, నాగులూరు గ్రామానికి వెళ్లేందుకు నూతన రోడ్డు ఏర్పాట్లు, దుండిగల్ గ్రామంలో ఇంటి నంబర్ల జారీ, పన్ను తగ్గింపు ప్రక్రియను వేగవంతం, ఐఎఆర్ఇ కాలేజీ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు వీధి దీపాల ఏర్పాటు, శంభీపూర్ గ్రామంలో పారిశుధ్య పనుల మెరుగుదల, స్థానికంగా ఖాళీ స్థలాలలో పిల్లల కోసం ఆట వస్తువుల ఏర్పాటు, దుండిగల్ ఎస్‌సి బస్తీలో సిసి రోడ్డుకు ఎదురవుతున్న ఆక్రమణల సమస్యల పరిష్కారం, గగిలాపూర్ సర్వే నెం.214లో స్మశానవాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణం, దుండిగల్ గ్రామంలో అవసరమైన చోట కొత్త సిసి రోడ్ల నిర్మాణం, పర్యటన ముగింపులో కమిషనర్ అధికారులను ఉద్దేశించి పలు కీలక సూచనలు చేశారు. ఎస్ఎల్‌ఏ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇంటి నంబర్ల జారీ, పన్ను తగ్గింపు, ఇంజనీరింగ్ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఖాళీ స్థలాల తనిఖీ, వాటి అభివృద్ధి పనులఉను చేపట్టాలని కోరారు. వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏఎల్ఓ



ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ మేడ్చల్ మల్కాజిగిరి గ్రంథాలయ చైర్మన్ బి.శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, ఏసిపి శ్రీనివాస్, ఏఎంసి లక్ష్మయ్య, అసిస్టెంట్ ఇంజనీర్లు బి.సురేందర్ నాయక్, అశోక్ కుమార్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించాలని వినతి**

దుండిగల్ గ్రామాని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన పర్యటించారు 296 బిజెపి పార్టీ డివిజన్ నాయకులు ప్రధాన సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ కమిషనర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. దుండిగల్ గ్రామంలో ముఖ్యంగా రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, కమిటీ

హాల్, హిందూ స్మశాన వాటిక, నాగులూరికి సంబంధించి ముఖ్యంగా దుండిగల్ నుంచి నాగులూర్ గ్రామానికి రోడ్డు మార్గం, రేషన్ షాపు, స్ట్రీట్ లైట్,గగిలాపూర్ గ్రామంలో స్ట్రీట్ లైట్స్, 214లో తాగునీటి సరఫరా, దుండిగల్ తండాలో డ్రైనేజ్, వాటర్, కాలుష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు, శంభీపూర్ గ్రామాలలో డ్రైనేజ్ వ్యవస్థ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన



వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్ చారి, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు ఎం.వెంకటేష్ నాయక్, సర్కిల్ ప్రధాన కార్యదర్శి తురాయి భాను గౌడ్, యువ మోర్చా నాయకులు ఆకుల విజయ్, కార్యదర్శి తలారి రాజ్ కుమార్, నాయకులు కుమ్మరి సదానందం, అనిల్, క్యాసరం రాజు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** జగద్గిరిగుట్ట ప్రభుత్వ పాఠశాలలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు రాచమల్ల హరికిషన్‌కు మంగళవారం ఘన వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ కె.యేసురత్నం ముఖ్య అతిథిగా హాజరై, హరికిషన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. రాచమల్ల హరికిషన్ తన సుదీర్ఘ ఉపాధ్యాయ జీవితంలో వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారి భవిష్యత్తుకు



బాటలు వేసారని కొనియాడారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరంలో జగద్గిరిగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు కూడా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయనే విషయాన్ని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయన్నారు. అలాగే పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని 568 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చ దం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు రాచమల్ల హరికిషన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నమ్మకంగా ఉంటూ రూ.50కోట్లతో పరార్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** గత మూడు దశాబ్దాలకు పైగా సుపరిచితుడిగా, వ్యాపారం చేసుకొంటూ నమ్మించి మాయమాటలు చెప్పి, వడ్డీ ఇస్తామంటూ పలువురి నుండి రూ.50 కోట్ల మేరకు తీసుకుని కుచ్చు టోపీ పెట్టి పరారైన దంపతుల ఉదంతమిది. వారి జాడ తెలుసుకొని తమ డబ్బులు తిరిగి ఇప్పించాలంటూ బాధితులు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించారు. బాధితుల వివరాల ప్రకారం కుషాయిగూడ సమీపంలోని చక్రిపురం నివాసి లక్ష్మయ్య (50) గత ముప్పయి ఏళ్లుగా శ్రీ వెంకటేశ్వర మార్కెటింగ్ పేరిట సిమెంట్ డీలర్ వ్యాపారం చేస్తూ ఆల్ ఇండియా ఫెడరేషన ప్రధాన కార్యదర్శిగా స్థానికులతో సత్సంబంధాలు ఏర్పరచుకొన్నాడు. గత కొద్ది నెలలుగా అతడు కుమార్తె వివాహం, తండ్రి వైద్యం, ఇంటి నిర్మాణం అంటూ పలు కారణాలు చెబుతూ స్థానిక నివాసితుల నుండి ఒకరికి తెలియకుండా మరొకరి నుండి వడ్డీ ఇస్తానంటూ అప్పులు తీసుకోసాగాడు. ఈ నెల 22 నుండి అతడు భార్యతో సహా కనిపించకుండా పోయారని, వారి మొబైల్ ఫోన్లు సైతం పనిచేయటం లేదని బాధితులైన రఘు, వేణు, అశోక్, తదితరులు తెలిపారు. తమ ప్రాంతానికి చెందిన 60 మందికి పైగా నివాసితుల నుండి వివిధ కారణాలు చెప్పి రూ.50 కోట్లకు పైగా వసూలుచేసి పరారైన దంపతుల జాడ తెల్సుకొని తగు న్యాయం చేయాలని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో బాధితులు కోరారు.



## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను సన్మానించిన మామిండ్ల శ్రీనివాస్‌పటేల్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తెలంగాణలో బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయాలని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మంగళవారం తెలంగాణలో పర్యటనలో భాగంగా బేగంపేటలోని టూరిజం హోటల్‌కు విచ్చేసిన సంధర్భంగా బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు లాల్‌గడి మలక్‌పేటకు చెందిన మామిండ్ల శ్రీనివాస్ పటేల్ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. ఈ భేటీలో తెలంగాణ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి వరకు బిజెపి కార్యక్రమాలను విస్తరించే అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. నితిన్ నబీన్‌ను కలువడం సంతోషంగా ఉందని బిజెపి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని శ్రీనివాస్‌పటేల్ తెలిపారు.



**రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో అన్నదానం**

బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు మామిండ్ల శ్రీనివాస్‌పటేల్, శైలజ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శామీర్‌పేటలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.ఈ అన్నదానానికి శామీర్‌పేటకు చెందిన వాసగౌని గణేష్‌గౌడ్ కుటుంబ సభ్యులు సహకరించారు. రాజీవ్ రహదారిపై వెళ్లే భక్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అన్నదానంలో పాల్గొన్నారు.



## సురక్షితమైన శాంతి భద్రతలు కల్పిస్తాం

### శామీర్‌పేట ప్రింట్ మీడియా ఆత్మీయ పరిచయ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కొండ నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట ప్రాంత ప్రజలకు సురక్షితమైన, ప్రశాంతమైన శాంతి భద్రతలు కల్పిస్తామని, పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కొండ నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శామీర్‌పేట ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా పాత్రికేయులతో ఆత్మీయ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ మీడియా మధ్య పరస్పర సమన్వయం ప్రజలకు వేగవంతమైన, ఖచ్చితమైన సమాచారాన్ని అందించడంలో మీడియా పాత్ర, ప్రజాసమస్యల పరిష్కారంలో పోలీస్ మీడియా భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించారు. శామీర్‌పేట పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ, బ్లాక్ స్పాట్‌లను గుర్తించడం, ఇంజనీరింగ్ లోపాలు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు మార్కింగ్‌లు, వీధి దీపాలు, ఏర్పాటు వంటి చర్యలు చేపట్టి ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అంతేకాకుండా మాదక ద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నియమాల అమలు, మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. పై అంశాల పట్ల మీడియా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్‌హెచ్ఒ నర్సింహారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు దేశం కృష్ణ, గిరిప్రసాద్, వెంకట్‌రెడ్డి, భూపాల్, బత్తుల ప్రభాకర్‌యాదవ్, ఎస్ఐలు సోమిరెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ, మంజీరా నీటి సమస్యల పరిశీలన

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పిజెఆర్‌నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, మంజీరా నీటి సరఫరా సమస్యలను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు ఆయన పాదయాత్ర నిర్వహించి, సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ లైన్లు జామ్ కావడంతో మురుగునీరు నిలిచిపోతూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే డ్రైనేజీ లైన్లలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దెబ్బతిన్న మ్యాన్‌హోల్ మూతలను తొలగించి వాటి స్థానంలో కొత్త మూతలు ఏర్పా టు చేయిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలోని రెండు బ్లాక్‌లకు మంజీరా నీటి ఒత్తిడి సరిగా రావడం లేదని స్థానికులు తెలుపగా, ఆ సమస్యను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీతో పాటు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని తెలిపారు.



## 'సర్'ను సమర్థవంతంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఓటర్ల జాబిత ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ ఏ ఒక్క ఓటరూ తమ ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని వినాయక్‌నగర్ మాజీ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి కోరారు. డివిజన్‌లో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవల్ ఏజంట్లు ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించి స్థానికులు ఈ విషయంలో సహకరించాలని సూచించారు.

## వార్డు సభ్యుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అందే బీరన్న, అధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇతర రాష్ట్రాలలో అవలంబించిన విధంగా గౌరవ వేతనం రూ.3000 వేలు ఇవ్వాలని, ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్ రూ.25 లక్షలు, చనిపోయిన వార్డు సభ్యులకు రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుముల నవీన్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి సందగిరి వెంకటేష్, ధూపం ఆంజనేయులు, రాష్ట్రాధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మూల కరుణాకర్ గౌడ్, రాష్ట్ర నాయకులు గంగాదర్, వెంకటరమణ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌కు వీడ్కోలు



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** పోలీస్ అధికారులు, సిబ్బంది నిజాయితీగా, సమర్థవంతంగా విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ జె.నరసయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు అంబర్‌పేట్ పిఎస్‌లో సీనియర్ కానిస్టేబుల్‌గా పనిచేసిన అరుణ మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా తోటి సిబ్బంది ఆమెను సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అంబర్‌పేట్ సిఐ కిరణ్ కుమార్, ఓయూ ఎసిపి జగన్, డిఐ హాఫీసుద్దీన్, ఎస్ఐలు తరుణ్, సంధ్య, ఏఎస్ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ జెండా పండుగ



**ప్రజాపక్షం/చార్మినార్:** పాతబస్తీలో టిఆర్ఎస్ జెండా పండుగ సాగుతోంది. ఈ మేరకు చార్మినార్ నియోజకవర్గంలోని పత్తర్‌గట్టి, హరిబౌలి, బేల, అశోక్ పిల్లర్ కూడలిలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం చార్మినార్ ఇంచార్జి రాధా కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ సాయి మహేష్, చార్మినార్ అబ్జర్వర్ కందుల మధు, డేవిడ్, జ్యోతి, కులకర్ణి, అనితాచౌదరి, విజయ్‌కుమార్, రాజేష్ వికాస్, భాను, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సహకరిస్తా



**ప్రజాపక్షం/బోరబండ:** స్థానికంగా నెలకొన్న సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు రాజ్‌నగర్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్‌లో ఆయన పాల్గొని దరఖాస్తు ఫారాలను అందజేశారు. అనంతరం ఆయన రాజ్‌నగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


## సంపూర్ణ సహకారం అందిస్తా: తలసాని



**ప్రజాపక్షం/సనత్‌నగర్:** సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల విషయంలో సంపూర్ణ సహకారం అందిస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ జెక్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు జెక్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రతినిధులు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాకప్పి, పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు. తలసానిని కలిసిన వారిలో అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి సుబ్బారావు, ఉపాధ్యక్షులు సునీల్ కుమార్, సుధాకర్‌రెడ్డి, శారదాదేవి, లక్ష్మయ్య, సురేష్‌బాబు, సుధాకర్‌రావు, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## కందికల్ గేట్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

ట్రాఫిక్ హెల్ప్‌లైన్
9010203626




**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** ఫ్లయి ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పురస్కరించుకుని చత్రినాక నుంచి కండికల్ గేట్ వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు నల్లవాగు శ్మశానవాటిక నుంచి కండికల్ గేట్ ఫ్లయి ఓవర్ వైపు వెళ్లే వా హనాలన్నింటినీ నల్లవాగు శ్మశానవాటిక 'యు' టర్న్ వద్ద పాతగుట్ట వైపు మళ్లిస్తారు. లాల్‌దర్వాజా నుంచి ఓపీ చత్రినాక వైపు వెళ్లే అన్ని వాహనాలు బార్లేన్ వద్ద ఇంజన్ బౌలి వైపు మళ్లిస్తారు. గౌలిపుర నుంచి ఓపీ చత్రినాక వైపు వెళ్లే అన్ని వాహనాలు లాల్‌దర్వాజా వైపు మళ్లించడం జరుగుతుంది. ఉప్పుగూడ నుంచి ఓపీ చత్రినాకా వైపు వెళ్లే అన్ని వాహనాలు అనుమతించరు. పంచముఖి హనుమాన్ ఆలయం వద్ద గౌలిపుర వైపు మళ్లించడం జరుగుతుందిమరింత సమాచారం కోసం పోలీస్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రాఫిక్ పోలీస్ ఫేస్‌బుక్, ట్విట్టర్ హ్యాండిల్‌లో ట్రాఫిక్ అప్‌డేట్‌ల గురించి తెలుసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రయాణ సహాయం కోసం దయచేసి ట్రాఫిక్ హెల్ప్‌లైన్ సెల్: 9010203626లో సంప్రదించాలని కోరారు.

# సిగాచీ నరమేధానికి ఏడాది

- లాబాల వేటలో బలైన శ్రామికులు
- తెలంగాణ పీపుల్స్ జెఎసి రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



ప్రజాపక్షం/చిక్కడపల్లి: పారిశ్రామిక ప్రగతి ప్రస్థానంలో మానవ ప్రాణం ఎంత చవక వస్తువుగా మారిందో చెప్పేందుకు సిగాచి ఘటన సజీవ సాక్ష్యమని.. పౌరసమాజం, ప్రజాసంఘాలు, మీడియా సిగాచి బాధితులకు చట్టపరమైన న్యాయం జరిగే వరకు నిరంతరం గళం వినిపిస్తూ పాలకులపై సామాజిక ఒత్తిడిని కొనసాగించాలని.. వ్యవస్థలో మార్పు వచ్చినప్పుడే భవిష్యత్తులో కార్మికుల ప్రాణాలు బలిపీఠాలు కాకుండా రక్షణ లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు విపత్తుకు ఏడాది పూర్తయిన సందర్భంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ సంగారెడ్డి జిల్లా చైర్మన్ వై.అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ఏఐటి యుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు,సైంటిస్ట్ బాబురావు మానవ హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు జీవన్ కుమార్, ఐఎఫ్‌టియూ అనురాధ, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్నెగంటి రవికుమార్, టియుసిఐ నుంచి ఎస్ఎల్ పద్మ తదితరులు పాల్గొని ప్రసంగించారు. సిగాచీ నరమేధం సృష్టించిన కన్నీటి గాథలు, పారిశ్రామికవాడల్లో నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయని... అమాయక వలస కార్మికుల రక్తంతో తడిసిన నేల మీద వెలసిన లాభాల సామ్రాజ్యం వెనుక ఉన్న అమానవీయతను, ప్రభుత్వ వ్యవస్థల నిర్లక్ష్యాన్ని లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు ఉద్ఘాటించారు. 54 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ప్రభుత్వం నియమించిన ఎక్స్‌పర్ట్ కమిటీ సమర్పించిన 128 పేజీల నివేదికలో ఫ్యాక్టరీలోని సాంకేతిక ఉల్లంఘనలను వెలుగులోకి వచ్చాయని తెలిపారు.

ప్రమాదానికి కంపెనీ బాధ్యత ఎంత ఉందో.. నిఘా పెట్టడంలో విఫలమైన ప్రభుత్వ వ్యవస్థలు కూడా అంతే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం కేవలం రూ. లక్షతక్షణ సాయంతో తన బాధ్యత ముగిసిందని భావించడం అత్యంత దుర్మార్గమన్నారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం సహాయం కింద రూ. 2 లక్షలు ప్రకటించినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పరిహారం 54 మందిలో కేవలం 43 కుటుంబాలకే అందాయంటే ప్రభుత్వాలకు కార్మికుల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్ దాఖలు చేసిన కారణంగా బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి పరిహారంలో ఇప్పటి వరకూ పాక్షికంగా రూ. 42 లక్షలు అందాయని.. ఘటన సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.కోటి అందాల్సి ఉందన్నారు. సగం కాలిపోయిన శరీరాలతో ప్రాణాలతో బయటపడిన క్షతగాత్రుల పరిస్థితి మరణించిన వారి కంటే దారుణంగా ఉందని వాపోయారు. ప్రమాదంలో కాలిపోయి చికిత్సపొందుతున్న రాజేష్‌కుమార్‌చౌదరి, దివ్య, సుష్మలకు కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఘటన సందర్భంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని.. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలని సమావేశానికి వచ్చిన బాధితులు డిమాండ్ చేశారు.

### ఉనికి కోసమే ఆర్ఎస్‌పి తప్పుడు ప్రచారం

## గురుకులాల టెండర్‌పై చర్చకు సిద్ధమా?

కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీశ్ సవాల్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** బిఆర్ఎస్ దొరల కాళ్ల కింద నలిగిపోతూ వాళ్లు చెప్పినట్టుగా సిఎం రేవంత్‌రెడ్డి మీద, కాంగ్రెస్ ప్రజా పాలన మీద తప్పుడు ప్రచారం చేస్తూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తన ఉనికికోసం తాపత్రయపడుతున్నారని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నేత సతీశ్ మాదిగ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన మాట్లాడారు. గురుకులాల టెండర్ల విషయంలో కుంభకోణం జరిగిందంటూ నిరాధార ఆరోపణలు, తప్పుడు ప్రచారం చేస్తూ హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్‌కు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అండగా నిలవటం సరి కాదన్నారు. ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా జాతీయ టెండర్ విధానం నియమ నిబంధనల ప్రకారం టెండర్లు కేటాయించారని తెలిపారు. మొత్తం టెండరు రూ.600 కోట్లు అయితే రూ.3వేల కోట్లు అవినీతి ఎలా జరిగిందని ఆర్ఎస్‌పిని ఆయన ప్రశ్నించారు. జూలై 2న ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం లేదా అమరవీరుల స్థూపం దగ్గరికి తెల్లనాగు హరీశ్‌రావు వస్తే మా మంత్రులు వస్తారని, ఒకవేళ ఆర్ఎస్‌పి వస్తే తాను టెండర్ పత్రాలతో వచ్చి సమాధానం చెప్తానని సతీశ్ మాదిగ సవాల్ విసిరారు. సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధులు మానవతా రాయ్, డాక్టర్ లింగం యాదవ్, మేడ రవిచంద్ర, కాపు ప్రతాప రెడ్డి పాల్గొన్నారు.

## ఈదమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్టాపన



**ప్రజాపక్షం/కవాడీగూడ:** ఈదమ్మ తల్లి అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. ఈ మేరకు గాంధీనగర్ దోబీఘాట్‌లోని ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ ఎ.పావని విచ్చేసి బిజెపి నేత ఎ.వినయ్ కుమార్, రత్న, సాయిచంద్, శ్రీకాంత్ తదితరులతో కలిసి పూజలు నిర్వహించారు.

## ఫీజులిచ్చేంతవరకు వదిలిపెట్టం

## ఇది ఆరంభమే.. మున్ముందు తీవ్ర ఉద్యమం

విద్యార్థుల హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడిలో ఎంపి. ఆర్.కృష్ణయ్య




**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** విద్యార్థులకు పెండింగ్ ఫీజులు చెల్లించేంతవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. కలెక్టరేట్‌ల ముట్టడి ఆరంభం మాత్రమేనని మున్ముందు మంత్రులు, ఎంఎల్‌ఎల క్యాంప్ ఆఫీస్‌లను ముట్టడిస్తూ ఉద్యమాన్ని తీవ్రతీరం చేస్తామని హెచ్చరించారు. పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, బిసి యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బిసి కులాల ఐక్యవేదిక అధ్యక్షులు అనంతయ్య సంయుక్త అధ్యక్షతన హైదరాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరుకాగా, వందలాది మంది విద్యార్థులు పాల్గొని, భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సిఎం రేవంత్‌రెడ్డి పదే పదే బడ్జెట్ లేదనటం పచ్చి అబద్ధమన్నారు. ఒక్కొక్క కాంట్రాక్టర్‌కు వేల కోట్లు పాత బకాయిలు చెల్లించారు, కానీ, 14 లక్షల మంది విద్యార్థులకు రూ.8వేల కోట్లు లేవా? అని ప్రశ్నించారు. పేద విద్యార్థుల కోసం వైఎస్ఆర్ ఫీజురీయంబర్స్‌మెంట్ స్కీం తెచ్చారని, తర్వాత కెసిఆర్ కొనసాగించారన్నారు. ప్రస్తుతం సిఎం రేవంత్‌రెడ్డి ఈ స్కీంను ఎత్తేసేందుకు యత్నిస్తున్నారని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, బిసి సంఘం అధ్యక్షులు సి.రాజేందర్ తదితర నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 30 రోజులు.. 7 ద్విచక్ర వాహనాలు



**ప్రజాపక్షం/మలక్‌పేట్:** విలాసవంతమైన జీవనశైలి, చెడు అలవాట్లలో భాగంగా డబ్బు సమకూర్చుకోవడం కోసం ఓ డిగ్రీ విద్యార్థిపై ఇప్పటికే 18 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. గడచిన 30 రోజుల్లో 7 ద్విచక్రవాహనాలను చోరీ చేసి చివరికి పోలీసులకు దొరికిపోయారు. ఈ మేరకు మలక్‌పేట్ పోలీసులు నిందితుడు బండ్రవల్లి రాకేష్ అలియాస్ రాఖీని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వివరాలలోకి వెళితే మలక్‌పేట్ సిఐ నరసింహ కథనం ప్రకారం.. రాకేష్ గడచిన నెలరోజుల్లో మలక్‌పేట్, చైతన్యపురి, వనస్థలిపురం, సరూర్‌గర్, నాగోల్, లాలాగూడ పీఎస్‌ల పరిధిలో ఏడు ద్విచక్రవాహనాలను దొంగిలించాడు. ఈ క్రమంలోనే వాటిని విక్రయించే ప్రయత్నంలో దొరికిపోయాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటింటికి 'సర్' ఫారాలు



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** సర్ ప్రక్రియలో భాగంగా బిజెపి ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ బిఎల్ఓలతో కలిసి సర్ ఫారాలను అందించి అవగాహన కల్పించారు. ఫారాలను జాగ్రత్తగా పూర్తి చేసి ఓటు హక్కును పొందాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రవి కృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా.. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని టిడిపి నేత, మాజీ కార్పొరేటర్ పనస బాల్‌రాజ్‌గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. చిక్కడపల్లిలో ఇంటింటికి ఎన్యుమరేషన్ ఫారంని అందజేశారు. కార్యక్రమంలో చంద్రమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిలిచిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ వెబ్‌సైట్

వినియోగదారులు, అడ్వకేట్లకు ఇబ్బందులు




**ప్రజాపక్షం/బహదూర్‌పురా:** గడచిన ఐదు రోజులుగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ వెబ్‌సైట్ పనిచేయపోవడంతో స్టాంప్ పేపర్ల అమ్మకాలకు రాష్ట్ర వ్యాప్తంగా అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా అఫిడవిట్లు, అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు, కోర్టు పనులపై ప్రభావం పడింది. మెయింటెనెన్స్ పేరిట తెలంగాణ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అఫిడవిట్లు, అగ్రిమెంట్లు, అడ్వకేట్లకు సంబంధించిన వివిధ దస్తావేజులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, కోర్టు వ్యవహారాలకు అవసరమైన స్టాంప్ పేపర్లు అందుబాటులో లేకపోవడంతో అనేక పనులు నిలిచిపోయాయి. సైట్ ఎప్పుడు పునరుద్ధరిస్తారు? అనేది తెలియక రోజంతా ఎదురుచూస్తూ నిరాశతో వెనుదిరుగుతున్నారు. క్యూర్ పరిధిలోని హైకోర్టు పరిసర ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల్లోని కోర్టుల వద్ద ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. సాధారణంగా ఒక్క గంటపాటు వెబ్‌సైట్ పనిచేయకపోయినా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుంది. అలాంటిది వరుసగా ఐదు రోజులుగా వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వానికి కూడా నష్టం కలిగే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్టాంప్ విక్రేతలు కూడా అమ్మకాలు లేక ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసర సేవగా పరిగణించాల్సిన ఈ అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని, భవిష్యత్తులో ఇటువంటి సాంకేతిక సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు, అడ్వకేట్లు, స్టాంప్ విక్రేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## బిసి కమిషన్ ఉపసంచాలకులు శ్రీనివాసరావుకు ఘన వీడ్కోలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రీనివాసరావు విధి నిర్వహణలో చూపిన నిబద్ధత ఆదర్శప్రాయమని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ముప్పైఏడున్నర సంవత్సరాలపాటు ప్రభుత్వ సేవలను అందించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల (బిసి) కమిషన్ ఉపసంచాలకులు ఉదారపు శ్రీనివాసరావు ప్రభుత్వ ఉద్యోగం నుంచి మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బిసి కమిషన్ కార్యాలయంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 1989లో స్టాటిస్టిషియన్‌గా ప్రభుత్వ సేవలో చేరిన శ్రీనివాసరావు వివిధ ప్రభుత్వ శాఖలు, కార్యాలయాల్లో అంకితభావంతో పని చేసి విశిష్ట సేవలు అందించిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. కార్యక్రమానికి అర్థగణాంక శాఖ సంచాలకులు రూఫస్ దత్తం, మాజీ సంచాలకులు జి. దయానందం, సంయుక్త సంచాలకులు రవీందర్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు హాజరై ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సభ్య కార్యదర్శి బి.బాల మాయా దేవి, కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు శ్రీనివాసరావు అందించిన సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎన్. సునీతతో పాటు బిసి కమిషన్ అధికారులు, సిబ్బంది, సహోద్యోగులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

## ట్రాఫిక్ ఏఎస్ఐ భాస్కర్‌కు సన్మానం



**ప్రజాపక్షం/కాచిగూడ:** ట్రాఫిక్ ఏఎస్ఐగా పనిచేసిన జి.భాస్కర్ మంగళవారం పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా కాచిగూడ ట్రాఫిక్ సిఐ వీర కౌశిక్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ భాస్కర్‌ను తోటి సిబ్బంది పూలమాలలువేసి, శాలువాలు కప్పి సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎస్ఐ వీరమల్లు, ఏఎస్ఐలు విజయకుమార్, జ్ఞానేశ్వర్, కేటి నాయక్, ఠాకూర్‌సింగ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన కమీటి ఎన్నిక

అధ్యక్షులుగా పి.దహిమా,
కార్యదర్శిగా పి.వి.నారాయణ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ గొప్ప సంప్రదాయాలను కొనసాగిస్తూ, వృత్తిపరమైన నైపుణ్యాన్ని మరింత పెంపొందించేందుకు కృషి చేస్తామని ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు ఎ.పి.దహిమా, కార్యదర్శి పి.వి.నారాయణ రావులు అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ 55వ వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం హైదరాబాద్ బషీర్ బాగ్‌లోని ఓ హోటల్‌లో నిష్క్రమిస్తున్న అధ్యక్షులు సిఎ చంద్రశేఖర్ వేముల అధ్యక్షతన జరిగింది. ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఐటిపి ఎ.పి.దహిమా, ఉపాధ్యక్షులుగా సిఎ కె.ఆదినారాయణ కోట, కార్యదర్శిగా సిఎ పి.వి.నారాయణ రావు, సంయుక్త కార్యదర్శిగా సిఎ నాగ ప్రవల్లిక వేముల, కోశాధికారిగా సిఎ పంకజ్ సంచేటిలతో పాటు ఏడు మంది గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు అడ్వొకేట్ ఎన్.వి.చారి, అడ్వొకేట్ సోమేశ్వర్ నెమ్మాని, సిఎ ప్రకాష్ చోక్డా, సిఎ శైలేందర్ శర్మ, సిఎ పంకజ్ చందక్, సిఎ లీలా కృష్ణ మోహన్, సిఎ ఆశిష్ జోషిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు సిఎ రామ్దేవ్ భుటాడా, సిఎ అమృత్ కుమార్ కోట సమక్షంలో ఎన్నికల అధికారి సిఎ హితేష్ జైన్ ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు 'ట్యాక్స్ బార్ అధికారిక లాపెల్ పిన్' ను ఆవిష్కరించారు.

## రాజకీయ కక్షతోనే అక్రమ కేసులు

గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్

**ప్రజాపక్షం/గోషామహల్:** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన 2022 నాటి వివాదాస్పద వ్యాఖ్యల కేసులో గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌కు ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. కోర్టు తీర్పు వెలువడిన అనంతరం రాజాసింగ్ మీడియాతో మాట్లాడారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, .రాజకీయ కక్షసాధింపు చర్యల కోసమే తనను 77 రోజుల పాటు అన్యాయంగా జైల్లో ఉంచారని అన్నారు. తాను ఏనాడూ ఏ మత విశ్వాసాలను, ఇతర దేవుళ్లను కించపరుస్తూ మాట్లాడలేదని, న్యాయవ్యవస్థపై ఉన్న నమ్మకం నేడు నిజమైందన్నారు.

## ఓటర్ లిస్ట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి



**ప్రజాపక్షం/నల్లకుంట:** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత గౌడ్ సూచించారు. ఈ మేరకు మంగళవారం డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో ఆమె బిఎల్ఓలతో కలిసి సర్ ప్రక్రియలో పాల్గొని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫామ్ లను అందజేశారు.

## ఆర్మీ స్టాఫ్ నూతన చీఫ్‌గా...
# జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతల స్వీకరణ



**న్యూఢిల్లీ :** ఆర్మీ స్టాఫ్ నూతన చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పదవీ విరమణ చేసిన జనరల్ ఉపేంద్ర ద్వివేదీ స్థానంలో ధీరజ్‌సేథ్ ఈ బాధ్యతలను చేపట్టారు. సాయుధ దళాలలో 40ఏళ్లకు పైగా విశిష్టమైన కెరీర్‌ను కలిగిన తర్వాత ధీరజ్ సేథ్‌కు ఆర్మీ స్టాఫ్ చీఫ్ పదవి దక్కింది. జనరల్ సేథ్ ఒక నిష్ణాతుడైన సైనిక అధికారిగా పేరొందారు. రెండు ఆపరేషనల్ ఆర్మీ కమాండ్‌లకు నాయకత్వం వహించిన అరుదైన ఘనతను కలిగి ఉన్నారు. స్వయం సమృద్ధి దిశగా పయనిస్తూ, సరిహద్దులోని భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొంటున్న 1.3మిలియన్ మిలియన్ల బలమైన బలగాల సారథ్యాన్ని ధీరజ్‌సేథ్ స్వీకరించారు. సేథ్ ఖడక్‌వాస్లాలోని జాతీయ రక్షణ అకాడమీ (ఎన్‌డిఎ) పూర్వ విద్యార్థి. ఆయన 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో నియమితులయ్యారు. 31వ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ (సిఓఎఎస్) కాకముందు వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేశారు. సాంకేతిక పురోగతులు, నిరంతరం మారుతున్న ఆధునిక యుద్ధ స్వరూపం కారణంగా సవాళ్లు మరింత స్పష్టం అవుతున్న తరుణంలో ప్రపంచ భౌగోళిక వ్యూహాత్మక వాతావరణం అస్థిరంగా ఉన్న సమయంలో ధీరజ్ సేథ్ సిఓఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఆర్మీ కమాండర్ హోదాకు పదోన్నతి పొందిన తర్వాత, ఆయన జైపూర్‌లోని సౌత్, సదరన్ కమాండ్‌కు జనరల్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్‌గా పనిచేశారని, తద్వారా రెండు ఆపరేషన్ కమాండ్‌లకు నాయకత్వం వహించిన అరుదైన ఘనతను సాధించారని అంతకు ముందు రక్షణ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన ఆయన మిలిటరీ కెరీర్‌లో కార్యాచరణ వ్యూహాత్మక, సంస్థాగత రంగాలలో విస్తృతమైన అనుభవాన్ని సంపాదించి, భారత్ సైన్యం యొక్క పోరాట సామర్థ్యానికి గణనీయంగా దోహదపడ్డారు.ఆర్మీ ప్రధానకార్యాలయంలోని వ్యూహాత్మక ప్రణాళిక, సామర్థ్య అభివృద్ధి విభాగాలలో అంతకుముందు కీలకమైన పదవులు నిర్వర్తించిన ఆయన దాని ఆధునీకరణ పథాన్ని, సామర్థ్య రోడ్ మ్యాప్‌ను, దీర్ఘకాలిక బలగాల పునర్నిర్మాణ కార్యక్రమాలను తీర్చిదిద్దారు. ఏప్రిల్ 1న ఆర్మీ వైస్ చీఫ్‌గా నియమితులవడానికి ముందు, ఆయన పుణే కేంద్రంగా ఉన్న సదరన్ కమాండ్‌కు అధిపతిగా ఉన్నారు. ఆయన నాయకత్వంలో గతేడాది ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ ఉన్నత స్థాయి కమాండ్ అత్యున్నత కార్యాచరణ సంసిద్ధతను కొనసాగించింది. దాదాపు నాలుగుదశాబ్దాల కాలంలో అతను తిరుగుబాటు నిరోధక అనుభవంతో సహా విభిన్న భూభాగాలలో, సంఘర్షణ వాతావరణాలలో అసాధారణమైన కార్యాచరణ నైపుణ్యాన్ని నిర్మించుకున్నారు.

భవిష్యత్‌లో యుద్ధాలు మరింత సమగ్రంగా ఉంటాయి : పదవీవిరమణ సందర్భంగా ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ భవిష్యత్తులో యుద్ధాలు మరింత సంయుక్తంగా, సమగ్రంగా, నిర్దిష్ట ఆధారిత రంగానికి పరిమితం అవుతాయని, అందువల్ల కలిసి చూడటం, కలిసి నిర్ణయాలు తీసుకోవడం, కలిసి చర్యలు చేపట్టడం సాయుధ దళాల నిర్దేశమని మంగళవార ం పదవీవిరమణ చేసిన ఆర్మీస్టాఫ్ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ అన్నారు. 40ఏళ్లకు పైగా సైనిక సేవచేసి మంగళవారం పదవీవిరమణ చేస్తున్న నిష్ణాతుడైన సైనిక నాయకుడు జనరల్ ద్వివేదీకి సౌత్ బ్లాక్ ప్రాంగణంలో జరిగిన లాంఛనప్రాయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమం సందర్భంగా జనరల్ ఉపేంద్ర ద్వివేదీ మీడియాతో మాట్లాడుతూ ' ఈ రోజు నేను ఆర్మీ చీఫ్‌గా పదవీవిరమణ చేసుకుంటున్న సందర్భంగా నాకు ప్రగాఢమైన కృతజ్ఞత, గర్వం, సంతృప్తి కలుగుతున్నాయి' అని అన్నారు. జనరల్ ద్వివేదీ 30వ ఆర్మీ స్టాఫ్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టి ఉన్నారు. 'సైనిక స్కూల్ నుంచి ఇప్పటి వరకూ నాజీవితంలో సాగిన ప్రయాణం అద్భుతమైనది. నాలుగు దశాబ్దాలకు పైగా భారత సైన్యానికి సేవ చేయడం నా జీవితంలో లభించిన గొప్ప అదృష్టం' అని ఆయన అన్నారు.

## ఒడిదుడుకులను తట్టుకుని
# నిలబడ్డ ఆర్థిక వ్యవస్థ

- రాజకీయ విభజన, ఎఐ మార్పులు, సైబర్ దాడులే రాబోయే సవాల్
- రిజర్వుబ్యాంకు ఆర్థిక స్థిరత్వ నివేదిక స్పష్టీకరణ




**ముంబై:** ప్రపంచవ్యాప్తంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనాగానీ దేశీయ ఆర్థిక వ్యవస్థ మాత్రం తట్టుకుని నిలబడిందని మంగళవారం విడుదలైన రిజర్వు బ్యాంకు ఆర్థిక స్థిరత్వ నివేదిక (ఎఫ్ఎస్ఆర్) వెల్లడించింది.ఐతే ప్రపంచవ్యాప్తంగా వస్తున్న భౌగోళిక రాజకీయ విభజన,శరవేగంగా మారుతూ అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ, సైబర్ నేరాల దాడులు ఆర్థిక వ్యవస్థకు భవిష్యత్ సవాలుగా ఉంటాయని రిజర్వుబ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ నివేదిక ముందుమాటలో గట్టి హెచ్చరిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణలు, సరఫరా వ్యవస్థలో అతితీవ్రమైన అంతరాయాలు కొనసాగుతున్నప్పటికీ,కృత్రిమ మేధ ఉత్పాదకత వల్ల భవిష్యత్తులో వచ్చే లాభాలపై బ్రహ్మాండమైన అంచనాలు ఉన్నందువల్ల ఆర్థిక వ్యవస్థ ఆశాభావంతో బలంగా నిలబడిందని పేర్కొన్నారు. కానీ ప్రపంచ వాతావరణ పరిస్థితులు శరవేగంగామారిపోతున్నందువల్ల సమీప భవిష్యత్తులో పరిణామాలపై అంచనాలు వేయలేని అనిశ్చిత పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నామని కూడా ముందుమాటలో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చాలా చెప్పుకోదగిన తీవ్రతతో దేశం వెలుపలి నుండి ఒడిదుడుకులు,బలమైన కుదుపులు ఎదురైనప్పటికీ ఆర్థిక వ్యవస్థ పట్టుజారిపోకుండా, సంక్షోభానికి అనుగుణంగా విస్తరించి తట్టుకుని నిలబడి ఎలాస్టిక్ తరహాలో తిరిగి యథాస్థితికి వచ్చిందని మల్హోత్రా పేర్కొన్నారు. బలమైన వృద్ధి,కనిష్ఠ ద్రవ్యోల్బణం,ఆరోగ్యకరమైన జమాఖర్చుల పత్రాలు,ఆర్థికేతర సంస్థల ఆరోగ్యం,నిల్వలు పుష్కలంగా ఉండటం వంటివన్నీ మనదేశ సూక్ష్మ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని రక్షిస్తూ వచ్చాయని ముందుమాటలో రాశారు. అంతేకాకుండా వ్యవస్థలు,విభాగాలు అప్రమత్తంగా వ్యవహరించడంవల్ల, తదుపరి సమస్యలు ఎదుర్కోవడానికి బలమైన సంకల్పం ప్రదర్శించడం కూడా ఉపయోగపడిందని రాశారు. బాహ్య ప్రపంచం నుండి ఎదురవుతున్న భౌగోళిక రాజకీయ సంఘర్షణలు పెరిగాయని, ఇవన్నీ విధాన నిర్ణేతలకు ఒక కీలకమైన సవాళ్ళుగా మారతాయన్న విషయంతో రిజర్వు బ్యాంకు ఏకీభవిస్తోందని పేర్కొన్నారు.

కాలానుగుణంగా, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తున్న దేశీయ బ్యాంకింగ్–బ్యాంకింగేతర వ్యవస్థల మద్దతుతో మన ఆర్థిక వ్యవస్థ ఎంతో బలంగా ఉందని ఎఫ్ఎస్ఆర్ నివేదిక పేర్కొంది. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు సురక్షితంగా ఉన్నాయని, శక్తిసామర్థ్యాలతో బలంగా పనిచేస్తున్నాయని, వీటికి బలమైన మూలపెట్టుబడులు, ద్రవ్యలభ్యత నిల్వలు, ఆస్తుల నాణ్యతా ప్రమాణాలలో నిరంతర మెరుగుదల, స్థిరమైన లాభదాయకత వంటివన్నీ మద్దతు ఇస్తున్నాయని పేర్కొంది. ఇక తదుపరి బయట నుండి వచ్చే శక్తిమంతమైన కుదుపులు, ఒడిదుడుకులను కూడా తట్టుకుని బ్యాంకింగ్ వ్యవస్థ మంచిస్థానంలో నిలబడగలదని సూక్ష్మ ఆర్థిక ఒత్తిడి పరీక్షా ఫలితాలు కూడా స్పష్టం చేశాయని తెలిపింది. సంక్షోభ సమయాలలో ఆర్థిక వ్యవస్థలు తట్టుకుని నిలబడగలావా?లేదా? అనే విషయాన్ని నిర్ధారించేందుకు ప్రతిదేశంలోని కేంద్ర బ్యాంకులు లేదా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ సూక్ష్మ ఆర్థిక ఒత్తిడి పరీక్షలు నిర్వహిస్తాయి. ఒత్తిడి ఎదురైనాగానీ మూలధన నిష్పత్తులు మన అధీనంలో, మనకు అనుకూలంగా ఉంటాయా?లేదా? అనే విషయాన్ని నిర్ధారించడానికి ప్రతికూల పరిస్థితులను ఊహాజనితంగా అంచనావేస్తారు. మొత్తంమీద చూసినప్పుడు ఒడిదుడుకులను తట్టుకుని దేశీయ ఆర్థిక వ్యవస్థ సౌకర్యవంతమైన రీతిలో నిలబడగలిగిందన్న విషయాన్ని సరాసరి మూలధన నిష్పత్తులు తెలియజేశాయని నివేదిక పేర్కొంది. అదేవిధంగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సి) కూడా బలమైన మూలధనం, ఆరోగ్యకరమైన లాభదాయకత,ఆస్తుల నాణ్యతా ప్రమాణాల మెరుగుదల మద్దతుతో శక్తిమంతంగా నిలబడ్డాయి.

## మోదీ మౌనం...
# ప్రజా విశ్వాసంపై నేరుగా దాడి

రామమందిరం నిధుల చోరీపై కాంగ్రెస్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై తీవ్ర వివాదం చెలరేగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ స్పందిస్తూ ఈ దోపిడీపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడం దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల విశ్వాసంపై నేరుగా దాడి చేయడమేనని పేర్కొంది. శ్రీరాముడిని దర్శించుకుని ఆశీస్సులు పొందేందుకు తమ ప్రతినిధి బృందం మంగళవారం అయోధ్యను సందర్శించాల్సి ఉండగా, ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారని ఆ పార్టీ తెలిపింది. 'శ్రీరామ మందిరంలో జరిగిన దోపిడీపై ప్రధాని మోదీ మౌనం వహించడం కోట్లాది మంది ప్రజల మత విశ్వాసంపై నేరుగా దాడి చేయడమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'ఎటువంటి పారదర్శక ప్రమాణాలు లేదా ప్రజా సంప్రదింపులు లేకుండానే మోదీ ప్రభుత్వం 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్'ను ఏర్పాటు చేసి, అందులో ఆర్ఎస్ఎస్ సభ్యులను నియమించింది. ఆ తర్వాత, ఆ ట్రస్ట్ మొత్తాన్ని సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) పరిధి నుండి మినహాయించింది. మోదీ గారూ, మీ మౌనాన్ని వీడండి' అని రమేశ్ అన్నారు. అయోధ్యకు చేరుకున్న వెంటనే, భయంతో వణికిపోయిన బిజెపి ప్రభుత్వం తనను హోటల్ వద్ద పోలీసులు అరెస్టు చేసి వాహనంలో తీసుకెళ్లిందని అజయ్ రాయ్ అర్ధరాత్రి సమయంలో చేసిన పోస్ట్‌కు స్పందనగా రమేస్ ఈ వ్యాఖ్యలు చేశారు. బిజెపి ప్రభుత్వ నియంతృత్వ ధోరణి తారాస్థాయికి చేరిందని, శ్రీరాముడిని దర్శించుకుని ఆశీస్సులు పొందేందుకు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ ప్రతినిధి బృందం మంగళవారం అయోధ్యను సందర్శించాల్సి ఉందని, అయితే తాను అయోధ్యకు చేరుకోగానే, భయపడిన బిజెపి ప్రభుత్వం పోలీసులను మోహరించి తనను హోటల్ వద్ద అరెస్టు చేయించి జీపులో తీసుకెళ్తోందని అని రాయ్ పేర్కొన్నారు.

## మహాయుతి అభ్యర్థిగా శివసేన
# (యుబిటి) నేత అహిర్ నామినేషన్

ఉద్ధవ్ థాక్రే వర్గానికి మరో షాక్



**ముంబయి :** మహారాష్ట్రలో శివసేన(యుబిటి)లో మరో కుదుపు ఏర్పడింది. ఆ పార్టీ నాయకుడు సచిన్ అహిర్ మంగళవారం ప్రత్యర్థి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని వర్గం తరపున మహారాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పదవికి నామినేషన్‌ను దాఖలు చేశారు. శివసేన (యుబిటి) నాయకుడు ఆదిత్య థాక్రేకు అత్యంత సన్నిహితుడైన అహిర్ తీసుకున్న ఈ అనూహ్యమైన చర్య, ఆరుగురు ఎంపిలు ప్రతిపక్ష పార్టీని వీడి అధికార షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన కొద్ది రోజులకే చోటుచేసుకుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, సునేత్ర పవార్‌ల సమక్షంలో మహాయుతి అభ్యర్థిగా అహిర్ నామినేషన్‌ను సమర్పించారు. ఎమ్మెల్సీ జగన్నాథ్ అభ్యాన్ మహా వికాస్ అఘాడి అభ్యర్థి అని సేన (యుబిటి) నాయకుడు అంబాదాస్ దాన్వే ధృవీకరించారు. కాగా, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మంగళవారం నాడు సేన (యుబిటి) ఎమ్మెల్సీ సచిన్ అహిర్‌ను పార్టీ కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు కలిగిన క్షేత్ర స్థాయి నాయకుడిగా అభివర్ణించారు. ఆయన 'మహాయూతి' కూటమితో చేరాలన్న నిర్ణయం శివసేనను మరింత బలోపేతం చేస్తుందని షిండే పేర్కొన్నారు. 'శివసేన శాసనసభ్యులు గతంలో సచిన్ అహిర్‌ను శాసనమండలికి ఎన్నుకున్నారు, ఇప్పుడు అధికార పక్షం మండలి డిప్యూటీ చైర్మన్ పదవికి ఆయనకు మద్దతు ఇస్తోంది' అని షిండే విలేకరులతో అన్నారు. మాజీ సహాయ మంత్రి అయిన అహిర్, బిజెపి నేతృత్వంలోని మహాయూతి కూటమి మద్దతుతో డిప్యూటీ చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారని, కూటమికి ఉన్న సంఖ్యాబలం దృష్ట్యా ఆయన సులభంగా ఎన్నికయ్యే అవకాశం ఉందని షిండే తెలిపారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నిక జూలై 1న జరగనుంది.

విధాన భవన్ రికార్డుల ప్రకారం, అహిర్ ఆరేళ్ల ఎమ్మెల్సీ పదవీకాలంలో ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి.

# రామాలయ విరాళాలు చోరీ ఆందోళనకరం

ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దు : మాయావతి



**లక్నో :** అయోధ్యలోని రామ మందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం లేదా అపహరణ ఆరోపణలను అత్యంత తీవ్రమైన, ఆందోళనకరమైన అంశంగా బిఎస్‌పి అధినేత్రి మాయావతి అభివర్ణించారు. అయితే ఈ అంశాన్ని రాజకీయాకరించవద్దని హెచ్చరించారు. 'అయోధ్యలోని శ్రీరామ మందిరానికి సమర్పించిన కానుకల చోరీ, దుర్వినియోగం లేదా అపహరణకు సంబంధించి ప్రతిరోజూ వస్తున్న వార్తలు అత్యంత తీవ్రమైనవి, ఆందోళనకరమైనవిగా ఉన్నాయని మంగళవారం ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష చూపకూడదు, కానీ ఈ విషయాన్ని రాజకీయాకరించడం కూడా సరైనది కాదన్నారు. భవిష్యత్తులో భక్తులు సమర్పించే కానుకల విషయంలో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసేందుకు, దేశంలోని ఇతర ప్రముఖ ఆలయాలు అనుసరిస్తున్న విరాళాలు, కానుకల లెక్కల నిర్వహణ విధానాన్ని ఇక్కడ కూడా పాటించి ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవడం సముచితమని హితవు పలికారు. 'రాజకీయాల్లో నేరీకరణ, నేరాల రాజకీయాకరణ, మత రాజకీయాకరణ, రాజకీయాలను గుడ్డిగా మతపరంగా మార్చడం వంటివన్నీ నివారించాలి. ఇది రాజ్యాంగబద్ధంగా, సముచితంగా ఉంటుంది. దేశం, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా రాజకీయ పార్టీలకు బిఎస్‌పి ఇస్తున్న సలహా ఇదే. దేశ ప్రజలకు చేస్తున్న విజ్ఞప్తి కూడా ఇదే' అని ఆమె ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. అయోధ్య రామమందిరంలో విరాళాల దుర్వినియోగానికి సంబంధించి అయోధ్య పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు జరుపుతున్న తరుణంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

## రక్షణమంత్రి రాజ్‌నాథ్‌పై
# 'విశేషాధికార ఉల్లంఘన' చర్యలు

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ లేఖ



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాటి ఘటనలో అబద్ధాలపై చెప్పడంపై రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఉగ్రవాద దాడి తర్వాత ఏ భారతీయ సైనికుడూ వీరమరణం పొందలేదని చెప్పడం ద్వారా పార్లమెంటును తప్పుదోవ పట్టించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌పై 'విశేషాధికార ఉల్లంఘన' చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ నేత కె.సి. వేణుగోపాల్ మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. సభను తప్పుదోవ పట్టించినందుకు గాను, లోక్‌సభ కార్యకలాపాల నిర్వహణ నియమావళిలోని రూల్ 223 కింద రక్షణ మంత్రిపై విశేషాధికార ఉల్లంఘన నోటీసును వేణుగోపాల్ ఆ లేఖలో సమర్పించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి, తదనంతరం జరిగిన 'ఆపరేషన్ సిందూర్'పై చర్చల సందర్భంగా, భారతీయ సైనికులకు ఎటువంటి హానీ జరగలేదని జులై 28, 2025న రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారని వేణుగోపాల్ తెలిపారు. అయితే, ఆ తర్వాత 'ఆపరేషన్ సిందూర్'లో ఆరుగురు సాయుధ దళాల సిబ్బంది మరణించారని ఒక ప్రకటన వెలువడిందని వేణుగోపాల్ చెప్పారు. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్'లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని సభలో రక్షణ మంత్రి చేసిన ప్రకటన స్పష్టంగా తప్పుదోవ పట్టించేలా, వాస్తవ విరుద్ధంగా ఉంది. సభలో మంత్రి తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం లేదా సమాచారాన్ని దాచిపెట్టడం అనేది విశేషాధికార ఉల్లంఘన, పార్లమెంటు ధిక్కరణ కిందకు వస్తుందనేది సుస్పష్టం. ఈ విషయంలో రక్షణ మంత్రిపై విశేషాధికార ఉల్లంఘన చర్యలు చేపట్టాలని కోరుతున్నాను' అని పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ అయిన వేణుగోపాల్ అన్నారు. శత్రువుల నుండి దేశాన్ని రక్షించే క్రమంలో వారు తమ ప్రాణాలను అర్పించారు, కానీ జాతీయవాద ప్రభుత్వమని చెప్పుకునే ఈ ప్రభుత్వం వారి అమరత్వం గురించి అబద్ధాలు చెప్పిందని ఋగోపాల్ మండిపడ్డారు.

## నిరసనకారులను
# వైరస్‌తో పోల్చుతారా?

- ఉగ్రవాదులని అంటారా?
- ప్రధాన్, నితీన్ నబీపై సిజెపి వ్యవస్థాపకుడు దీప్కే మండిపాటు
- ప్రధాన్ అనే వైరస్‌కు వ్యాక్సిన్‌లాంటి వారమని వ్యాఖ్య
- 11 రోజూ కొనసాగిన సిజెపి నిరసన ప్రదర్శన

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) చేపట్టిన నిరసన మంగళవారంతో పదకొండవ రోజుకు చేరుకుంది. అయితే గత మూడు రోజులుగా పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహారదీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోయాయి. దీంతో సోనమ్ ఆరోగ్యపరిస్థితిపై సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో, పరీక్షల నిర్వహణలో అక్రమాలు, ఈ ఆందోళన పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై దీప్కే విమర్శలను తీవ్రతరం చేశారు. నిరసనకారులను 'వైరస్'తో పోలుస్తూ బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన డిప్కే, నిరసనకారుల పట్ల ఉపయోగించిన భాషపై ప్రశ్నలు లేవనెత్తారు. విద్యాశాఖ మంత్రి నిరసనకారులను 'ఉగ్రవాదులు'గా అభివర్ణించడం, బిజెపి అధ్యక్షుడు వారిని 'వైరస్'తో పోల్చడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. వాస్తవానికి, నిరసనకారులు విద్యార్థుల సమస్యలు, జవాబుదారీతనం గురించే మాట్లాడుతున్నారని ఆయన గుర్తుచేశారు. 'మేము వైరస్ కాదు. ధర్మేంద్ర ప్రధాన్ అనే వైరస్‌కు మేము వ్యాక్సిన్ లాంటి వాళ్ళం' అని ఆయన అన్నారు. రాజస్థాన్ పారామెడికల్ కౌన్సిల్ పరీక్షా పత్రాల లీకేజీ సమస్యను కూడా డిప్కే ప్రస్తావించారు. పరీక్షల నిర్వహణ వ్యవస్థలో వైఫల్యాల చరిత్ర ఉందని ఆయన ఆరోపించారు. జైపూర్‌లోని ఒక కళాశాల నుండి ప్రశ్నపత్రం లీక్ అయిందని, ఇటీవలి కాలంలో అనేక పరీక్షలలో అక్రమాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. 'ఇది కేవలం నీట్ పేపర్ లీకేజీకి సంబంధించిన సమస్య మాత్రమే అని అనుకోవద్దు. ఈ రోజు మీరు గళం విప్పకపోతే, రేపు మీ పరీక్షా పత్రం కూడా లీక్ కావచ్చు, మీ ఉద్యోగం కూడా ప్రమాదంలో పడవచ్చు అని ఆయన హెచ్చరించారు. భయం కారణంగా నిరసనలో పాల్గొనకుండా యువతను నిరుత్సాహపరచవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులను ఆయన కోరారు. విద్యతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ ఈ సమస్య ప్రభావితం చేస్తుందని పేర్కొంటూ ఈ ఉద్యమంలో చేరాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు. జంతర్ మంతర్ వద్ద ప్రవేశంపై ఉన్న ఆంక్షల గురించి ప్రస్తావిస్తూ, దీప్కే మాట్లాడుతూ ప్రధాన బృంద సభ్యులు, మద్దతుదారులను నిరసన స్థలం వద్ద అడ్డుకున్నారని, అయితే గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల కొందరికి ప్రవేశం నిరాకరించబడిందని వివరించారు. జంతర్ మంతర్‌లోకి వెళ్లడానికి సాధారణ పౌరుడికి కూడా గుర్తింపు కార్డు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. అంతకుముందు, నిరసన స్థలం వద్ద భారీగా పోలీసులను మోహరించారని, రైతు నాయకులు మరియు విద్యార్థి కార్యకర్తలు అక్కడికి రాకుండా అడ్డుకుంటున్నారని దీప్కే ఆరోపించారు. పలువురు రైతు నాయకులను గృహనిర్బంధంలో ఉంచారని పేర్కొన్న ఆయన, పరీక్షా పత్రాల లీకేజీకి (పేపర్ లీక్) పాల్పడిన వారిపై అటువంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. భద్రతను నిర్వహించడం కంటే నిరసనకారుల ఏర్పాట్లను అడ్డుకోవడమే లక్ష్యంగా ఆ ప్రదేశంలో పోలీసుల ఉనికి ఉందని దీప్కే ఆరోపించారు. ప్రభుత్వ స్పందనను విమర్శిస్తూ, ఈ పరిస్థితికి ప్రధాన్ బాధ్యత వహించాలని దీప్కే అన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీని కూడా లక్ష్యంగా చేసుకుని, విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించడానికి బదులుగా ప్రభుత్వం రాజకీయ కార్యకలాపాలపై దృష్టి సారించిందని ఆరోపించారు. ప్రధాని రాజకీయ వ్యవహారాల్లో పార్టీలను చీల్చడం, ఎంపిలను కొనుగోలు చేయడం, విదేశీ పర్యటనలు, 'మెలోడీ చాక్లెట్ బహుమతిగా ఇవ్వడం' వంటి వాటిలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రధాన్‌దే బాధ్యత అని పేర్కొన్న ఆయన, మొదటి సంఘటన జరిగినప్పుడే మంత్రి రాజీనామా చేసి ఉండాల్సిందని అన్నారు. ఇదిలా ఉండగా నిరాహారదీక్షలో పాల్గొన్న సోనమ్ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోంది. వాంగ్‌చుక్ రక్తపోటు 117/60, ఆక్సిజన్ స్థాయి 96, నాడి వేగం 92గా నమోదయ్యాయని నిర్వాహకులు వెల్లడించారు. ఆయన రక్తంలో చక్కెర స్థాయి 66గా ఉందని, ఇది సాధారణ స్థాయి కంటే తక్కువ అని వారు తెలిపారు. జంతర్‌మంతర్ వద్ద తీవ్రమైన ఎండ ఉందని, అటువంటి పరిస్థితుల్లో ఆహారం లేకుండా ఉండటం కష్టమన్నారు. తాము ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నామని వాంగ్‌చుక్‌ను పరీక్షించిన వైద్యుడు చెప్పారు. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిని తీవ్రంగా పరిగణించాలని సిజెపి ప్రతినిధి అశుతోష్ రంకా అన్నారు. ఆయనకు ఏమైనా జరిగితే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా శ్రీ **మహమ్మద్ జహీర్ s/o మహమ్మద్ కాజా,** నివాసం ఇ.నెం: 1-1-94/1/3/3, హాజీపూర కోరుట్ల వాస్తవ్యులు మా క్లయింట్ తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ ఇంటికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ నెం.**1242/2005** పోయినది. ఈ లింక్ డాక్యుమెంట్స్‌కు సంబంధించిన ఆస్తి వివరాలు ఇ.నెం. 1-1-94/1/3/3, హాజీపుర కోరుట్ల, సర్వే నెంబర్: 318, విస్తీర్ణం 225.48 చ.గ.లు. దీని యొక్క **హద్దులు:** తూర్పు: గంగారం ఖాళీ స్థలం, పడమర: అమ్మిన వారి ఖాళీ స్థలం, ఉత్తరం: కొంచెం చంద్రప్రకాష్ గారి ఇల్లు, దక్షిణం: రోడ్డు, కావున ఇట్టి దస్తావేజులు గాని ఆస్తిపై గాని ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల రాతపూర్వక ఆధారాలతో (15) రోజులలో క్రింది చిరునామాలో కలవారిని సంప్రదించగలరు తదుపరి వచ్చిన అభ్యంతరములు ఆక్షేపణలు చెల్లనేరవు.

ఇట్లు
**చేన్నమనేని అమరేందర్ రావు**
MBA, L.L.M
న్యాయవాది
H No: 1-2-254, ప్రకాశం రోడ్
కోరుట్ల, జగిత్యాల జిల్లా
సెల్ : 9441 276 075

बैंक ऑफ़ इंडिया Bank of India BOI
**ఆర్‌కె పురం శాఖ**
ప్లాట్ నం.4. ఆఫీసర్స్ కాలనీ, రామకృష్ణాపురం,
సికింద్రాబాద్, తెలంగాణ-500056.
ఫోన్ నం.: 040- 277941250, 27790476
ఇ మెయిల్ :- RKpuram.Telangana@bankofindia.bank.in

**ఇండియన్ కాంట్రాక్టర్ యాక్ట్ ప్రకారం హైపోథెకేటీ హక్కులను వినియోగించుకుంటూ సెక్యూర్డ్ క్రెడిటార్ జారీ చేసిన నోటీసు.**

రిఫ్.నం.: RKP/CR/26-27/05 — తేది : 24.06.2026

టు,
నూజెళ్ల రవి శంకర్, హౌ.నం. 10-610/71, 1వ అంతస్తు, నేతాజి నగర్, సాయి ధరణి కాలనీ, నగరం-500083.
సార్/మేడం,

**విషయం : రీకాల్ నోటీసు**

1. మీ అభ్యర్థన మేరకు, బ్యాంక్ మీకు వివిధ రుణ పరిమితులను మంజూరు చేసింది. మేము మంజూరు చేసిన రుణ సదుపాయాల వివరాలు మరియు వాటి క్రింద చెల్లించవలసిన బకాయి మొత్తాలను క్రింద తెలియజేయడమైనది :

| సౌకర్యం స్వభావం | మంజూరైన పరిమితి | 23.06.2026 వరకు బకాయి మొత్తం |
|---|---|---|
| స్టార్ వెహికల్ లోన్ (టిఎల్) | Rs.7,00,000 | Rs.4,91,748.42 |

బ్యాంకు మంజూరు చేసిన పై పేర్కొన్న రుణ సదుపాయాలకు ఈ క్రింది ఆస్తులు/ సెక్యూరిటీస్ (బ్యాంకుకు తాకట్టు పెట్టబడిన ఆస్తుల వివరాలు) సెక్యూర్డ్‌గా ఉన్నాయి.
ఎ) నాలుగు చక్రాల వాహనం మారుతి ఇగ్నిస్ జీటా **1.2L 5MT BSVI –,TS08JL9779** పై హైపోథెకేషన్

2. మౌఖికంగా మరియు లిఖితపూర్వకంగా మేము పదేపదే అభ్యర్థనలు మరియు రిమైండర్లు పంపినప్పటికీ, మీరు ఇప్పటివరకు పైన పేర్కొన్న బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమయ్యారని మరియు నిర్లక్ష్యం వహించారని తెలియజేయడానికి చింతిచడమైనది, తత్ఫలితంగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసిన ఆదేశాలు/మార్గదర్శకాలకు అనుగుణంగా మీ ఖాతాను తేది **08.01.2026న ఎన్‌పిఏగా** వర్గీకరించబడింది.
3. మాకు చెల్లించవలసిన బకాయిలను మీరు చెల్లించడంలో విఫలమయ్యారనడంలో, నిర్లక్ష్యం వహించారనడంలో ఎటువంటి సందేహం లేదు.
4. ఏదిఏమైనా, మీకు మరొక మరియు చివరి అవకాశాన్ని కల్పిస్తూ, పైన పేర్కొన్న బకాయి మొత్తాలను, వాటిపై తదుపరి వడ్డీ మరియు (ఏవైనా) సంబంధిత ఖర్చులు ఉంటే వాటితో పాటు క్రింద పేర్కొన్న **15 రోజుల గడువులోగా** చెల్లించవలసిందిగా మిమ్మల్ని మరోసారి కోరడమైనది. ఒకవేళ మీరు అలా చేయడంలో విఫలమైతే, బ్యాంక్ మరియు సాధారణ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా మీ పేరు, బకాయి వివరాలు, ఫోటో మరియు ఇతర సమాచారాన్ని బహిర్గతం చేయడంతో పాటు మాకున్న అన్నీ చట్టపరమైన హక్కులను వినియోగించుకోవలసి వస్తుందని తెలియజేయడమైనది.
5. ఈ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవడానికి మరియు మాకు తాకట్టు పెట్టిన, హైపోథెకేట్ చేసిన మరియు చార్జ్ చేసిన సెక్యూరిటీలను అమలు చేయడానికి మాకున్న ఇతర హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా ఈ నోటీసు మీకు ఇవ్వబడిందని దయచేసి గమనించగలరు.
6. బ్యాంకు నిధులు ప్రజల సొమ్ము అని, తమకు రావాల్సిన బకాయిలను తప్పనిసరిగా వసూలు చేయడం బ్యాంకుకు చట్టపరమైన బాధ్యతతో పాటు నైతిక బాధ్యత కూడా అని మీరు ఖచ్చితంగా గుర్తిస్తారని ఆశిస్తున్నాము. ఇకపై మీరు మమ్మల్ని నిరాశపరచరని, అలాగే బ్యాంకు చేపట్టే చట్టపరమైన లేదా వసూలు చర్యలను నివారించడానికి గాను తేది **08.07.2026న** లేదా అంతకంటే ముందే, అప్పటి వరకు వర్తించే వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో పాటు మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లిస్తారని ఆశించడమైంది.
7. ఒకవేళ **08.07.2026న** లేదా అంతకు ముందే, వడ్డీ మరియు ఇతర ఖర్చులు/ఛార్జీలతో పాటు మీ బకాయి మొత్తాన్ని మేము స్వీకరించని పక్షంలో, విస్తృత ప్రచారంలో ఉన్న వార్తాపత్రికలలో మీ ఫోటో మరియు ఇతర వివరాలను ప్రచురించడమే కాకుండా, సర్ఫేసీ/ హైపోథికేషన్ యాక్ట్ క్రింద చర్యలు తీసుకోవడానికి మరియు ఆ మొత్తాన్ని నోటీసు తేది నుండి వాస్తవ వసూలు తేది వరకు వడ్డీతో మరియు సంబంధిత ఖర్చులతో పాటు రాబట్టడానికి డెట్స్ రికవరీ ట్రిబ్యునల్/ అప్రోప్రైయిట్ కోర్ట్‌లో మీపై చట్టపరమైన చర్యలు ప్రారంభించడానికి మేము వెనుకాడమని తెలియజేయడమైనది.

**ప్రదేశం : హైదరాబాద్**
**తేది : 24.06.2026**
**సం/- అధికృత అధికారి**
**బ్యాంక్ ఆఫ్ ఇండియా**

# బ్రిటన్‌లో మౌలిక సదుపాయాలు రద్దు

## రక్షణ రంగానికి మరో 15 బిలియన్ పౌండ్లు




**లండన్:** బ్రిటన్ రక్షణ రంగానికి అదనంగా మరో 15 బిలియన్ పౌండ్లు కేటాయిస్తున్నట్లు ఆ పద్ధర్మ ప్రధానమంత్రి సర్ కీర్ స్టార్‌మర్ ప్రకటించారు. ఎంతో కాలంగా అందరూ ఎదురుచూస్తున్న వ్యయ ప్రణాళికను ప్రకటించడానికి ముందుగా స్టార్‌మర్ మంగళవారం ఈ ప్రకటన చేశారు.బ్రిటన్ రక్షణ రంగ వ్యయం 2029 నాటికి సంవత్సరానికి 80 బిలియన్ పౌండ్ల స్థాయికి చేరకుంటుందని చెప్పారు. దీనికోసం కొన్ని రహదారి, ఇంథన ప్రాజెక్టులను కూడా రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలను నివారించాల్సిన అవసరం ఉందని,యుద్ధాలను నివారించాలంటే అత్యుత్తమమైన మార్గం యుద్ధానికి సన్నద్ధంగా ఉండటమేనని అన్నారు. ప్రపంచదేశాలు ఆయుధాలు సమకూర్చుకుంటున్నప్పుడు, యుద్ధాన్ని నివారించాలంటే యుద్ధానికి సన్నద్ధంగా ఉండాలన్నారు. బ్రిటన్ సాయుధ బలగాలు డ్రోన్లు, ఇతర స్వయంప్రతిపత్తిగల ఆయుధాలను సమకూర్చుకోవడానికి వీలుగా రక్షణ పెట్టుబడి ప్రణాళిక (డిఐపి)లో ఐదు బిలియన్ పౌండు కేటాయించారు. యుద్ధ నౌకలను, యుద్ధ విమానాలను ఈ ప్రణాళికలో భాగంగా సమకూర్చుకుంటారు. రాయల్ నేవీలో ప్రస్తుతం ఉన్న యుద్ధ నౌకలను స్వయం చలన నౌకలుగా కృత్రిమ మేధస్సును జోడించి ఆధునీకరించేందుకు, కొత్తగా ఆరు యుద్ధ నౌకలను సమకూర్చుకోవడానికి ఈ డిఐపిలో నిధులు సమకూర్చారు.బ్రిటన్ అణుశక్తిసామర్థ్యాలు పెంచుకోవడం,కొత్త జలాంతర్గాములు,వార్ హెడ్స్ సమకూర్చుకోవడంఈ ప్రణాళికలో ఉన్నాయి.

# మళ్లీ భూకంపం పారిపోయిన సహాయక బృందాలు

**• వెనెజులాలో ఏడు రోజుల్లో 600 సార్లు భూ ప్రకంపనలు • 15,866 మంది నిరాశ్రయం • 58,870 నివాసాలు ధ్వంసం:నాసా అంచనా**

**కారకస్:**వెనెజులాలో మరోసారి భూకంపం వచ్చింది. సహాయ కార్యక్రమాలలో నిమగ్నమైన బృందాలు భయంతో అక్కడి నుండి పరుగులుతీసి పారిపోయారు. గడచిన బుధవారం (జూన్ 24) జంట భూకంపాలు విధ్వంసం సృష్టించిన తర్వాత ఏడు రోజుల్లో 600 సార్లు సంభవించిన భూ ప్రకంపనలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. శిథిలాల్లో సజీవులకోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ దశలో మంగళవారం రిచ్‌టర్ స్కేలుపై 4.6 తీవ్రతతో నమోదైన భూకంపం చూసి సహాయ బృందాలు భయపడి పరుగులు తీశాయి. కారబెల్లా ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. కానీ ఎలాంటి నష్టం వాటిల్లలేదు. ఆ తర్వాత మళ్ళీ గాలింపు చర్యలు తిరిగి మొదలయ్యాయి. కోస్తాతీర పట్టణం లాగువైరాలో రోడ్డు పక్కడ బిజీగా ఉండే ప్రదేశంలో నిర్మించి 12 అంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. ఈ శిథిలాల నుండి ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి.

**పెద్ద సంఖ్యలో విదేశీ సహాయ బృందాలు గాలింపు చర్యల్లో పాల్గొంటున్నాయి.**

దజన్లసంఖ్యలో దేశాలు వెనిజులాకు సహాయం పంపుతున్నాయి. అమెరికా నుండి ఇప్పటివరకూ లభించిన సహాయం 300 మిలియన్ డాలర్లు దాటింది. ప్రతిరోజు సి–17 రకానికి చెందిన 24 విమానాలు అమెరికా నుండి వెనెజులాకు సహాయాన్ని చేరవేస్తున్నాయి.కాగా, భూకంప మృతుల సంఖ్య 1720కి పెరిగింది. గడచిన 100 సంవత్సరాల వెనిజులా చరిత్రలో మళ్ళీ మొదటిసారి సంభవించిన మానవతా సంక్షోభంపైనే ప్రపంచ దేశాలు దృష్టి కేంద్రీకరించాయి. కానీ కనీస సదుపాయాలు లేకపోవడంతో ప్రజలకు ప్రభుత్వంపై ఆగ్రహం పెరుగుతోంది. కానీ ఈ సంక్షోభ సమయంలో పత్రికలు రాజకీయ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకుండా మానవ సంక్షోభానికే ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఎమర్జెన్సీ వర్కర్లు శిథిలాల్లోంచి ఒక వ్యక్తిని వెలికితీసుకువస్తున్న వీడియోను దేశాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ షేర్ చేశారు. అదే సమయంలో మాజీ అధ్యక్షుడు నికొలస్‌మదురో ఫుటేజీని కూడా షేర్ చేశారు. తమ బృందాలు నిద్రాహారాలు మాని సహాయ చర్యలు చేస్తున్నారని పేర్కొన్నారు.గడచిన వారం రోజుల్లో ఇప్పటివరకూ వందలసార్లు భూమి ప్రకంపాలు సంభవిస్తున్నాయి. ఒక్క వెనిజులా మాత్రమే కాకుండా, జపాన్,కొలంబియా,పెరూ,చిలీ,ఫిలిప్పీన్స్ తదితర దేశాలలో కూడా ఈ వారం రోజుల్లో భూమి కంపించింది. ఇదిలా ఉండగా, శిథిలాల్లో చిక్కుకుపోయిన వెనిజులా పౌరులకు ఇప్పటివరకూ ఉన్న ''గోల్డెన్ పీరియడ్'' గడువు ముగిసిపోవడంతో తీవ్ర ఆందోళన చెందిన ఐక్యరాజ్యసమితి మృతదేహాలకోసం 10,000 సంచులను సిద్ధం చేసింది. వెనెజులాలో దాదాపు మూడు కోట్లమంది భూకంపంవల్ల నష్టపోయి ఉంటారని, శిథిలాల్లో మరణాలు చాలా గణనీయస్థాయిలో ఉంటాయని ఐక్యరాజ్యసమితి అంచనావేసింది. భూకంపంవల్ల 855 భవనాలు కుప్పకూలాయని రోడ్రిగ్జ్ ప్రకటించగా, దాదాపు 58,870 భవానాలు కూలిపోవడం,తీవ్రంగా ధ్వంసం కావడం జరిగిందని శాటిలైట్ ద్వారా పరిశీలించిన నాసా ప్రాథమికంగా అంచనావేసింది. ఈ పరిస్థితులమధ్య వెనిజులానా పునర్నిర్మాణ చర్యలకు సహాయం చేస్తామని చైనా ప్రకటించింది. అమెరికా మిత్రదేశం ఇజ్రాయెల్ కూడా మానవతాసహాయం ప్రకటించింది. ఇదిలా ఉండగా, వెనిజులా భూకంపంవల్ల 15,866 మంది నిరాశ్రయమైనట్లు లెక్కలు తేల్చారు. వీరికోసం లాగువైరా ఓడరేవులో శిబిరం ఏర్పాటు చేశారు. ఇంకోవైపు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రభుత్వంపై ప్రజలకు తీవ్ర అసహనం,ఆగ్రహం పేట్రేగుతున్నాయి. వారికి కనీస మౌలిక సదుపాయాలు కూడా లభించడంలేదు. ఇదే సరైన సమయంగా భావించిన ప్రతిపక్ష నాయకురాలు,ట్రంప్ భక్తురాలు మచాడో ప్రభుత్వ వ్యతిరేక విమర్శలతో రంగ ప్రవేశం చేశారు. విదేశాల నుండి లభించే సహాయం బాధితులకు తక్షణం అందేట్టు చూడాలని కోరారు. దేశం ఈ విపత్తును ఐక్యంగా ఎదుర్కొంటుందన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో గగనతలాన్ని మూసేసినందువల్ల తాను దేశానికి రాలేకపోతున్నానని ఈ పాపం డెల్సీ రోడ్రిగ్జ్‌దేనని విమర్శించారు.



# చైనా సంపన్నుడికి అమెరికాలో జైలు శిక్ష



**న్యూయార్క్:**చైనాకు చెందిన ఒకనాటి వ్యాపారవేత్త,ఆ దేశ అత్యంత సంపన్నులలో ఒకడైన గ్వో వెన్ గ్వీకి ని అమెరికా న్యూయార్క్ నగర న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది. ఆయనకు 30 సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. ఒకనాడు చైనాలో ప్రముఖ వ్యాపారి,చైనా సంపన్నుడు వెన్‌గ్వీకి తర్వాత కాలంలో చైనా నుండి పారిపోయి అమెరికా చేరుకున్నారు. మైల్స్,గ్వో,హోవాన్స్ క్వోక్ వంటి అనేక మారుపేర్లు ఆయనకు ఉన్నాయి. కమ్యూనిస్టు వ్యతిరేకిగా,కమ్యూనిస్టు విమర్శకుడుగా పేరు సంపాదించారు. ధనాన్ని లెక్కల్లో చూపించకుండా అక్రమ మార్గాల్లో తరలించి రా జమార్గంలో ఖర్చుపెట్టేందుకు ప్రయత్నించడం, మనీ లాండరింగ్, దోపిడీ, మోసం వంటి చర్యల కు పాల్పడి చివరకు న్యాయస్థానం ముందు దోషిగా తేలారు. చైనాలో ప్రజాస్వామ్యాన్ని స్థాపించాలని కోరుకునే వారందరి నుండి వెన్‌గ్వీకి డబ్బు దోచుకున్నారని, తన విలాసవంతమైన జీవనశైలికి ఈ నిధులు ఉపయోగించుకున్నారని న్యాయమూర్తి అనలిసా టోర్రెస్ పేర్కొన్నారు.క్రిక్కిరిసిన కోర్టు హాలు మధ్య ఆమె తీర్పు చెప్పారు.

# ఉక్రేన్ నగరాలపై రష్యాదాడి: 10 మంది మృతి



**మాస్కో:**ఉక్రేన్‌లోని మూడు నగరాలు సహా పలు ప్రాంతాలలో రష్యా ప్రతీకార దాడులు చేసింది. ఈ దాడులలో 10 మంది మరణించారు. దజన్ల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు.రష్యాలో మరో చమురు రిఫైనరీని ఉక్రేన్ ధ్వంసం చేసింది. డ్రోన్ దాడులు చేయడంతో దక్షిణ ప్రాంతంలో ఉన్న రష్యా ఆయిల్ రిఫైపరీ మంటల్లో దగ్ధమైంది. నివాసిత ప్రాంతాలు,మౌలిక సదుపాయాలపై ఎక్కువగా దాడులు జరిగాయి. గడచిన ఇరవైనాలుగు గంటల్లో 18 కమ్యూనిటీలలోని 29 నివాసిత ప్రాంతాలపై దాదాపు 100 దాడులు జరిగినట్లు స్థానిక ఉక్రేన్ అధికారులు చెప్పారు.ఖార్కివ్,జపోరిఝియా,ఖేర్సన్ ప్రాంతాలలో ఈ దాడులు జరిగాయి. అదేవిధంగా ఉక్రేన్ కూడా రష్యాపై దాడులు చేయగా, 419 డ్రోన్లు కూల్చివేసినట్లు సంబంధిత అధికారులు చెప్పారు. అదేవిధంగా క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ, సామాన్య ప్రజలపై ఉక్రేన్ దాడిచేసి చంపుతోందని, మానవ హక్కులను ఉల్లంఘించిందని పేర్కొంటూ ఆ దేశ నేరపూరిత చర్యలను అంతర్జాతీయ ప్రపంచం దృష్టికి తెచ్చారు.

**వారం రోజుల్లో 42 మంది రష్యన్లు మృతి**

గడచిన వారం రోజులుగా ఉక్రేన్ చేసిన భీకర దాడుల్లో వివిధ ప్రాంతాలలో ఇద్దరు మైనర్లు సహా 42 మంది రష్యన్ పౌరులు మరణించినట్లు ఆ దేశ విదేశాంగశాఖ రాయబారి రోడియన్ మిరోష్నిక్ చెప్పారు. మరో 287 మంది తీవ్రంగా గాయపడిన ట్లు టాస్ వార్తాసంస్థకు మంగళవారం చెప్పారు. బెల్గొరోడ్, వోరోనెజ్, డోనెట్స్క్ పీపుల్స్ రిపబ్లిక్, ఖే ర్సన్ ప్రాంతాలలో ఎక్కుమంది రష్యన్లు మరణించారని చెప్పారు. గతవారంలో భారీ దాడులవల్ల 330 మంది ప్రజలు ప్రభావితులయ్యారని చె ప్పారు. వీరిలో ఎక్కువ మంది ఉక్రేన్ డ్రోన్ల దాడుల కారణంగానే మరణించారని చెప్పారు. శత్రువులు రష్యాలో రీమోట్‌తో పేల్చడానికి వీలుగా మందుపాతరలు అమర్చడానికి డ్రోన్లు ఉపయోగించారని చెప్పారు. రష్యాలో వైద్య సదుపాయాలు, అత్యవసర రవాణాపై కూడా దాడులు చేశాయని చెప్పారు. రష్యా దక్షిణ ప్రాంతంలో డ్రోన్ దాడులతో ఆయిల్ రిఫైనరీలను ధ్వంసం చేసింది. దీనివల్ల రష్యాలో చమురు సంక్షోభం ఏర్పడింది.

# గాజాలో డ్రోన్ దాడులు: 8మంది మృతి



**దైర్–అల్‌బలాహ్:**గాజాలో ఇజ్రాయెల్ డ్రోన్లతో దాడులు చేసింది. మంగళవారం చేసిన ఈ దాడుల్లో ఎనిమిదిమంది పాలస్తీనియన్లు మరణించారు. ఆరోగ్య అధికారులు,అత్యవసర బృందాలు చెప్పిన సమాచారం ప్రకారం సోమవారం పొద్దుపోయాక ఐడిఎఫ్ దైర్–అల్ బలాహ్‌లో చేసిన దాడుల్లో ఇద్దరు పిల్లలు సహా ఎనిమిది మంది మరణించగా మరో 20 మంది గాయపడ్డారు. ఖాన్ యూనుస్‌లో హెచ్చరిక దాడుల తర్వాత అల్–మవాసిలో గుడారాలపై జరిగిన దాడుల్లో తల్లీ,బిడ్డ మరణించారు. నాస్సర్ ఆసుపత్రి చెప్పిన వివరాలు ప్రకారం, ఖరారా పట్టణంలో జరిగిన దాడుల్లో 30 ఏళ్ళ వ్యక్తి మరణించాడు.గర్భవతిగా ఉన్న అతడి భార్య సజీవంగా ఉంది. ఖాన్‌యూనుస్‌లో గుడారంపై జరిగిన దాడిలో ఇద్దరు మరణించగా 13 మంది గాయపడ్డారు. 2023 అక్టోబరులో గాజాలో మొదలైన మారణహోమం 2025 అక్టోబరులో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంతో ముగిసింది. కానీ అప్పటి నుండి ఇజ్రాయెల్ సైన్య వేలసార్లు ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఈ సందర్భాలలో జరిగిన దాడుల్లో ఇప్పటివరకూ 1,045 మంది మరణించారు. వీరిలో 300 మంది మహిళలు,పిల్లలు ఉన్నారు.70 శాతం గాజా ప్రాంతం ఇప్పటికే ఇజ్రాయెల్ అధీనంలో ఉంది.

**సైప్రస్‌లో గాజా శాంతిమండలి మీట్**

సైప్రస్‌లో గాజా శాంతి మండలి (గాజా బోర్డ్ ఆఫ్ పీస్) సమావేశం ఈ వారంలోనే జరుగుతుంది. ట్రంప్ నాయకత్వాన ఆవిర్భవించిన ఈ శాంతి మండలి ఇప్పటివరకూ సాధించిన పురోగతిని సమీక్షించి తదుపరి చర్యలు తీసుకుంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన వాషింగ్టన్ డి.సి శాంతి మండలి ప్రారంభ సమావేశం జరిగింది. యుద్ధానంతరం గాజా నిర్వహణలో భాగం పంచుకుంటున్న పాలకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హమాస్ స్థానంలో కొత్త పాలకులను నియమించడం,గాజాలో ప్రవేశించేందుకు ఉద్దేశించిన అవసరమైన సాంకేతిక నిపుణులను సిద్ధం చేసేందుకు ఈ సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. నిజానికి గతవారం ఈజిప్టు తీరప్రాంత పట్టణం ఐన్‌సోఖ్నాలో ఒక సమావేశం నిర్వహించింది.

# తలెత్తుకునేలా పాలన

**(మొదటి పేజీ తరువాయి)**

పరువు తీశారని, ప్రస్తుతం ప్రజాపాలనలో ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని సిఎం గుర్తు చేశారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించినట్లు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ నిలిపివేస్తారనే దుష్ప్రచారం చేశారని, కానీ రైతులకు ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇచ్చిందన్నారు. 2004లో అప్పటి సిఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో ఏడు గంటలు ఉచిత కరెంటు ఇవ్వడమే కాకుండా అప్పటివరకు ఉన్న విద్యుత్ బకాయిలను రద్దుచేసి, రైతులపై ఉన్న క్రిమినల్ కేసును కొట్టేసిందని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బజార్లను ప్రవేశపెడితే, బిఆర్ఎస్ ప్రభుత్వంలోని కెసిఆర్ హయాంలో గల్లికో బెల్టు షాపులను పెట్టి పెద్దలను కాకుండా పిల్లల్ని కూడా తాగుబోతులను తయారు చేసిందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్, 12 ఏళ్ల బిజెపి పాలనపై చర్చ పెట్టేందుకు తాము సిద్ధమేనని, ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని, అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం తెలంగాణలో కేవలం కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు మాతోనే ఉద్యోగాలు కట్టబెట్టిందని సిఎం రేవంత్ రెడ్డి ఎద్దేవ చేశారు. బెంగాల్‌లో మాదిరిగా తెలంగాణలో అధికారంలోకి వస్తామని పగల్బాలు పలుకుతున్నారని, అక్కడ 15 ఏళ్లు పట్టింది, కానీ, ఇక్కడ అధికారంలోకి రానిచ్చేందుకు మన రైతన్నలు సిద్ధంగా లేరని తెలిపారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలో అప్పుల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చామని, అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సుతో పాటు వెయ్యి బస్సులకు, అనేక పెట్రోల్ బంకులకు, సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు యజమానులను చేయడం జరిగిందన్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీలో రూ.1000 కోట్లు విలువచేసే భూమి ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల ద్వారా తయారుచేసిన వస్తువులను విక్రయించుకునేందుకు మార్కెట్ సౌకర్యాన్ని కల్పించిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కిందన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని పడగొట్టి.. మళ్లీ అధికారంలోకి వస్తాం అనుకుంటున్నా.. బిఆర్‌ఎస్ నేతలకు బిడ్డ మేం దిగిపోవడానికి మీ అయ్యా జాగీర్ కాదు. ఇక్కడ ఉన్నది దుక్కి దున్నే చేతులన్నాయని రేవంత్ తీవ్రంగా హెచ్చరించారు. కెసిఆర్ మళ్ళీ అధికారంలోకి వస్తే భార్యాభర్తల ఫోన్ వినడం తప్ప చేసేదేమీ లేదని, ఇది స్వయానా ఆయన కూతురు చెప్పిన విషయమే అన్నారు. తాను ఉన్నది ఉన్నట్లు చెప్తానని కానీ ఇది కాదంటాను.. పదవి శాశ్వతం కాదు. మాట శాశ్వతం అని. మాటకోసం ఎంతకైనా నిలబడతానని, ఉన్నది చెప్తా. చెప్పింది చేస్తా అని సిఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. వర్షాలు ఈ సంవత్సరం తక్కువగా ఉంటాయని, శాస్త్రవేత్తలు చెప్పారు. తక్కువ నీళ్లతో పండే పంటలను వేసుకోవాలని, తాము చెప్తే, కల్వకుంట్ల కుటుంబం.. మొత్తం ఒకరిని మించి ఒకరు పడి పడి అబద్ధాలు చెప్తున్నారని, వారికి బుద్ధి లేకపోతే దేవుడే క్షమించడని అన్నారు.





**రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

అంతకుముందు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీని క్రమబద్ధంగా అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ వంటి కార్యక్రమాల ద్వారా రైతాంగానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

**రైతులకు స్థిరమైన ఆదాయం : మంత్రి తుమ్మల**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులకు స్థిరమైన ఆదాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా, పంటల కొనుగోళ్లు, పంటల వైవిధ్యీకరణ, ఆయిల్ పామ్ విస్తరణ, ఎరువుల డిజిటల్ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

**వనరులు మరింత బలోపేతం : మంత్రి ఉత్తమ్**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, వరి ధాన్యం కొనుగోళ్లు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. సన్న వరివంగడాలు సాగు చేసే రైతులకు బోనస్ అందజేస్తామని, సాగునీటి వనరులను మరింత బలోపేతం చేసి తెలంగాణను సస్యశ్యామలంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపిలు వేం నరేందర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, బలరాం నాయక్, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర రైతు సంఘం చైర్మన్ కోదండ రెడ్డి, వివిధ సంస్థల చైర్మన్లు చల్లా నర్సింహా రెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి చిలుక మధుసూదన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు కిరణ్మయి, చంద్రా రెడ్డి,

ఉన్నతాధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# 3 టిపిఎస్‌లు (మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేయాలని విద్యా కమిషన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. దీంతో తెలంగాణ విద్యా కమిషన్ మూడు నెలల కాలపరిమితిలో పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులను ముమ్మరం చేసింది. వంగూరు, పోల్కంపల్లి, మంచాల టిపిఎస్‌లో ఆధునిక తరగతి గదులు, స్మార్ట్ క్లాస్‌రూములు, డిజిటల్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు, పరిశుభ్రమైన క్యాంపస్ వాతావరణం వంటి అన్ని మౌలిక సదుపాయాలతో ఈ పాఠశాలలను తీర్చిదిద్దే దిశగా అధికారులు వేగంగా పని చేస్తున్నారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ప్రత్యేక పర్యవేక్షణలో ఇప్పటికే ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ పూర్తయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం విద్యాకమిషన్ మిగిలిన మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రాజెక్టుల పనుల వేగాన్నికూడా పెంచింది. వంగూరు, మంచాల, పోల్కంపల్లి టిపిఎస్ నిర్మాణ పనులు, నాణ్యత,తదితర అంశాలను కమిషన్ నిరంతరం పరిశీలిస్తోంది. మూడు టిపిఎస్ నిర్మాణ పనుల బాధ్యతలను ముగ్గురు విద్యా కమిషన్ సభ్యులకు అప్పగించారు. వంగూరు టిపిఎస్ పర్యవేక్షణ బాధ్యతలను డాక్టర్ చారకొండ వెంకటేష్, మంచాల టిపిఎస్‌బాధ్యతలను జోష్నా శివారెడ్డి, పోల్కంపల్లి టిపిఎస్ పనులను ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**ఎస్‌ఎంసి సభ్యులకు ప్రత్యేక బాధ్యతలు**

మూడు నెలల్లో ఈ మూడు పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఆ పనులను విభజించి, స్కూల్ ప్రిన్సిపల్ నేతృత్వంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసి) సభ్యులకు అప్పగించింది. ప్రతి పనికి ముగ్గురు చొప్పున ఎస్‌ఎంసి సభ్యులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిర్మాణాల పురోగతి, నాణ్యత, అవసరమైన సదుపాయాల కల్పనను ఎప్పటికప్పుడు సమీక్షించనుంది. ప్రతి బుధవారం, శనివారం ఎస్‌ఎంసి సభ్యులు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని విశ్లేషిస్తున్నారు. ఈ పనులను విద్యా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తూ ఎస్‌ఎంసి సభ్యులను మానిటరింగ్ చేస్తోంది.

**'ప్రయోగాత్మకం' ఫలిస్తే.. ఇక అన్ని జిల్లాలకు విస్తరణ....**

మూడు ప్రాంతాల్లో చేపడుతున్న ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యా వాతావరణం కల్పించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.

# సిజెఐకి లేఖ

**(మొదటి పేజీ తరువాయి)**

జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా తెలిపారు. జూన్ 8, 2026న జరిగిన 'ఇండియా' కూటమి సమావేశానికి 21 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర ఎంపి హాజరు కాగా, ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియ, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తికి ఉమ్మడి లేఖ రాయాలని ఆ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు రమేశ్ పేర్కొన్నారు. ఆ నిర్ణయం మేరకు, 23 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర ఎంపి సంతకాలు చేసిన ఉమ్మడి లేఖను మంగళవారం భారత ప్రధాన న్యాయమూర్తికి పంపినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, వామపక్ష పార్టీల నాయకులు, స్వతంత్ర ఎంపి కపిల్ సిబల్ తదితరులు ఈ ఉమ్మడి లేఖపై సంతకాలు చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, డిఎంకె కూడా ఈ లేఖపై సంతకాలు చేశాయని టిఎంసి నేత డెరెక్ ఓబ్రియన్ తెలిపారు. ''ఇండియా' కూటమి మంచి ముందడుగు వేసింది. ఆప్, డిఎంకె కూడా సిజెఐకి పంపిన ఉమ్మడి లేఖపై సంతకాలు చేశాయి' అని ఆయన చెప్పారు. ఈ లేఖ ఇండియా కూటమిలోని అన్ని పార్టీల సమష్టి కృషి ఫలితమని ఓబ్రియన్ తర్వాత మీడియాతో అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వల్ల కోట్లాది మంది ఓటు హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఇండియా కూటమి ఆందోళన వ్యక్తం చేసింది. సరైన ధృవీకరణ లేకుండా పేర్లు తొలగించే పరిస్థితులు తలెత్తితే ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంది. అలాగే ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, స్వతంత్రత కొనసాగాలని, ఎన్నికల సంఘం తీసుకునే చర్యలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయకుండా ఉండాలని లేఖలో ప్రస్తావించినట్లు సమాచారం.

**కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే విమర్శలు**

ఇండియా జనబంధన్ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రజాస్వామ్య సంస్థలు ఒత్తిడికి గురవుతున్నాయని, రాజ్యాంగంపై నిరంతర దాడులు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఓటరు జాబితా సవరణ పేరుతో ప్రజల ఓటు హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని, కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఒత్తిడి తీసుకురావడానికి ఉపయోగిస్తున్నారని విమర్శించారు. బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలపై వివక్ష కొనసాగుతోందని కూడా ఆరోపించారు. దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, నిరుద్యోగ సమస్య తీవ్రమవడం, కొత్త పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడం వంటి అంశాలను కూడా ఖర్గే ప్రస్తావించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని, పరీక్షల నిర్వహణలో లోపాల కారణంగా యువత ఆశలు దెబ్బతింటున్నాయని అన్నారు. మొదట ఇండియా కూటమి సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగినప్పటికీ, అన్ని పార్టీలు ఒకే వేదికపైకి వస్తాయా అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ తర్వాత ఆప్, డిఎంకె కూడా సంయుక్త లేఖకు మద్దతు తెలిపాయి. దీంతో ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాల్లో విపక్షాలు మరోసారి ఏకతాటిపైకి వచ్చాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇక ఈ లేఖపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఎలాంటి స్పందన వ్యక్తం చేస్తాయన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# పరోక్ష చర్చలే...

**(మొదటి పేజీ తరువాయి)**

పేర్కొంది. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు వ్యతిరేకంగా జరిగే ఎలాంటి దురాక్రమణ చర్యలనైనా తక్షణమే నిర్ణయాత్మకంగా ప్రతిఘటిస్తామని ఆ దేశ విదేశీమంత్రిత్వశాఖ హెచ్చరించింది.

ముందుగా నిర్దేశించిన ప్రకారం అమెరికా సంప్రదింపుల ప్రతినిధి బృందం మంగళవారం దోహాకు చేరుకుంది. ఇరాన్ ప్రతినిధులు కూడా దోహాకు బయలుదేరేముందుగా విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ పైవిధంగా వివరణ ఇచ్చారు. రాబోయే కొద్దిరోజులపాటు అమెరికా అధికారులతో స్థాయిలోనూ ఎలాంటి ప్రత్యక్ష సమావేశాలకు అవకాశం లేదని పత్రికాగోష్ఠిలో చెప్పారు.

అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్,పశ్చిమాసియాలో ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్‌విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్ ఖతార్ కీలక నగరం దోహాకు చేరుకున్నారు. హోర్ముజ్ జలసంధి సమస్యను పరిష్కరించడంపైనే ప్రధానంగా ఈ చర్చల్లో రెండు దేశాల ప్రతినిధులూ దృష్టి కేంద్రీకరిస్తారని తొలుత వార్తలు వచ్చాయి. కాగా రెండు రోజుల పాటు దాడులు,చర్చలవిషయంలో భిన్నాభిప్రాయాల మధ్య మళ్ళీ చమురు ధరలు పెరిగాయి.

ఇరాన్ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఇస్లామాబాద్ ఒప్పందానికి అమెరికా కట్టుబడి ఉంటే తాము కూడా ఈ ఎంఓయును గౌరవిస్తామని,మనసా,వాచా కర్మణా ఈ ఎంఓయును ఆచరిస్తామని స్పష్టం చేశారు. ఇరాన్‌కు ట్రంప్ చేస్తున్న బెదిరింపులు అర్థరహితమని కొట్టిపారేశారు. ఈ ఎంఓయు ఒకే వీధికి ఉన్న రెండు దారుల వంటిదని, 'వారు' కట్టుబడి ఆచరిస్తే, తాము కూడా కట్టుబడి ఒప్పంద నిబంధనలు అమలు చేస్తామన్నారు.

హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఆధిపత్యాన్ని తిరస్కరించిన అమెరికా ఒమన్‌కు సమీపంలో ఉన్న ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాణిజ్య నౌకల రాకపోకలు సాగించేందుకు ప్రయత్నాలు చేసింది. ఈ ప్రయత్నాలను ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాము నిర్దేశించిన అధికారిక మార్గాలలోనే వాణిజ్య నౌకలు ప్రయాణం చేయాలని, ప్రయాణ సమయంలో ఈ నౌకలు తమ సిబ్బంది,అధికారులతో సమన్వయంతో, అనుసంధానంలో ఉండాలని షరతులు విధించింది. ఇదే విషయంపై అమెరికా–ఇరాన్ మధ్య వివాదం ముదిరి రెండు రోజులపాటు పరస్పర దాడులు చేసుకున్నాయి. ఆ తర్వాత సంయమనం పాటించి దాడులు నిలిపివేయాలని, సంభాషణలు చేయాలని నిర్ణయించాయి. ఇరాన్ చేసిన విజ్ఞప్తి మేరకే ఖతార్ నగరం దోహాలో సాంకేతిక చర్చలకు రంగం సిద్ధమైనట్లు ట్రంప్ సోమవారం ప్రకటించారు. కానీ ఇప్పుడు ఇరాన్ నేరుగా సంభాషణలకు అవకాశం లేదని స్పష్టం చేసింది.

అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించడానికి,పశ్చిమాసియాలో శాంతి,సుస్థిరతలు తిరిగి తీసుకురావడానికి వీలుగా జూన్ 17,18 తేదీలలో ''ఇస్లామాబాద్ ఒప్పందం''పై సంతకాల ప్రక్రియ పూర్తయింది. దాని ప్రకారం స్విట్జర్లాండ్‌లో సాంకేతిక చర్చలు జరిగాయి. ఆ తర్వాత హోర్ముజ్ జలసంధిని తెరవడం,జలమార్గాల విషయంలో విభేదాలతో జూన్ 27,28 తేదీలలో అమెరికా–ఇరాన్ పరస్పర దాడులకు పాల్పడ్డాయి. తర్వాత సర్దుకుని సాంకేతిక చర్చలకు వెళ్ళాలని నిర్ణయించాయి. 14 అంశాలతో కూడిన తాత్కాలిక ఒప్పందం ప్రకారం, 60 రోజుల పాటు కాల్పుల విరమణతోపాటు ఈ గడువులోపు మిగిలిపోయిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి ఒక బృహత్తర ప్రణాళికను అమలు చేసేందుకు రెండు దేశాలూ అంగీకరించాయి.

**సుంకాల వసూలుకు ఒమన్ తిరస్కృతి**

కాగా హోర్ముజ్ జలసంధిలో ప్రయాణించే నౌకల నుండి సుంకాలు,ఫీజుల వసూళ్ళను ఒమన్ ప్రభుత్వం తిరస్కరించింది. ఐతే ఈ ప్రాంతంలో ప్రయాణించే నౌకల నుండి సముద్ర సేవల ఛార్జీలు వసూలు చేసే విషయం చర్చించేందుకు తాము సుముఖంగా ఉన్నామని ఒమన్ విదేశాంగమంత్రి బదర్ అల్బుసైదీ చెప్పారు. జలసంధిలో మందుపాతరలకు ఇరాన్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఇటీవల ఉద్రిక్తతలు అమెరికా–ఒమన్ సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపించలేదన్నారు. పరస్పర గౌరవం–సహకారంపైనే ద్వైపాక్షిక సంబంధాలు ఆధారపడి ఉంటాయన్నారు.

కీలక వ్యూహాత్మక హోర్ముజ్ జలమార్గంలో వెళ్ళే నౌకల నుండి ఎలాంటి రుసుములను వసూలు చేయడానికి తాము సమర్థించబోమని మాంటోకార్లో ఇంటర్నేషనల్ రేడియోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.ఐతే మలక్కా,సింగపూర్ జలసంధులలో నౌకల నుండి సముద్ర సేవల ఛార్జీలు వసూలు చేస్తున్నారని, అందువల్ల నౌకాయాన భద్రత,కాలుష్య నివారణ,అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు వీలుగా యంత్రాంగాల ఏర్పాటు అంశాన్ని పరిశీలించవచ్చునన్నారు. హోర్ముజ్ జలసంధిలో నౌకాయానం,జలసంధి నిర్వహణ,భవిష్యత్ కర్తవ్యాలపై ఇరాన్–ఒమన్ దేశాల ముఖ్యనేతలు జూన్ 23న మస్కట్‌లో సమావేశమై ఒక ఉమ్మడిఅంగీకారానికి వచ్చారు. సముద్ర సేవలపై చర్చలు జరపడానికి ఒక సంయుక్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి.

# బ్రెజిల్ కమాల్.. పోరాడి ఓడిన జపాన్

సాకర్ ప్రపంచకప్‌లో ఐదుసార్లు చాంపియన్ బ్రెజిల్ మరోసారి స్థాయికి తగ్గ ప్రదర్శనతో దుమ్మురేపింది. టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగి గ్రూప్ దశలో రెండు విజయాలతో నాకౌట్‌కు చేరిన సాంబా జట్టు.. రౌండ్ ఆఫ్ 32లోనూ సత్తా చాటింది. సోమవారం రాత్రి హోస్టన్ స్టేడియం వేదికగా జపాన్‌తో ఆఖరివరకూ రసవత్తరంగా సాగిన పోరులో 2–1తో ప్రత్యర్థిని చిత్తుచేసి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించింది. బ్రెజిల్ తరఫున కెస్మిరొ (56వ నిమిషంలో), గాబ్రియెల్ మార్టినెల్లి (90+5 వ) చెరో గోల్ చేయగా జపాన్ నుంచి కైషు సానొ (29వ) ఏకైక గోల్ సాధించాడు. తొలి అర్ధభాగం లో జపాన్ ప్రత్యర్థిని నిలువరించినా సెకండాఫ్‌లో సాంబా టీమ్ రెచ్చిపోయింది. ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగిన ఆ జట్టు కెస్మిరొ గోల్‌తో స్కోర్లను సమం చేసింది. నిర్ణీత సమయంలో 1–1తో స్కోర్లు సమం కాగా ఇంజురీ టైమ్లో బ్రూనో గైమెరియస్ ఇచ్చిన పాస్‌ను గాబ్రియెల్ గోల్ చేసి బ్రెజిల్‌ను ప్రిక్వార్టర్స్ చేర్చాడు.



## కెనడా జోరు...

ఫిఫా ప్రపంచకప్‌లో సహ ఆతిథ్య దేశంగా ఉన్న కెనడా తమ జోరు కొనసాగిస్తున్నది. సాకర్ వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారి నాకౌట్ దశకు అర్హత సాధించిన ఆ జట్టు.. మరో సంచలన ప్రదర్శనతో సౌతాఫ్రికాను చిత్తుచేసి రౌండ్ ఆఫ్16కు దూసుకెళ్లింది. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం ఉత్కంఠగా సాగిన పోరులో కెనడా.. 1–0తో సఫారీలను ఓడించి ప్రిక్వార్టర్స్ బెర్తును దక్కించుకుంది.

## రసవత్తర పోరులో నెదర్లాండ్స్ ఓటమి

ఫిఫా వరల్డ్ కప్‌లో మరో మ్యాచ్ థ్రిల్లర్‌గా సాగింది. నెదర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో మొరాక్కొ పెనాల్టీ షూటౌట్లో విజయం సాధించింది. మాంటెర్రిలో జరిగిన మ్యాచ్‌లో తొలుత రెండు జట్లు 1–1 గోల్స్‌తో డ్రా చేసుకున్నాయి. అయితే షూటౌట్లో మొరాక్కోను విక్టరీ వరించింది. దీంతో ప్రీ క్వార్టర్స్‌లోకి ఎంట్రీ ఇచ్చింది మొరాక్కో. వాస్తవానికి రెండు జట్లు ఆరంభం నుంచి హోరాహోరీగా పోటీపడ్డాయి. ఫస్ట్ హాఫ్లో మొరాక్కో కాస్త ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఇక రెండో హాఫ్లో నెదర్లాండ్స్ ప్లేయర్ గాపో 72వ నిమిషంలో గోల్ చేసి ఆ జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. కానీ మ్యాచ్ ముగిసే సమయానికి మొరాక్కో అద్భుతంగా ఓ గోల్ చేసింది. 91వ నిమిషంలో ఇస్సా డయోప్ కొట్టిన గోల్తో మ్యాచ్ డ్రా అయ్యింది. ఎక్స్ టైంలో రెండు జట్లు గోల్స్ చేయలేదు. దీంతో పెనాల్టీ షూటౌట్ ఆడాల్సి వచ్చింది. డచ్ ఆటగాళ్లు మూడు స్పాట్ కిక్లను కోల్పోయారు. ఇస్మాయిల్ సైబరి గోల్ చేయడంతో 32 గోల్స్ తేడాతో మొరాక్కో స్టన్నింగ్ విక్టరీ నమోదు చేసింది.

## జర్మనీ ఔట్..

నాలుగు సార్లు వరల్డ్ కప్ గెలిచిన జర్మనీ.. టోర్నీ నుంచి ఔట్ అయ్యింది. పరాగ్వేతో జరిగిన థ్రిల్లర్ పెనాల్టీ షూటౌట్లో జర్మనీ ఓడింది. తొలుత రెండు జట్లు ఎక్స్ట్రా టైంలోనూ 1–1 గోల్స్‌తో సమంగా నిలిచాయి. కానీ పెనాల్టీ షూటౌట్లో 4–3 తేడాతో పరాగ్వేను విజయం వరించింది. పరాగ్వే గోల్ కీపర్ ఓర్లాండో గిల్ అద్భుతమైన రీతిలో గోల్ కీపింగ్ చేశాడు. జర్మనీ టాప్ ప్లేయర్లు కేయి హర్వేజ్, నిక్ వోల్ట్మేడ్ కొట్టిన గోల్స్ ఓర్లాండో గిల్ అద్భుతంగా సేవ్ చేశాడు. ఇప్పటి వరకు వరల్డ్ కప్ చరిత్రలో అయిదు సార్లు జర్మనీ పెనాల్టీ షూటౌట్ ఆడింది. మొదటిసారి ఆ దేశం షూటౌట్లో చేతులెత్తేసింది.



# హర్మన్ ప్రీత్‌కు మరో అవకాశం..

## ఆసియా క్రీడలకు 17ఏళ్ల వికెట్ కీపర్

మహిళల టీ20 ప్రపంచకప్‌లో నిరాశపరిచిన భారత జట్టు మరో మెగా టోర్నీకి సిద్ధమవుతోంది. జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడల్లో టీమిండియా బరిలోకి దిగనుంది. సెప్టెంబర్‌లో జరిగే ఈ టోర్నీ కోసం మంగళవారం సెలెక్టర్లు స్క్వాడ్ను ప్రకటించారు. వరల్డ్ కప్ జట్టును సెమీస్ చేర్చలేక పోయినప్పటికీ హర్మన్‌ప్రీత్ కౌర్‌నే కెప్టెన్‌గా కొనసాగిస్తూ 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. వీరిలో 17 ఏళ్ల వికెట్ కీపర్, బ్యాటర్ జి.కమలిని కూడా ఉంది. ఊహించినట్టుగానే ప్రపంచకప్‌లో ఘోరంగా విఫలమైన యస్తికా భాటియాపై వేటు పడింది. వచ్చే సెప్టెంబర్‌లో జరుగబోయే ఆసియా క్రీడల కోసం భారత మహిళా సెలక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. టి–20 ప్రపంచకప్‌లో టీమిండియాను సెమీస్ వరకైనా తీసుకెళ్లని హర్మన్ ప్రీత్‌పై మరోసారి నమ్మకం ఉంచుతూ.. ఆమెనే కెప్టెన్‌గా కొనసాగించారు. మెగా ఈవెంట్లో నిరాశపరిచిన యస్తికా భాటియాను తప్పించి.. జి.కమలినికి చోటు కల్పించారు. ఇటీవల ఇంగ్లండ్‌లో భారత ఏ జట్టు తరఫున కమలిని 35 పరుగులతో అజేయంగా నిలిచింది. అంతే కాదు.. అండర్19 మహిళల వరల్డ్ కప్‌లో అత్యధిక పరుగులు చేసిన మూడో బ్యాటర్‌గా నిలిచింది వికెట్ కీపర్ దాంతో.. దూకుడుగా ఆడగల కమలినికి ఆసియా గేమ్స్ స్క్వాడ్లోకి తీసుకున్నారు. అలానే.. కాలి మడిమ గాయంతో వరల్డ్ కప్ నుంచి వైదొలిగిన శ్రేయాంక పాటిల్‌కు 15 మంది బృందంలో చోటు దక్కింది. కానీ, తుది జట్టులో ఎంపిక విషయానికొస్తే.. ఫిట్నెస్ట్స్ ఆధారపడి శ్రేయాంకను ఆడించే అవకాశముంది. నిరుడు చైనాలోని హాంగ్జైలో జరిగిన ఆసియా క్రీడల్లో పసిడి పతకం కొల్లగొట్టిన టీమిండియా ఈసారి.. మళ్లీ విజేతగా నిలవాలనే కసితో ఉంది.





**భారత స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలిని(వికెట్ కీపర్), భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకాసింగ్, క్రాంతిగౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, నందిని శర్మ.

# మహిళ


## రాజకీయ..న్యాయ సాధికారత



రాజకీయ, న్యాయ సాధికారత అనేది మహిళలు సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు, ప్రాతినిధ్యాన్ని పొందేలా చేయడం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి వ్యక్తికి సమాన భాగస్వామ్యం ఉండాలి. అయితే చారిత్రకంగా మహిళలు రాజకీయ, సామాజిక, న్యాయ వ్యవస్థల్లో అనేక అసమానతలను ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి రాజకీయ, న్యాయ సాధికారత అత్యంత అవసరం. రాజకీయ సాధికారతలో ముఖ్యమైన అంశం పాలన వ్యవస్థల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించడం. పార్లమెంట్లు, శాసనసభలు, స్థానిక సంస్థలు మరియు ఇతర నిర్ణయాత్మక వేదికల్లో మహిళల భాగస్వామ్యం పెరిగితే వారి అవసరాలు, సమస్యలు, అభిప్రాయాలు విధానాల్లో ప్రతిబింబిస్తాయి. మహిళల ప్రాతినిధ్యం పెరగడం వల్ల విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, మహిళా భద్రత వంటి అంశాలకు మరింత ప్రాధాన్యం లభిస్తుంది. అందుకే అనేక దేశాలు మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు లేదా ప్రత్యేక అవకాశాలను కల్పిస్తున్నాయి. మన దేశంలో మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటు ఆమోదించినప్పటికీ, ఇంకా అమల్లోకి రాకపోవడం దురదృష్టకరం. కాగా, విధివిధానాల రూపకల్పనలో మహిళల భాగస్వామ్యం కూడా కీలకమైనది. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి మహిళలు విధానాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణలో భాగస్వాములు కావడం ద్వారా సమాజంలో సమానత్వాన్ని ప్రోత్సహించవచ్చు. ఇది ప్రజాస్వామ్యాన్ని మరింత సమగ్రంగా, న్యాయబద్ధంగా మారుస్తుంది. న్యాయ సాధికారత అంటే మహిళలకు చట్టపరంగా సమాన హక్కులు, రక్షణ కల్పించడం. వారసత్వ హక్కులు, ఆస్తి హక్కులు, ఉపాధి అవకాశాలు, సమాన వేతనం, విద్యా హక్కులు, హింస నుంచి రక్షణ వంటి అంశాల్లో చట్టాలు మహిళలకు బలమైన భరోసాను ఇవ్వాలి. అలాగే చట్టాల అమలు సమర్థవంతంగా జరిగి, మహిళలు సులభంగా న్యాయం పొందేలా న్యాయ వ్యవస్థ అందుబాటులో ఉండాలి. సమాజంలో కొనసాగుతున్న వ్యవస్థాగత అసమానతలనుతొలగించడానికి న్యాయపరమైన సంస్కరణలు అవసరం. లింగ వివక్షను ప్రోత్సహించే సంప్రదాయాలు, ఆచారాలు, సామాజిక అడ్డంకులను తొలగించి సమాన అవకాశాలను కల్పించే విధంగా చట్టాలు రూపొందించాలి. ఏదిఏమైనా, రాజకీయ, న్యాయ సాధికారత మహిళలను కేవలం ఓటర్లుగా కాకుండా నాయకులుగా, విధాన రూపకర్తలుగా, సమాజ మార్పుకు దోహదపడే శక్తులుగా తీర్చిదిద్దుతుంది. ఇది సమానత్వం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తూ సమగ్ర అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుంది.

## ఆర్థిక సాధికారత అత్యవసరం

మహిళలకు ఆర్థిక సాధికారత అత్యవసరంగా మారింది. మహిళలు, పురుషులు సమానంగా ఆర్థిక అవకాశాలను పొందడం, తమ ఆదాయం పై నియంత్రణ కలిగి ఉండడం, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగడం వంటి అంశాలనే మహిళల సాధికారతగా పేర్కోవచ్చు. సమాజంలో నిజమైన లింగ సమానత్వాన్ని సాధించాలంటే ఆర్థిక సాధికారత అత్యంత కీలకమైన అంశం. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం ఆర్థిక సాధికారతలో ప్రధాన భాగం. అనేక దేశాల్లో మహిళలు పురుషులతో సమానంగా పనిచేసినా తక్కువ వేతనం పొందుతున్న పరిస్థితులు ఇప్పటికీ కనిపిస్తాయి. ఈ వేతన వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. అలాగే సురక్షితమైన, గౌరవప్రదమైన పని పరిస్థితులు కల్పించడం కూడా అవసరం. ఉద్యోగ ప్రదేశాల్లో వివక్ష, వేధింపులు లేకుండా పనిచేసే వాతావరణం మహిళల భాగస్వామ్యాన్ని పెంచుతుంది. ఆర్థిక వనరులకు సమాన ప్రాప్యత కూడా ఎంతో ముఖ్యమైనది. బ్యాంకు రుణాలు, పొదుపు పథకాలు, భూమి, ఆస్తులపై హక్కులు మహిళలకు అందుబాటులో ఉంటే వారు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలు, సూక్ష్మ రుణాల పథకాలు మహిళలకు ఆర్థిక స్వావలంబనను అందిస్తున్నాయి. వ్యాపార అవకాశాలు, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ, పెట్టుబడి, మార్కెట్ సదుపాయాలు కల్పించడం కూడా ఆర్థిక సాధికారతకు దోహదపడుతుంది. మహిళా పారిశ్రామికవేత్తలు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడతారు. మహిళలు తల్లులుగా మారిన తరువాత ఎదుర్కొనే మదర్‌హుడ్ వేజ్ పెనాల్టీ కూడా ఒక ముఖ్యమైన సమస్య. పిల్లల సంరక్షణ బాధ్యతల కారణంగా ఉద్యోగాల్లో విరామం తీసుకోవడం లేదా తక్కువ గంటలు పనిచేయడం వల్ల వారి ఆదాయం తగ్గుతుంది. ప్రసూతి సెలవులు, శిశు సంరక్షణ కేంద్రాలు, అనువైన పని సమయాలు వంటి విధానాలు ఈ సమస్యను తగ్గించగలవు. స్థూలంగా చెప్పాలంటే, ఆర్థిక సాధికారత మహిళలను ఆధారపడే స్థితి నుంచి స్వావలంబన వైపు తీసుకెళ్తుంది. ఇది కుటుంబాల సంక్షేమాన్ని, సమాజ అభివృద్ధిని మరియు దేశ ఆర్థిక ప్రగతిని మరింత బలోపేతం చేస్తుంది.



# పేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

## సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** అర్హులైన ప్రతి నిరుపేదకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం న్యూ గుండ్లపల్లిలోని సిపిఐ కార్యాలయంలో పేరబోయిన పెంటయ్య అధ్యక్షతన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్లను గ్రామసభల ద్వారానే పారదర్శకంగా నిర్వహించి, నిజమైన పేదలను ఎంపిక చేయాలని కోరారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల పేరుతో నిజమైన పేదలకు అన్యాయం జరుగుతోందని, ఆర్థికంగా బలంగా ఉన్నవారికే ప్రయోజనం చేకూరుతుందన్నారు. పేద ప్రజల హక్కుల సాధన కోసం జరగబోయే కలెక్టరేట్ ధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలని ప్రజలను ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పెరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కలిపెల్లి మహేందర్, సభ్యులు పేరబోయిన పెంటయ్య, పెరబోయిన బంగారు, మీసాల దాసు, బోధసు స్వామి, జగన్, కాటం శ్రీకాంత్, నమిల సంజీవ, ముక్కెర్ల పెంటయ్య, కంబాల వెంకటేష్, కిష్టమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎఐటియుసి జిల్లా జనరల్ సెక్రెటరీ కడారి సునీల్, మధ్యాహ్నం భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూసల రమేష్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ధర్నాకు మద్దతు తెలిపి తాండ్ర సదానందం మాట్లాడుతూ మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వాల విధానాలు అమలు చేస్తుందని దుయ్యబట్టారు. కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, మధ్యాహ్న భోజన వంటకు ఉచితంగా గ్యాస్, వంట సామాగ్రి, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు లావణ్య, పి.కళావతి, రాధమ్మ పిడుగు, గట్టయ్య, లంక విజయ ,కనక లక్ష్మి, మేకల యశోద, ఎండి జుబేదార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిఇఒకు మెమోరాండం సమర్పించారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం



ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలే శరణ్యమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. మంగళవారం యాదాద్రి జిల్లా నారాయణపురం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలతో మమేకమై ప్రజా పోరాటాల నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. శివన్నగూడ ప్రాజెక్టును పనులను వేగవంతం చేసి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి మునుగోడు నియోజకవర్గ రైతాంగానికి తాగునీరు కాంగ్రెస్ హయాంలో అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేసి ప్రజాసంఘాల నిర్మాణం కోసం సంఘటితంగా ఉద్యమిస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పార్టీ శ్రేణులను కోరారు. పార్టీ ప్రయోజనాల కోసం ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. సమావేశంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, కార్యవర్గ సభ్యులు పొట్ట శంకరయ్య, సుర్వి నరసింహ, పల్లె మల్లారెడ్డి, వీరమల్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లివ్వాలి

## సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో నిర్వహించిన సిపిఐ పట్టణ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా పేదలు వేసుకున్న గుడిసెలకు ఎందుకు మోక్షం కలగట్లేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ భూముల్లో వేసుకున్న గుడిసెలకు పట్టాలిస్తామని చెప్పి మాటతప్పి పేదల గుడిసెలు కూలుస్తూ ప్రజా పాలన అందిస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే నేటి ప్రభుత్వం అవలంభిస్తుందని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న పేద ప్రజల కలలు కలలుగానే మిగిలిపోయాయన్నారు. కొత్త పెన్షన్లు రాక ఉన్న పెన్షన్ పెంచుతామని చెప్పి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతుభరోసా పూర్తి స్థాయిలో అమలు కావట్లేదని ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలన్నారు. సామాన్య ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం రోజురోజుకి సన్నగిల్లుతుందని, దీనిని ప్రభుత్వ పెద్దలు గుర్తించాలని కోరారు. వీటన్నిటిని తక్షణమే ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ జూలై 1న బుధవారం కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పార్టీ కార్యకర్తలు, ప్రజా సంఘాల బాధ్యులు పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, అనంతుల మల్లేశ్వరి, చామల అశోక్ కుమార్, రేగటి లింగయ్య, గుగులోతు రాజారాం, దీకొండ శ్రీనివాస్, పెంద్ర కృష్ణ, కౌన్సిల్ సభ్యులు పొదిల వెంకటమ్మ, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# ఐరన్, హార్డ్‌వేర్ హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బుచ్చన్నయాదవ్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** హమాలీ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కరీంనగర్ జిల్లా ఐరన్ అండ్ హార్డ్ వేర్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసిజిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లా ఐరన్ అండ్ హార్డ్ వేర్ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నగరంలోని గంజ్ లో ఎఐటియుసి రాష్ట్ర నాలుగో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ హమాలీ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఐరన్ అండ్ హార్డ్ వేర్ హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆగయ్య, ఉపాధ్యక్షులు చింతనిప్పుల సాయిలు,పెంచాల సంపత్, కొమ్మ వెంకటేష్, జక్కుల రాములు, కూకట్ల సంపత్, కొట్టే సంపత్, శీలం మధునయ్య, తాని శ్రీనివాస్, బండారి మల్లికార్జున్ పాల్గొన్నారు



# గిరిజన, ఆదివాసుల పోడు భూములకు పట్టాలు

## తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ డిమాండ్

**మహబూబ్ నగర్ :** గిరిజన, ఆదివాసీలు అనాదిగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వం తక్షణమే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకట్రామారెడ్డి భవన్‌లో గిరిజన సమాఖ్య జిల్లా మూడవ మహాసభలు ఎన్.శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగాయి. మహాసభల ప్రారంభ సూచకంగా గిరిజన సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరై అంజయ్య నాయక్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోదీ ప్రభుత్వం గిరిజన ఆదివాసుల భూములపై వారి జీవన విధానానికి ఆధారమైన అడవులపై కన్నేసిందని, అందులో భాగంగానే సహజ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్ గద్దలకు కట్టబెడుతున్నాదని ఆరోపించారు. తిరగబడుతున్న ఆదివాసి గిరిజనులు తెగలపై దేశద్రోహులుగా, అసాంఘిక శక్తులుగా ముద్ర వేసి అడవుల నుండి వెళ్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన సంక్షేమం గాలికి వదిలేసిందని ఆరోపించారు. గిరిజనులకు జీవనోపాధి లేక వలసలు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చేవెళ్ల గిరిజన డిక్లరేషన్ తక్షణమే అమలు చేయాలని, సంక్షేమ పథకాల్లో గిరిజనులకు తొలి ప్రాధాన్యం కల్పించాలని, గిరిజన గూడెలు, తాండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, గిరిజన విద్య, వైద్య వ్యాప్తికి నిధులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న గిరిజన సబ్సిడీ రుణాల నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగీ బాలకిషన్ మాట్లాడుతూ గిరిజనులపై దాడులు దౌర్జన్యాలు అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజనులు సామాజిక ఆర్థిక రాజకీయంగా చైతన్యవంతమవుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై పోరుబాటకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.




**గిరిజన సమాఖ్య నూతన జిల్లా సమితి ఎన్నిక....** గిరిజన సమాఖ్య మహబూబ్ నగర్ జిల్లా మూడవ మహాసభలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్.శంకర్ నాయక్, ఉపాధ్యక్షులుగా డి.రాజు నాయక్, జే.జగ్గానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా డి.సంజీవ్ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శుగా కె.రాము నాయక్, ఎం. నాగ్యనాయక్, కోశాధికారిగా వి.వెంకటేష్ నాయక్, జిల్లా సమితి సభ్యులుగా పరుష నాయక్, కృష్ణయ్య నాయక్‌తో సహా మరో ఆరుగురు కో ఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# నేటి నుండి అమలులోకి ‘విబి–జి రామ్ జి’

- పంచాయతీల కీలకపాత్ర కొనసాగుతుంది
- రూ.95 వేలకోట్లు కేటాయించిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు
- అర్హులైన ప్రతి కార్మికుడికీ పని:కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్

**న్యూఢిల్లీ:** మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద విబి–జి రామ్ జీ చట్టం జులై ఒకటో తేదీ నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం అమలు చేయడంవల్ల రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర భారం పడుతుందని తీవ్ర వ్యతిరేకత వచ్చింది. బుధవారం నుండి ఈ చట్టాన్ని అమలులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు అన్నీ పూర్తిచేసినట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న గ్రామీణ ఉపాధి పథకం కింద 100 రోజులు పేద కార్మికులకు పని హామీ ఇస్తుండగా, కొత్త చట్టం కింద 125 రోజులు బలమైన చట్టబద్ధమైన హామీ మోదీ ప్రభుత్వం ఇస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ ప్రక్రియ సజావుగా,సక్రమంగా సాగిపోవడానికి వీలుగా రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాలు ఉమ్మడిగా మొత్తం రూ.95,692.31 కోట్లు తాత్కాలికంగా కేటాయించాయని,గ్రామీణ కార్మికులకు సమయానికి వేతనాల చెల్లింపులు,ఎలాంటి అంతరాయాలు లేకుండా ఈ పథకం కింద పనుల కేటాయింపుల అమలుకు కేంద్రం పూర్తి భరోసా ఇస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖామంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. అర్హుడైన ఏ కార్మికుడు కూడా దేశంలో ఒక్కరోజు కూడా పనిలేకుండా ఉండకూడదని అన్నారు. కేంద్రం,రాష్ట్రాలు కలిసి పాలనాపరమైన , ఆర్థిక,సాంకేతిక సన్నాహాలను ఇప్పటికే సిద్ధం చేశాయని చెప్పారు. అదేవిధంగా గ్రామీణ రోజ్‌గార్ హామీ కార్డులను కొత్తగా మళ్ళీ జారీ చేసేవరకూ ప్రస్తుతం కెవైసి ద్వారా నిర్ధారించిన కార్డులే అమలులో చెల్లుబాటు అవుతాయని చెప్పారు.ఈ పథకాన్ని అమలు చేయడంలో గ్రామీణస్థాయిలో పంచాయతీలే కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. వాటి కీలక పాత్ర కొనసాగుతుందని చెప్పారు. ప్రకృతి వనరుల నిర్వహణ,నీటి సంరక్షణ,వ్యవసాయం సంబంధిత కార్యకలాపాలు,గ్రామీణ మౌలిక సదుపాయాలు,మహిళాసాధికారితపైనే దృష్టి కేంద్రీకరించేవిధంగా ఈ పథకం కొనసాగుతుందని చెప్పారు. మంత్రిత్వశాఖ చెప్పిన సమాచారం ప్రకారం, 29 రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ చట్టం కింద బడ్జెట్ కేటాయింపులు చేశాయి. అదేవిధంగా 24 రాష్ట్రాలు ఈ విబి–జి రామ్ జీ పథకాన్ని రాష్ట్ర పథకాలుగా గుర్తించాయి. ఈ పథకం అమలు చేసేందుకు కొత్త చట్టాన్ని తీసుకువచ్చిన తర్వాత ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో మోదీ ప్రభుత్వంపై మండిపడుతున్నాయి.ఈ కొత్త చట్టం వల్ల కార్మికుల ఉపాధికి నష్టం వాటిల్లుతుందని ప్రతిపక్షాలు హెచ్చరించాయి.



### రాష్ట్రాలకు రూ.17 వేలకోట్లు పైగా బకాయిలు కేంద్రం చెల్లించలేదు:ఖర్గే

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) కింద రాష్ట్రాలకు చెల్లించాల్సిన రూ.17,144 కోట్ల బకాయిలను మోదీ ప్రభుత్వం ఇప్పటివరకూ చెల్లించలేదని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్–అజీవిక మిషన్(గ్రామీణ్)ను రాష్ట్రాలపై బలవంతంగా రుద్దిందని విమర్శించారు. ఈ కొత్త చట్టం కింద అమలులోకి వచ్చిన పథకానికి రాష్ట్రాలు కూడా 40 శాతం మేరకు నిధులను కేటాయించాల్సి వస్తోందని, రాష్ట్రాలపై తీవ్ర ఆర్థిక భారాలు పడుతున్నాయని విమర్శించారు. “మోదీజీ మీరు మహాగాంధీ పేరుతో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేశారు, పనిహక్కును గ్రామీణ భారతానికి లేకుండా చేశారు, కానీ మీరు ఈ పాత పథకం కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన రూ.7,144 కోట్ల బకాయిలను ఎగవేశారనడం నిజం కాదా? లోక్‌సభలో చెరప్పిన సమాధానం ప్రకారం 34 రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు గడచిన మార్చి నాటికి ఈ బకాయిలను మీ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది” అని ఖర్గే విమర్శించారు.

## ‘ఇంటర్’ రెండవ దశ ప్రవేశాల షెడ్యూల్ విడుదల

### జులై 31 వరకు ప్రవేశలకు దరఖాస్తులు...

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదో తరగతి అడ్వాన్సుడు సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ప్రస్తుత 202627 విద్యాసంవత్సరానికిగానూ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర రెండవ దశ ప్రవేశాల షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ విద్యా మండలి (టిజిబిఐఇ) మంగళవారం విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, కోఆపరేటివ్, రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లు, కెజిబివి తదితర జూనియర్ కళాశాలల్లో జులై 31 వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు రాష్ట్రంలోని అన్ని కళాశాలల ప్రధానాచార్యులకు ఆదేశాలు జారీ చేసింది. కళాశాలల్లో ప్రవేశాలను కల్పించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. విద్యార్థుల జిపిఎ,సబ్జెక్ట్‌ల వారి గ్రేడ్ పాయింట్లు, అర్హత పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే ఇంటర్‌లో ప్రవేశాలను కల్పించాలని, ఎటువంటి ప్రవేశ ప రీక్షలను నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అభిలాష అభినవ్ హెచ్చరించారు. **రిజర్వేషన్ల కేటగిరీలు:** ఎస్‌సిలకు 15 శాతం, (గ్రూప్I: 1శాతం, గ్రూప్II: 9 శాతం, గ్రూప్III: 5 శాతం)ఎస్‌టిలకు 10 శాతం, బిసిలకు 29ర శాతం (ఎ7 శాతం,బి10శాతం, సి1శాతం,డి7శా తం, ఇ4 శాతం),దివ్యాంగులకు 5శాతం , ఎన్‌సిపి, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలకు 5 శాతం, మాజీ సైనికోద్యోగులు, రక్షణ సిబ్బంది పిల్లలకు 3శాతం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10శాతం, ప్రత్యేక మహిళా కళాశాలలు లేని చోట్ల అన్ని కేటగిరీల్లోనూ 33.33 శాతం(లేదా మూడో వంతు) సీట్లను బాలికలకు కేటాయించాలి. కాగా జోగినిల పిల్లల ప్రవేశాల విషయంలో అర్హత పరీక్ష సర్టిఫికెట్లలో ఉన్నట్టుగానే తండ్రి పేరుకు బదులుగా తల్లి పేరును నమోదు చేయాలని ఇంటర్ బోర్డ్ ఆదేశించింది.

### సెక్షన్‌కు 88 మంది మాత్రమే...

ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ కళాశాలలు ఒక్కో సెక్షన్‌కు గరిష్టంగా 88 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పించాలని ఇంటర్ బోర్డ్ తెలిపింది. అదనపు సెక్షన్ల అనుమతి లేకుండా చేర్చుకుంటే కళాశాల గుర్తింపు రద్దు చేస్తామని ఇంటర్‌బోర్డ్ హెచ్చరించింది.

## 2028లో తెలంగాణే బిజెపి టార్గెట్

### ప్రజల గొంతుకగా మారండి బిజెపి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** తెలంగాణలో 2028లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం అని పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై పోరాడుతూ వారి గొంతుకగా మారాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని అవుషాపూర్ రాక్ గార్డెన్‌లో మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నితిన్ నబీన్ మాట్లాడుతూ తెలంగాణలో బిజెపి డలంగా ఎదుగుతోందన్నారు. 2019, 2024 ఎన్నికల్లో పార్టీ సాధించిన ఓట్ల శాతం ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. 2047 నాటికీ అభివృద్ధి చెందిన భారత నిర్మాణమే ప్రధాని నరేంద్ర మోదీ అక్ష్యమని ఆ దిశగా ప్రతి కార్యకర్త కృషిచేయాలని సూచించారు.దేశంలోని 22 రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాల ఏర్పాటుకు మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసమే కారణమన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్ గిరిజన విశ్వవిద్యాలయం వంటి కీలక సంస్థలను ఏర్పాటు చేసిందని తెలిపారు.అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆర్‌ఆర్ పన్ను పేరుతో రాష్ట్ర నిధులను ఢిల్లీకి తరలిస్తున్నారని ఆరోపించిన ఆయన కాళేశ్వరం మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని విమర్శించారు.ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల నుంచి శాసనసభ వరకు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా ఉద్యమంగా మలుస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ,కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపి ఈటల రాజేందర్,రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, ప్రవీణ్ రావు ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.




## అగమ్యగోచరంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

### బిఎల్‌ఓ విధుల నుంచి అంగన్‌వాడీ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి: నండూరి కరుణ కుమారి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ రోజురోజుకు అగమ్యగోచరంగా మారుతోందని, రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం ప్రకటించిన రిటైర్మెంట్ బెనిఫిట్లను వెంటనే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి కరుణ కుమారి డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ పథకం అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తయినా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించలేదని, కార్మికులుగా గుర్తించకుండా కేవలం గౌరవ వేతనంతోనే విధులు నిర్వహింపజేస్తున్నారని విమర్శించారు. 2024లో 65 ఏళ్ల వయస్సుతో పదవీ విరమణ పొందిన టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం అందజేయాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇప్పటికీ చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ పోరాటాల ఫలితంగా 2025లో అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.1 లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్ మంజూరు చేస్తూ ప్రభు త్వం జిఒ జారీ చేసినప్పటికీ, 2024 నుంచి పదవీ విరమణ పొందిన వారికి, 2025లో రిటైర్ అయిన వారికి ఇప్పటివరకు ఆ మొత్తాలు అందలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్లను వెంటనే విడుదల చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించిన రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్‌కు అర్హత కల్పించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



అంగన్‌వాడీ టీచర్లకు బిఎల్‌ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని గతంలో ఐసిడిఎస్ డైరెక్టర్ కార్యాలయం నుంచి సర్క్యులర్ జారీ చేసినప్పటికీ, ఆచరణలో అమలు కావడం లేదని తెలిపారు. ప్రస్తుతం కూడా ఎస్‌ఐఆర్ నమోదు ప్రక్రియలో బిఎల్‌ఓ విధులు అప్పగించడంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. ఒకవైపు అదనపు విధులు అప్పగించి, మరోవైపు కేంద్రాల నిర్వహణలో లోపాలు జరిగితే టీచర్లపైనే మెమోలు జారీ చేయడం అన్యాయమని విమర్శించారు. బిఎల్‌ఓ విధుల నుంచి అంగన్‌వాడీ టీచర్లకు పూర్తిస్థాయిలో మినహాయింపు ఇవ్వాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నండూరి కరుణ కుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ‘ఆపరేషన్ ముస్కాన్’..

### గల్లంతైన చిన్నారుల గుర్తింపు, బాల కార్మికుల రక్షణపై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గల్లంతైన చిన్నారులను గుర్తించడం, బాల కార్మికులు, బానిస కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులను రక్షించి వారికి పునరావాసం కల్పించే లక్ష్యంతో తెలంగాణ పోలీసులు జూలై 1 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా ‘ఆపరేషన్ ముస్కాన్–12’ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్–12 పోస్టర్‌ను ఆవిష్కరించడంతో పాటు రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిజి చారు సిన్హా మాట్లాడుతూ, ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కావాలంటే అన్ని ప్రభుత్వ శాఖలు, పోలీసు విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. గల్లంతైన చిన్నారుల అన్వేషణను వేగవంతం చేయడంతో పాటు బాలల దోపిడీకి పాల్పడుతున్న పునరావృత నేరస్థులు, యజమానులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, ప్రజారోగ్య శాఖ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ, సమగ్ర శిక్ష, జిల్లా బాలల సంరక్షణ అధికారులు, బాలల సంక్షేమ కమిటీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆపరేషన్ ముస్కాన్–12 విజయవంతానికి అన్ని శాఖలు పూర్తి సహకారం అందిస్తామని సమావేశంలో హామీ ఇచ్చాయి.

## ‘రైతు భరోసా’ను ఎగ్గొట్టి.. మళ్లీ సభల పేరుతో నాటకాలు

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్‌రెడ్డి 30 నెలల పాలనలో దాదాపు రూ 30 వేల కోట్ల ‘రైతు భరోసా’ను ఎగ్గొట్టి, మళ్లీ సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన‘రైతుభరోసా’ను కూడా బహిరంగ సభలను పెట్టి చేసే ‘పిఆర్ స్టంట్ల’ను చూసి రైతులు అసహించుకుంటున్నారని కెటిఆర్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఒకటి కాదు,రెండు కాదు ఏకంగా నాలుగు సార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన సిఎం ద్రోహాన్ని రైతులు మరచిపోతారని అనుకోవడం అవివేకమేనని కెటిఆర్ పేర్కొన్నారు. ప్రతి ఎకరానికీ ఏడాదికి రూ 15 వేలు ఇస్తానని గ్యారంటీల గారడీచేసి,చివరికి ఉన్నది ఎగ్గొట్టిన దుస్థితి తీసుకొచ్చినందుకు ముందు ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రూ 50 వేల కోట్లతో చేయాల్సిన 2 లక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా రైతుల గొంతుకోశారని మండిపడ్డారు.72 సార్లు సిఎం ఢిల్లీ టూర్లకు, బహిరంగ సభలకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేస్తే,ఆ ఖర్చుతో రైతులకు పెట్టుబడి సాయం దక్కేదని కెటిఆర్ వివరించారు. కెసిఆర్ పాలనలో పదేళ్లు పండగలాగ సాగిన వ్యవసాయాన్ని దండగలాగ మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న దుర్మార్గాన్ని రైతులు ఎప్పటికీ క్షమించే ప్రసక్తే లేదన్నారు.

## 2న బిఆర్‌ఇఒయు ఆధ్వర్యంలో ‘పి.వి నరసింహారావు స్మారకోపన్యాసం’

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ ప్రధాని,భారతరత్న పి.వి.నరసింహారావు 105వ జయంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం(బిఆర్‌ఇఒయు) ఆధ్వర్యంలో “సర్ 2025–26ఇండియా భావనను ఛిన్నాభిన్నం చేయడమా?” అనే అంశంపైన ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ జూలై 2వ తేదీన పి.వి.నరసింహారావు స్మారకోపన్యాసం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉప సంచాలకులు ఆచార్య ఘంటా చక్రపాణి సభాధ్యక్షత వహించగా, విశ్వవిద్యాలయ డైరక్టర్ (అకాడమీ) ఆచార్య జి.పుష్పా చక్రపాణి గౌరవ అథిగాహాజరవ్వనున్నట్టు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయ కృష్ణా రెడ్డి తెలిపారు.

## జిహెచ్‌ఎంసిలో 35 మంది ఉద్యోగుల పదవీవిరమణ

### కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఘన సన్మానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో వివిధ విభాగాల్లో సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో, విశిష్ట సేవలు అందించిన 35 మంది ఉద్యోగులు మంగళవారం పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పాల్గొని, రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, పట్టణ సామాజిక అభివృద్ధి (యుసిడి), రెవెన్యూ, పారిశుద్ధ్యం, అర్బన్ బయోడైవర్ సిటీ(యుబిడి), టౌన్ ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్ వంటి వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు హైదరాబాద్ పౌరులకు విలువైన సేవలు అందించి నేటితో తమ సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానాన్ని ముగించారు. నగరం ఎంసిహెచ్‌గా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ హోదాల్లో సేవలు అందించిన సూపరిడెంట్ ఇంజనీర్ మోహన్ రెడ్డి పదవీవిరమణ చేశారు. ఆయనను కమిషనర్ కర్ణన్ ఘనంగా సన్మానించారు.




### కమిషనర్ ప్రశంసలు..

ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ నగర పౌర పరిపాలనను బలోపేతం చేయడానికి, ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి ఈ ఉద్యోగులు చూపిన నిబద్ధత, చిత్తశుద్ధి ఎంతో గణనీయమైనవన్నారు. విధి నిర్వహణలో వారు పడిన శ్రమ నగర అభివృద్ధికి ఎంతగానో తోడ్పడిందన్నారు. ఉద్యోగుల సేవలను కొనియాడుతూ కమిషనర్ వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పదవీవిరమణ పొందిన ఉద్యోగులందరూ భవిష్యత్తులో ఆరోగ్యకరమైన, సంతోషకరమైన, సుసంపన్నమైన శేష జీవితాన్ని గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ చేసినప్పటికీ, తమ అనుభవంతో విభిన్న రూపాల్లో సమాజానికి సేవలందించడం కొనసాగించాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విశాఖ ఎపిఐఐసి భూ కొనుగోళ్లలో రూ.15 కోట్ల టోకరా

**ప్రజాపక్షం /హైదరాబాద్:** విశాఖపట్నంలోని ఎపిఐఐసి కేటాయించిన 70 ఎకరాల పారిశ్రామిక భూమి కొనుగోలు వ్యవహారంలో రూ.15 కోట్ల మేర మోసం జరిగిందన్న ఆరోపణలపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ లో కేసు నమోదైంది. న్యూ సవేరా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ గతంలో ఆమ్ సా పైప్స్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ హరిదాస్ ఫిర్యాదు మేరకు సాంసియా గ్లోబల్ ఇన్‌ఫ్రాప్రాజెకట్స్ లిమిటేడ గ్రీన్ ఎర్త్ రిసోర్సెస్ అండ్ ప్రాజెకట్స్ లిమిటెడ్‌తో పాటు ఆయా సంస్థల డైరెక్టర్లు దీపక్ తివారి, ఎం.ఎం. దమానిపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) సెక్షన్లు 318, 324, 61 కింద కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, 2009లో ఎపిఐఐసి విశాఖపట్నం కృష్ణంపాలెం గ్రామంలో 70 ఎకరాల భూమిని పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం కేటాయించగా, అనంతరం ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్‌పివి) పేరుతో ఆ భూమి హక్కులను ఫిర్యాదుదారు కంపెనీకి బదిలీ చేసేలా ఒప్పందాలు కుదిరాయి. ఈ క్రమంలో ఫిర్యాదుదారు సంస్థ 45 ఎకరాల కోసం రూ.9 కోట్లు, మరో 25 ఎకరాల కోసం రూ.5 కోట్లు సహా మొత్తం రూ.15 కోట్లు చెల్లించినట్లు పేర్కొంది. అయితే భూమి కేటాయింపుకు సంబంధించిన కీలక నిబంధనలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టి తమను మోసగించారని, అనంతరం ఏపీఐఐసీ కేటాయింపులను రద్దు చేయడంతో భారీ నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో ఆరోపించారు. 2015లో కుదిరిన సెటిల్‌మెంట్ ఒప్పందాన్ని కూడా ఉల్లంఘిస్తూ నిందితులు ఏపీఐఐసీ నుంచి రీఫండ కోరారని, దీంతో తమకు సుమారు రూ.7.70 కోట్ల మేర ఆర్థిక నష్టం జరిగిందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. కేసును ఎసిపి సి. మల్లికార్జున చౌదరి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆధ్యాత్మిక యాత్రల కోసం ప్రత్యేక రైళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల భక్తులకు శుభవార్త. ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించేలా ఐఆర్‌సిటిసి రెండు ప్రత్యేక భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లను ప్రకటించింది. ‘అయోధ్య–కాశీ పుణ్యక్షేత్ర యాత్ర విత్ బైద్యనాథ్ ధామ్‘తో పాటు ‘దివ్య దక్షిణ యాత్ర విత్ అరుణాచలం‘ పేరుతో ఈ ప్రత్యేక యాత్రలు నిర్వహించనుంది. అయోధ్య–కాశీ పుణ్యక్షేత్ర యాత్ర రైలు జూలై 4, 2026న మధ్యాహ్నం 2 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరనుండగా, దివ్య దక్షిణ యాత్ర రైలు జూలై 20, ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ నుంచి ప్రారంభమవుతుంది. అయోధ్య–కాశీ యాత్రలో విష్ణుపాద్ ఆలయం, కాశీ విశ్వనాథ్ ఆలయం, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణ దేవి ఆలయం, గంగా హారతి, రామజన్మభూమి, హనుమాన్‌గఢి, త్రివేణి సంగమం, బాబా బైద్యనాథ్ ఆలయాలను సందర్శించే అవకాశం కల్పించారు. ఈ యాత్ర 9 రాత్రులు – 10 రోజుల పాటు కొనసాగుతుంది. సికింద్రాబాద్, చర్లపల్లి, కాజీపేట్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో ఎక్కే, దిగే సౌకర్యం కల్పించారు. దివ్య దక్షిణ యాత్రలో అరుణాచలం, నటరాజ ఆలయం, శ్రీరంగనాథస్వామి ఆలయం, బృహదీశ్వర ఆలయం, రామనాథస్వామి ఆలయం, మీనాక్షి అమ్మన్ ఆలయం, రాక్ మెమోరియల్, కుమారి అమ్మన్ ఆలయాలను దర్శించవచ్చు. ఈ యాత్ర 8 రాత్రులు – 9 రోజుల పాటు ఉంటుంది. సికింద్రాబాద్, చర్లపల్లి, జంగావ్, కాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ప్రయాణికులకు బోర్డింగ్, డీబోర్డింగ్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఈ రెండు టూరిస్ట్ రైళ్లలో ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం (శాకాహారం మాత్రమే), ప్రయాణ బీమా వంటి సౌకర్యాలను ఐఆర్‌సీటీసీ కల్పించనున్నట్లు తెలిపింది.




## రానున్న రోజుల్లో బిఆర్‌ఎస్‌కు పట్టం

### మాజీ మంత్రి హరీష్ రావు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో భారత రాష్ట్ర సమితి అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. మంగళవారం నాడు జడ్చర్ల పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఎస్‌ఐఆర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సాయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అప్పుడే గడ్డిపాలెం ఏర్పడిందని ఇప్పుడు ఎన్నికలు పెట్టిన టిఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా హైదరాబాద్ ఢిల్లీ తిరుగుతూ కాలయాపన చేస్తూ హామీలన్నీ కాలరాస్తూ ప్రస్తుత ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రైతుబంధు రైతు బీమా రైతు భరోసా లాంటి పథకాలను పక్కనపెట్టి కాలయాపన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.



## రాష్ట్రంలో మరో వారం రోజులు కొనసాగనున్న వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వచ్చే వారం రోజుల పాటు వర్షాలు కొనసాగనున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, పలు జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మంగళ, బుధవారం ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందన్నారు. బుధ, గురువారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ సమయంలో ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు. గురు, శుక్రవారాల్లో కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమయంలో కూడా రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కొనసాగే అవకాశం ఉందన్నారు. శుక్ర, శని, ఆదివారం వరకు వర్షాల తీవ్రత కొంత తగ్గనున్నప్పటికీ ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. మరికొన్ని జిల్లాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నాయన్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



**కొన్ని జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరిక**

**రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు**




## ప్రతి బూత్‌పై ప్రత్యేక దృష్టి

### ఓటరు జాబితా పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా బూత్ స్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు.మంగళవారం నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్‌ఏలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా పరిశీలనను క్షుణ్ణంగా నిర్వహించి, అర్హుల పేర్లు నమోదు కావడంతో పాటు అనర్హుల వివరాలపై కూడా నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి బూత్‌పై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి లోపాలు లేకుండా సర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో బీఎల్ఏల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈసమావేశంలో డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత,మండల,పట్టణ అధ్యక్షులు,గాదగొని కొండయ్య,ఎడ్ల ప్రవీణ్,లింగాల వెంకన్న,పన్నాల రాఘవరెడ్డి,శ్రీనివాస్,సుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాడి పశువుల ఆరోగ్యంతోనే రైతుల ఆర్థిక స్థితి బలోపేతం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండల పరిధిలోని హట్యాతండా గ్రామంలో పశుసంవర్ధక శాఖ, జాతీయ మాంస పశు పరిశోధనా సంస్థ ఉమ్మడిగా ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి పశువుల ఆరోగ్యం మెరుగుపడితే రైతుల ఆర్థిక స్థితి మరింత బలోపేతం అవుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సేవలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు, పశుపాలకుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ శిబిరంలో పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు, టీకాలు, మందులు ఉచితంగా అందించడంతో పాటు పశుపోషణ, వ్యాధి నివారణ, శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, పశుసంవర్ధక శాఖ అధికారులు, జాతీయ మాంస పశు పరిశోధనా సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో సమాజానికి ఆదర్శప్రాయులు



**ప్రజాపక్షం/యాదాద్రి :** నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరవేయడంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు సేవలు అందించారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహరావు గారి పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలో నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేసిన అధికారులు సమాజానికి ఆదర్శప్రాయులని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి, ఉన్నతాధికారులకు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అందించిన, అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని అన్నారు. అనంతరం శాలువాలతో పాటు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, జిల్లా అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సంక్షేమ శాఖ సిబ్బంది , కుటుంబ సభ్యులు,పాల్గొని నరసింహారావు గారికి శుభాకాంక్షలు తెలియజేసి, వారి సేవలను అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## నరసింహ మరణం సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** కామ్రేడ్ బీరకాయల నరసింహ మరణం సిపిఐ పార్టీకి అతని కుటుంబానికి తీరని లోటని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మోటకొండూరు మండల కేంద్రంలో కామ్రేడ్ బీరకాయల నరసింహ అనారోగ్యంతో మరణించడంతో నరసింహ మృతి దేహానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, మోటకొండూరు మండల కార్యదర్శి గాదగాని మాణిక్యంలతో కలిసి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం దామోదర్ రెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణలు సంయుక్తంగా మాట్లాడుతూ బీరకాయల నరసింహ చిన్నతనం నుండి కమ్యూనిస్టు పార్టీ పాటలకు కమ్యూనిస్టు పోరాటాలకు ఆకర్షితుడై కమ్యూనిస్టు పార్టీలో సభ్యునిగా చేరి కీలక పాత్ర పోషించి మేస్త్రి పని చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో మోటకొండూరు మండల కేంద్రంలో మేస్త్రి సంఘం నిర్మించిన నాయకుడన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు బోల్ల శీను, జీవికలపల్లి పాండు, బీరకాయల మధు, మల్లేష్, జీవికలపల్లి గణేష్, ఎండి వంశీ, ఎత్తరి, యాదగిరి, మేస్త్రి సంఘం అధ్యక్షులు బొట్ల శీను, వంగపల్లి రాములు, బీరకాయల ఈశ్వరయ్య,సకినాల నరేష్ తో పాటు మేస్త్రి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# ధరావత్ నిఖిల్ మృతి కేసు 'సిబిఐకి బదిలీ'



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది ధరావత్ నిఖిల్(25) అనుమానాస్పద నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందగా నేటికి ఓ కొలిక్కి రాలేదు. ఈ కేసు మలుపులు తిరుగుతూ హైకోర్టు తీర్పుతో సిబిఐకి చేరింది. మృతుడి తల్లిదండ్రులు ధరావత్ భాస్కర్, తల్లి సంధ్యలు మొదటి నుండి తమ కుమారుడిది హత్యేనంటూ పలువురిపై అనుమానం వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ధరావత్ నిఖిల్ మిస్ అయినట్లు సూర్యాపేట పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈలోపు చిలుకూరు మండలంలోని నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కెనాల్‌లో ఓ గుర్తు తెలియని యువకుని మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో నిఖిల్ మృతదేహంగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు ఎటు తేల్చకపోవడంతో సిఐడికి కేసును బదిలీ చేశారు. దీనిపై విచారణ చేసిన అధికారులు నిఖిల్‌ది సహజ మరణమేనంటూ కేసును క్లోజ్ చేశారు. దీంతో అతని తల్లిదండ్రులు పట్టువిడవని విక్రమార్కుల్లా తన కుమారుడి మరణంపై ఉన్న మిస్టరీని తేల్చాలని దీనిని సిబిఐకి అప్పగించాలని హైకోర్టును ఆశ్రయించారు. దీనితో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాంజీ ఈ విచారణలో స్థానిక పోలీసులు, సిఐడి ధర్యాప్తులో తీవ్రమైన లోపాలు ఉన్నాయని స్పష్టం చేశారు. నిఖిల్ శరీరంపై మెడ చుట్టూ తీవ్ర గాయాలు ఉన్నప్పటికి అధికారులు దానిని ఆత్మహత్య లేదా ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని కోర్టు పేర్కొంది. సిసి ఫుటేజ్, కాల్ రికార్డును (సిడిఆర్‌ఎస్) సరిగ్గా పరిశీలించలేదని, కుల వివక్ష కోణాన్ని (ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి చట్టాన్ని) పూర్తిగా నిర్లక్ష్యం చేశారని కోర్టు తప్పుపట్టింది. దీనిపై సిబిఐతో ధర్యాప్తు జరిపించాలంటూ ఆదేశాలు జారీచేయడంతో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించింది. హత్య, క్రిమినల్ ప్లాన్, సాక్ష్యాల మాయం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కోణాలలో ఆరు నెలల కాలపరిమితిలో శాస్త్రీయంగా కేసును పూర్తి చేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో సిబిఐ అధికారులు నిఖిల్ తల్లిదండ్రులు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు.

**ప్రేమ వ్యవహారం-పరువు హత్య : తల్లిదండ్రులు ధరావత్ భాస్కర్ సంధ్య**

ప్రేమ వ్యవహారమే నిఖిల్ పరువు హత్య అంటూ ఆనాడు పెద్దఎత్తున మీడియాలో వార్తలు వచ్చాయి. మృతుని తల్లిదండ్రులు ధరావత్ భాస్కర్ సంధ్యలు కూడా అదే అనుమానం వ్యక్తం చేస్తూ మీడియా ముందు తన కుమారుడి ప్రేమ వ్యవహారం గురించి బయటపెట్టారు. పట్టణంలోని ఓ ఉన్నత కులానికి చెందిన అమ్మాయి కుటుంబ సభ్యులు ప్లాన్ ప్రకారం పుట్టిన రోజు వేడుకని నమ్మించి కబురు పంపి కిడ్నాప్ చేసి హత్య చేసిన అనంతరం కాల్వలో మృతదేహాన్ని పడవేసినట్లు ఆరోపించారు. స్థానిక పోలీసులపై నమ్మకం లేదని సిఐడికి కేసు బదిలీ చేసినా ప్రయోజనం లేకపోవడంతో మొదటి నుంచి వారు తీవ్ర అసంతృప్తితో ఉండి హైకోర్టును ఆశ్రయించారు.

# మత్స్యసొసైటీ ఎన్నికలు అక్రమాలపై విచారణ



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని తాళ్ల మల్కాపురం గ్రామ గరుడ సముద్రం చెరువు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో జరిగిన దారుణమైన అక్రమాలు, అధికార దుర్వినియోగంపై ఎన్నికల అధారిటి అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు మంగళవారం సహకార శాఖ అధికారి కమల తాళ్లమల్కాపురం గ్రామంలో పర్యటించి, స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సొసైటీ సభ్యులతో ముఖాముఖి విచారణ జరిపారు. గత నెల జూన్ 4న జరిగిన ఈ సొసైటీ ఎన్నికల్లో తీవ్ర అక్రమాలు జరిగాయని, ఎన్నికల అధికారి ఏకపక్షంగా వ్యవహరించారని పేర్కొంటూ సొసైటీ డైరెక్టర్ మండవ వెంకటేశ్వర్లు ఈనెల 15న సూర్యాపేట జిల్లా కలెక్టర్, అలాగే రాష్ట్ర, జిల్లా సహకార శాఖ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఉన్నతాధికారుల అదేశాల మేరకు క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు.

**విచారణలో వెలుగుచూసిన సంచలన విషయాలు**

ఆధారాలు సమర్పించిన మండవ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా డైరెక్టర్ మండవ వెంకటేశ్వర్లు విచారణ అధికారికి అక్రమాలకు సంబంధించిన పూర్తి ఫోటోలు, వీడియో ఆధారాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నామినేషన్ల స్క్రూటిని సమయంలో నాటి ఎన్నికల అధికారి అమరేందర్ వద్ద ప్రత్యర్థి ఫ్యానల్ నామినేషన్లలోని లోపాలను రాతపూర్వకంగా ఎత్తి చూపినప్పటికీ సొసైటీతో ఏమాత్రం సంబంధం లేని బయటి వ్యక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎన్నికల అధికారిని బెదిరించి, దౌర్జన్యంగా నామినేషన్లను అమోదింపజేసుకున్నారని ఆరోపించారు. అంతే కాకుండా రెండు సంఘాలలో ద్వంద్వ సభ్యత్వాలు కలిగి ఉన్న నిబంధనల విరుద్ధమైన అంశాలను, కనీసం సొసైటీలో ఓటు హక్కు కూడా లేని వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేసిన అక్రమాలను ఆధారాలతో సహా విచారణ అధికారికి దృష్టికి తీసుకెళ్లారు.

**పోలింగ్ రోజు బరితెగింపు :** జూన్ 4న జరిగిన పోలింగ్ రోజున కళ్లు కనపడని నోటి మాట రాని శారీరక అశక్తత కలిగిన ఓటర్ల సహాయంతో ఒకే ఫ్యానెల్ మొత్తానికి ఎన్నికల అధికారి స్వయంగా ఏకపక్షంగా ఓట్లువేసి, ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ఖూని చేశారని వెంకటేశ్వర్లు తీవ్రంగా మండిపడ్డారు. ఈ అక్రమాలన్నింటిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, తప్పుచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విచారణ కార్యక్రమంలో తాళ్లమల్కాపురం మత్స్యశాఖ డైరెక్టర్లు సివినేని బాలస్వామి, కోట గురవయ్య, మండవ శేషయ్య, మండవ సత్యం, గండమల్ల వీరస్వామి, కోట లచ్చయ్య, కోట వెంకయ్య, కోట నర్సయ్య, పోలేపల్లి లచ్చ య్య, సొసైటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారుల ఎదుట నిరసన వాస్తవాలను తెలిపారు.

# ముత్యాలమ్మగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### టైర్ పేలి ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఇంటర్‌సిటీ బస్సు

### క్యాబిన్‌లో ఇరుక్కున్న బస్సు డ్రైవర్



**ప్రజాపక్షం/నకిరేకల్(కట్టంగూరు):** హైదరాబాద్‌విజయవాడ హైవే కట్టంగూరు మండలం ముత్యాలమ్మగూడెం ఫ్లైఓవర్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఇంటర్‌సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టైర్ ఒక్కసారిగా పేలడంతో అదుపు తప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది.ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ మహబుబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలం రాచాల గ్రామానికి చెందిన గోనెల కృష్ణయ్యకు గాయాలు కాగా, బస్సు డ్రైవర్ కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బసవ కళ్యాన్ మండలం సంస్థాపూర్ గ్రామానికి చెందిన సిద్ లింగస్వామి తీవ్రంగా గాయపడి డ్రైవింగ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు,క్రేన్ సాయంతో అతడిని బయటకు తీసి నార్కట్ పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ట్యాంకర్ డ్రైవర్‌ను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.టైర్ పేలడంతో బస్సు అదుపుతప్పి డివైడర్‌ను దాటి ట్యాంకర్‌ను ఢీకొట్టినట్లు సమాచారం ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నా యి. బస్సులో సుమారు 46 మంది ఉన్నట్లు సమాచారం.వారికి ఇలాంటి ప్రమాదాలు జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్యాంకర్ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 2న నల్లగొండలో జాబ్ మేళా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు 2న ఉదయం 10:30 గంటలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం,బీటీఎస్ రోడ్,ఐటీఐ క్యాంపస్ పక్కన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పి.సాహితి భీమ తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు నల్లగొండ,హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. వీరికి నెలకు రూ.10,000 నుంచి రూ.25,000 వరకు వేతనం ఉంటుంది. అర్హతలు: ఎస్ఎస్సీ నుంచి ఏదైనా డిగ్రీ,ఐటీఐ, బీఎస్సీ నర్సింగ్, డి/బి/ఎంఫార్మసీ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల వయసు గలవారు అర్హులు.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా,ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం కు హాజరుకావాలని సూచించారు.



## 227.18 కిలోల గంజాయి నిర్వీర్యం

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి నరసింహ్మ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** 29 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 227.18 కేజీల గంజాయిని ప్రభుత్వ, కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటి ఆధ్వర్యంలో మంగళవారం యాదాద్రి జిల్లాలో గల తుక్కాపుర్ గ్రామంలో గల రోమా ఇండస్ట్రీస్ నందు యాజమాన్యం, సిబ్బంది సహాయంతో ప్రభుత్వ సాక్షుల సమక్షంలో గంజాయిని నిర్వీర్యం చేసి బూడిద చేయడం జరిగిందని డ్రగ్ డిస్పోజల్ కమిటి చైర్మన్, జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. పర్యావరణానికి, ప్రజాజీవనానికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుని నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు. దీని విలువ రూ.1 కోటి పైనే ఉంటుందన్నారు. డ్రగ్స్ నివారణ అందరి సామాజిక బాధ్యతన్నారు. డ్రగ్స్, గంజాయి వినియోగించడం వల్ల యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్, రవాణా, వినియోగం నేరం అని హెచ్చరించారు. గంజాయి నివారణలో జిల్లా పోలీస్ కృషి చేస్తుందన్నారు. డ్రగ్స్ అమ్మకం, రవాణా, వినియోగంకు సంబంధించి పోలీసులకు డయల్ 100, 112, 1908కు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్, గంజాయి వినియోగించే వారిని, వ్యాపారం చేసే వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లను గమనిస్తూ చెడు వ్యసనాలకు లోనవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటి సభ్యులు సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్న కుమార్, కోదాడ డివిజన్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో డిఎస్‌పి రవి, ఏఆర్ డిఎస్‌పి నరసింహ, ఎస్‌ఐలు యాకూబ్, జాన్సీరాణి పాల్గొన్నారు.

## ప్రతి పేద మహిళకూ నెలకు రూ.2,500 ఇవ్వాలి

### రాష్ట్ర మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో గెలవడానికి ఆరు గ్యారెంటీలను గెలిచి అధికారంలోకి రాగానే ప్రతి మహిళలకు వంటింటి సమాన్లు తెచ్చుకోవడానికి నెలకు రూ.2500 ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చి గెలిచి మూడో సంవత్సరం అవుతున్నా నేటికి అమలు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేయడమేనని తెలంగాణ రాష్ట్ర మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర మహిళ సమాఖ్య గరిడేపల్లి మండల మహాసభను గానుగబండ గ్రామంలో షేక్ ఇమాంబీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉస్తేల సృజన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గెలవడానికి మహిళలకు అనేక రకాల హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం మర్చిపోవడం పరిపాటిగా మారిందని అన్నారు. మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని, వచ్చే ఎన్నికల్లో మహిళలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతరం మహిళ సమాఖ్య పతాకాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గానుగబండ సర్పంచ్ కడియాల పద్మ అప్ప య్య, ఐలాపురం లక్ష్మి, రంగాపురం సర్పంచ్ కట్టా కళ్యాణి అశోక్, మహి ళ సమాఖ్య నాయకులు కట్టా ఝాన్సీ, తాళ్ల అనూష, కోట వెంకటమ్మ, షేక్ పీరాంబి, పోకల అనిత, గోదముల హైమావతి, లక్ష్మ మ్మ, రామనర్సమ్మ, పోకల జ్యోతి, స్రవంతి, రమణ, మల్లీశ్వరి, అక్కమ్మ పాల్గొన్నారు.

## పేదింటి మహిళలు సద్వినియోగపర్చుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాలకు అందించిన కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను పేదింటి మహిళలు సద్వినియోగపరుచుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి సూర్యాపేట నియోజక వర్గ పరిధిలోని ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్, సూర్యాపేట అర్బన్ రూరల్ మండలాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు రూ.1,50,17,400 కోట్ల విలువైన కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, ఆర్‌డిఓ వేణుమాధవరావు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ ప్రాజెక్టులు ఏడాదిలోగా పూర్తి

### కలెక్టర్ చంద్రశేఖర్

### భూసేకరణ,ఆర్‌అండ్‌ఆర్ పనులు వేగవంతం చేయాలని ఆదేశం

### నిర్లక్ష్యం,జాప్యం ప్రదర్శిస్తే సస్పెన్షన్‌కు వెనుకాడం



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో కొనసాగుతున్న అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ,పునరావాసం (ఆర్‌అండ్‌ఆర్) ప్రక్రియలను వేగవంతం చేసి ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పెషల్ కలెక్టర్లు, ఆర్‌డీవోలు,ఈఈలు,డీఈలు,ఏఈలు,ఎల్‌పిఓలతో ప్రాజెక్టుల భూసేకరణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్ భూసేకరణ,అవార్డుల జారీ,పరిహారం చెల్లింపులు,ఆర్ అండ్‌ఆర్ పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలి.నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలి.అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి నిధులు సమకూర్చుకోవాలి అని సూచించారు.ఆర్‌అండ్ ఆర్ కాలనీల్లో రహదారులు,తాగునీరు, విద్యుత్, డ్రైనేజీతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. ప్రాజెక్టుల వల్ల ప్రభావితమయ్యే ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి వారి సహకారంతో పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు.ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేయడం ప్రతి అధికారి బాధ్యత అమలులో నిర్లక్ష్యం, జాప్యం, అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే సస్పెన్షన్‌కు కూడా వెనుకాడం అని కలెక్టర్ స్పష్టం చేశారు.సమీక్షలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైని) శ్రీకాంత్ రెడ్డి,స్పెషల్ కలెక్టర్లు,ఆర్‌డీవోలు,ఇరిగేషన్ శాఖ ఈఈలు,డీఈలు,ఏఈలు, ల్యాండ్ అక్విజిషన్ అధికారులు పాల్గొన్నారు.

# బడిలోనే పుస్తకాల దుకాణం

### ప్రభుత్వ నిబంధనలకు పంగనామం..

### ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా విక్రయాలు

### ఫీజుల భారానికి తోడు పుస్తకాల దందా

### ఎస్ఎఫ్ఐ -డివైఎఫ్ఐ ఆందోళన...

### పుస్తకాల గది సీజ్





**ప్రజాపక్షం/నకిరేకల్ :** విద్యను బోధించాల్సిన పాఠశాలలు వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే భారీ ఫీజులతో ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులపై పుస్తకాల విక్రయాల పేరుతో మరో భారం మోపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠశాల ప్రాంగణాల్లోనే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్,యూనిఫాంలు, షూస్, టైలు, బెల్టులు తదితర విద్యా సామగ్రిని విక్రయిస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి.తాజాగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆందోళనతో నకిరేకల్‌లోని నారాయణ విద్యాసంస్థలో అక్రమంగా నిల్వ ఉంచిన పుస్తకాల గదిని విద్యాశాఖ అధికారులు సీజ్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**బయట కొనొద్దు.. మా దగ్గరే కొనాలి**

**మార్కెట్ ధరల కంటే అధికంగా వసూలు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం తల్లిదండ్రులు తమకు నచ్చిన దుకాణాల్లో పాఠ్యపుస్తకాలు,ఇతర విద్యా సామగ్రి కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ ఉంటుంది. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. తమకు అనుకూలమైన ప్రచురణ సంస్థల పుస్తకాలను ఎంపిక చేసి,పాఠశాల పేరు ముద్రించిన నోట్‌బుక్స్, యూనిఫాంలు,ఇతర సామగ్రిని తమ వద్దే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.మార్కెట్ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

పుస్తకాల విక్రయాలపై మంగళవారం డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లం మహేష్,ముస్కు రవీందర్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పాఠశాలలో అక్రమంగా పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్ విక్రయిస్తున్నట్లు ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు.సమాచారం అందుకున్న విద్యాశాఖ అధికారులు ఎంఈఓ కార్యాలయ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన పుస్తకాల గదిని గుర్తించి సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు ఆరూరి ప్రణీత్, బొడ్డుపల్లి నవీన్, కన్నేపోయిన వీరేష్, చింత శివప్రసాద్, మాధగోని సంజయ్, బొడ్డుపల్లి శివకుమార్, విష్ణు, నవీన్ పాల్గొన్నారు.

"విభిన్నమైన కథలు, మంచి కంటెంట్ చిత్రాలతో ఎప్పటికప్పుడు తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ వస్తున్న కామెడీ కింగ్ అల్లరి నరేష్, తనను స్టార్ హీరోగా నిలబెట్టిన కామెడీ జానర్‌లో మరోసారి సందడి చేయడానికి సిద్ధమయ్యారు."





## ఎన్‌టిఆర్, త్రివిక్రమ్ కలయిక
## దైవిక నేపథ్యంతో దృశ్య కావ్యం!

జూనియర్ ఎన్‌టిఆర్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలిసి మరో సినిమాకు శ్రీకారం చుట్టారు. ఎన్‌టిఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రాబోతున్న మరో భారీ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అరవింద సమేత వీర రాఘవ' చిత్రం ఘన విజయం సాధించడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు మరోసారి ఈ నటుడుదర్శకుడు ద్వయం, భారతీయ చలనచిత్ర రంగంలో సరికొత్త రికార్డులను సృష్టించేందుకు, ఒక అసాధారణమైన సినిమా ప్రయాణాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రం దైవిక నేపథ్యంతో రూపొందుతోంది. పురాణాల స్ఫూర్తితో సాగే కథనం, లోతైన భావోద్వేగాలు, ఉత్కంఠభరితమైన యుద్ధ సన్నివేశాలు, అద్భుతమైన సరికొత్త ప్రపంచ నిర్మాణం తో ఈ చిత్రం ప్రేక్షకులకు అపూర్వమైన అనుభూతిని అందించనుంది. ఎన్‌టిఆర్ నట విశ్వరూపానికి, త్రివిక్రమ్ కలం బలానికి తోడుగా ఈ దైవిక కథాంశం తోడవ్వడం సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటేలా చేస్తోంది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. తనదైన నేపథ్య సంగీతంతో, పాటలతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లనున్నారు. ఈ చిత్రానికి ఆయన అందించనున్న సంగీతం ఒక సరికొత్త అనుభూతిని ఇస్తుందని చిత్ర బృందం నమ్మకంగా ఉంది. హారిక & హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధా కృష్ణ (చినబాబు), ఎన్‌టిఆర్ ఆర్ట్స్ పతాకంపై నందమూరి కళ్యాణ్ రామ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




## నవంబర్ 19న 'ఈ N ఈ రిపీట్' రిలీజ్

యూత్‌లో చెరగని ముద్ర వేసుకున్న 'ఈ నగరానికి ఏమైంది' చిత్రం ఇప్పుడు సీక్వెల్ 'ఈ N ఈ రిపీట్'తో సిద్ధమవుతోంది. విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను ఆ మ్యాజిక్‌ను మళ్లీ క్రియేట్ చేయడానికి రీయూనియన్ అవుతుండగా, శ్రీనాథ్ మాగంటి ఈ టీంకు కొత్త ఉత్సాహాన్ని జోడిస్తున్నారు. తరుణ్ భాస్కర్ మరోసారి దర్శకత్వం వహిస్తుండగా, ఎస్ ఒరిజినల్స్, రూట్ నోట్ సినిమా బ్యానర్లపై సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ సినిమా ప్రపంచవ్యాప్త నవంబర్ 19న విడుదల కానుందని నిర్మాతలు ప్రకటించారు. చిత్రం మొదటి భాగం విడుదలై ఎనిమిది ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ఆనాటి 'కన్నా రాశి' గ్యాంగ్ జ్ఞాపకాలను గుర్తు చేసేలా, అందరినీ ఆకట్టుకునేలా ఫ్రెండ్‌షిప్ యాంథమ్ నేపథ్యంలో ఒక 'ఫీల్‌గుడ్ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది.వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా, ఏజే ఆరోన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రవితేజ గిరిజాల ఎడిటింగ్ చేస్తుండగా, రాజేష్ పెంటకోట, సాలీ వైట్ ప్రొడక్షన్ డిజైన్‌ను రూపొందిస్తున్నారు.

## 'రణబాలి'తో మరో విజయం సాధించాలి విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. ఈ సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ రిలీజ్ కు రాబోతోంది. ఈ మేరకు విజయ్ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా స్పందిస్తూ మనం టాక్సీవాలా సినిమా చేసి తొమ్మిదేళ్లవుతోంది. ఈ తొమ్మిదేళ్లలో మనం లైఫ్‌లో ఎంతో మారిపోయాం. అర్థవంతమైన కథలు రాయాలనే తపన, వాటిని అందంగా తెరకెక్కించాలనే ఇష్టం నీలో ఏమాత్రం తగ్గలేదు. మనం కలిసి చేసింది రెండు చిత్రాలే అయినా ఎన్నో పోరాటాలు చేశాం. మొదటి చిత్రానికి ప్రేక్షకుల ప్రేమ, ఆదరణ అందుకున్నాం. రణబాలితో మనం మరో విజయం సాధించాలి. నువ్వు చేసే పనుల్లో అంతా మంచే జరగాలి. రణబాలిగా నటించే అవకాశం దక్కినందుకు సంతోషిస్తున్నా. మన సినిమాను ప్రేక్షకులు ఎప్పుడెప్పుడు చూస్తారా అని వేచి చూస్తున్నా. అని అన్నారు. ఈ చిత్రానికి మ్యూజిక్ అజయ్ అతుల్, డిఒపి నీరవ్ షా, రైటర్ ప్రమోద్ తమ్మినేని, ప్రొడక్షన్ డిజైనర్ శివం రావు నాగసాని. ఎడిటర్ కార్తీక శ్రీనివాస్ ఆర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చెంబోలు సాయి ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.



## 'రంభ–ఊర్వశి– మేనక' ఫస్ట్ లుక్ విడుదల

విభిన్నమైన కథలు, మంచి కంటెంట్ చిత్రాలతో ఎప్పటికప్పుడు తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ వస్తున్న కామెడీ కింగ్ అల్లరి నరేష్, తనను స్టార్ హీరోగా నిలబెట్టిన కామెడీ జానర్‌లో మరోసారి సందడి చేయడానికి సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న 65వ చిత్రం కు చంద్ర మోహన్ చింతాడ దర్శకుడు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫాంటసీకి వినోదాన్ని జోడిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'కామెడీ గోస్ కాస్మిక్' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌ను ఇచ్చారు. ఈ చిత్రం మ్యాజికల్ ట్విస్టులు, వినోదభరితమైన సంఘటనలతో సరికొత్త థియేట్రికల్ అనుభూతిని అందించబోతుంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్‌తో ఈ చిత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో అల్లరి నరేష్ స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఆయన స్వర్గలోకపు మెట్లపై కూర్చుని, చేతిలో కలం, 'రంభ, ఊర్వశి, మేనక' పేర్లు రాసి ఉన్న పేపర్ పట్టుకుని ఉండగా, పైన మేఘాల మధ్య అప్సరసలు కనిపిస్తున్నారు. డివైన్ ఎలిమెంట్స్, హాస్యంతో కూడిన ఈ క్రియేటివ్ డిజైన్, ఫాంటసీ, వినోదం, అల్లరి నరేష్ మార్క్ కామెడీ కలగలిసిన ఒక ప్రత్యేకమైన 'కాస్మిక్ ఎంటర్‌టైనర్' అందించబోతోంది.ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, నరేష్ వి.కె., శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ఇతర ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తుండగా, చోటా కె. ప్రసాద్ ఎడిటింగ్. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## జై భీమ్ దర్శకుడు జ్ఞానవేల్‌తో సూర్య రెండో చిత్రం

భారతీయ సినీ పరిశ్రమలో వరుస బ్లాక్‌బస్టర్ చిత్రాలతో తనదైన ముద్ర వేసుకున్న హోంబలే ఫిలిమ్స్ మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించింది. విజయ్ కిరగందూర్ నిర్మాణంలో హీరో సూర్య, నటి కాయదు లోహర్, ప్రముఖ దర్శకుడు టి.జె. జ్ఞానవేల్ కాంబినేషన్‌లో ఈ భారీ చిత్రం రూపొందనుంది. పవర్ ఫుల్ కథను అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కించనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.రెండు దశాబ్దాలుగా తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న సూర్య భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిభావంతులైన నటుల్లో ఒకరు. రెండు జాతీయ పురస్కారాలు, ఏడు ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డులు అందుకున్న ఆయన, కమర్షియల్ విజయాలతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఎన్నో చిత్రాల్లో నటించారు. నిర్మాతగా కూడా విలువైన కథలను ప్రేక్షకులకు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు.దర్శకుడు టి.జె. జ్ఞానవేల్ 'జై భీమ్' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు. సామాజిక అంశాన్ని హృద్యంగా ఆవిష్కరించిన ఆ చిత్రం భారతీయ సినిమాల్లో అత్యధిక ఐఎండిబి రేటింగ్ పొందిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. బలమైన భావోద్వేగాలు, ఆలోచింపజేసే కథనాలతో ఆయన సమకాలీన దర్శకుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.హోంబలే ఫిలిమ్స్ ఇప్పటికే కేజీఎఫ్, కాంతార, సలార్ వంటి పాన్ ఇండియా బ్లాకబసర్‌లతో భారతీయ సినీ పరిశ్రమలో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. భారతీయ కథలను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లడంలో ఈ సంస్థ ఎప్పుడూ ముందుంటోంది. అలాగే భారతదేశంలోనే అతి పెద్ద యానిమేటెడ్ చిత్రం మహావతార్ నరసింహను కూడా ప్రేక్షకులకు అందిస్తోంది.ఈ సందర్భంగా హోంబలే ఫిలిమ్స్ వ్యవస్థాపకుడు విజయ్ కిరగందూర్ మాట్లాడుతూ అభిరుచి, అంకితభావం కలిగిన వ్యక్తులు ఒకే లక్ష్యంతో కలిసి పనిచేసినప్పుడే గొప్ప సినిమాలు పుడతాయని మేము ఎప్పుడూ నమ్ముతాం. సూర్య గారు, టి.జే. జ్ఞానవేల్ గారితో కలిసి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాలను తాకే నిజాయితీగల, అర్థవంతమైన కథను చెప్పబోతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది అన్నారు.ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఎస్.ఆర్. కదిర్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. కె. కదిర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబధించిన పూజ కార్యక్రమం ఇటీవల చెన్నైలో జరిగింది.



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కౌంటర్ దాఖలుకు గడువు కోరిన ప్రభుత్వం

### జీవో– 9లోని నాలుగు నిబంధనలపై స్టే 6 వరకు పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంజనీరింగ్ కళాశాల ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన వందకు పైగా పిటిషన్లపై విచారణ సందర్భంగా ప్రభు త్వం కౌంటర్ దాఖలు చేసేందుకు మరింత గడువు కోరడంతో, ప్రభుత్వం జారీ చేసిన జీవో–9లోని నా గు మార్గదర్శకాల అమలుపై గతంలో ఇచ్చిన మ ధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు మంగళవారం కొనసాగించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఫీజుల వసూళ్ల విధానాన్ని సవాలు చేస్తూ పలు ఇంజనీరింగ్ కళాశాలలు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారించారు. ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది ఎస్. రాహుల్‌రెడ్డి వా దనలు వినిపిస్తూ కౌంటర్లు సిద్ధం చేస్తున్నామని, వాటి ప్రతులను పిటిషనర్లకు అందజేయడానికి కొంత సమయం కావాలని కోర్టును కోరారు. దీనిపై పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్య క్తం చేస్తూ, అప్పటివరకు గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఫీజులను కళాశాలలు విద్యార్థుల నుంచి వసూలు చేసుకోవాలా, లేక ప్రభుత్వమే చెల్లిస్తుందా అన్న అంశంపై స్పష్టత ఇవ్వడం లేదని, ఫీజు నిర్ధారణ ప్రక్రియ కూడా పెండింగ్‌లో ఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వం జులై 6లోగా కౌంటర్లు దాఖలు చేయాలని, అవసరమైతే పిటిషనర్లు రిప్లై దాఖలు చేయాలని ఆదేశించింది. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేస్తూ విచారణను జులై 6కు వాయిదా వేసింది. అదే రోజు కళాశాలల ఫీజు నిర్ధారణకు సంబంధించిన పిటిషన్లను కూడా విచారించనున్నట్లు తెలిపింది.

## సర్‌లో ఓటు హక్కు పొందొచ్చు:హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం ఓటరు జాబితాలో పేరు లేకపోయినా ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (సర్) ప్రక్రియ ద్వారా చట్టబద్ధంగా ఓటు హక్కు పొందే అవకాశం ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను ముగించింది. ఓటరు జాబితా నుంచి తమ పేర్లను తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ సర్ ప్రక్రియలో పేర్లను తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉందని కోర్టుకు తెలిపారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, బీఎల్‌వోలకు అవసరమైన వివరాలు సమర్పించి పేర్లు చేర్పించుకోవచ్చని, ఒకవేళ తిరస్కరిస్తే సంబంధిత ఎన్నికల అధికారులను, అనంతరం అవసరమైతే కోర్టును ఆశ్రయించవచ్చని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను ముగించింది.

## ప్రత్యేక పోలీస్ బలగాలే రాష్ట్ర భద్రతకు కవచం

### ఆధునికీకరణతో మరింత బలోపేతం చేయాలి: డిజిపి సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ స్పెషల్ బెటాలియన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు వాటిని ఆధునిక సాంకేతికతతో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ అన్నారు. సిబ్బంది సంక్షేమం, పారదర్శక పరిపాలన, నిరంతర శిక్షణతో పాటు డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మానసిక ఒత్తిడి వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ స్పెషల్ బెటాలియన్ల ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో డిజిపి పాల్గొని బెటాలియన్ల పనితీరు, మౌలిక వసతులు, పరిపాలన, సాంకేతిక వ్యవస్థలు, సిబ్బంది సంక్షేమంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. బెటాలియన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని, వాహనాలు, ఆధునిక పరికరాలు, నివాస క్వార్టర్లు, తాగునీరు, వైద్య సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. నక్సల్స్ నిర్మూలనలో ఒకప్పుడు ప్రత్యేక పోలీస్ బెటాలియన్లు కీలక పాత్ర పోషించాయని గుర్తు చేసిన డిజిపి, ప్రస్తుతం ఎన్నికల బందోబస్తు, విఐపి భద్రత, విపత్తు నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ అవి సమర్థవంతంగా సేవలందిస్తున్నాయని ప్రశంసించారు. ఇటీవల నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాల సమయంలో వరద బాధితులను రక్షించడంలో తెలంగాణ స్పెషల్ బెటాలియన్ సిబ్బంది అంకితభావంతో పనిచేశారని అభినందించారు. కమాండెంట్లు సిబ్బంది కుటుంబ పరిస్థితులు, ఆరోగ్యం, వ్యక్తిగత సమస్యలపై దృష్టి పెట్టి వారికి మానసికంగా అండగా నిలవాలని సూచించారు. డ్యూటీల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించాలని, ఎలాంటి వివక్షకు తావు లేకుండా సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీ, ఆమనగల్ ప్రాంతాల్లో కొత్త స్పెషల్ బెటాలియన్ల ఏర్పాటు అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. పోలీసు సిబ్బంది మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం 'మిత్ర' కౌన్సెలింగ్ కేంద్రాలను మరింత సమర్థంగా వినియోగించాలని సూచించిన డిజిపి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టడంతో పాటు ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం, ఆయుధ వినియోగం, విపత్తు నిర్వహణ, కమ్యూనికేషన్, శారీరక, మానసిక దృఢత్వంపై నిరంతర శిక్షణ అందించాలని పేర్కొన్నారు. తెలంగాణ స్పెషల్ బెటాలియన్లు రాష్ట్ర పోలీసు వ్యవస్థకు వెన్నెముక వంటివని పేర్కొన్న డిజిపి, ఆధునికీకరణ, క్రమశిక్షణ, సాంకేతికత, సిబ్బంది సంక్షేమం అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## వ్యవసాయ పరిశోధనలు, పరిశ్రమల భాగస్వామ్యమే భారత ఆర్థిక వృద్ధి

### 'సిఎస్ఐఆర్- ఐఐసిటి'లో హాస్టల్ శంకుస్థాపనలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవసాయ పరిశోధనలు పరిశ్రమల భాగస్వామ్యమే భారత ఆర్థిక వృద్ధిలో తదుపరి దశకు సారథ్యం వహిస్తుందని కేంద్ర శాస్త్రసాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. హైదరాబాద్‌లోని సిఎస్ఐఆర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసిటి) ప్రాంగణంలో రూ.44.46 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 200 మంది విద్యార్థుల సామర్థ్యం కలిగిన ఆధునిక హాస్టల్ భవనానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఫ్లోరోకెమికల్స్ పరిశోధన కేంద్రం, సుస్థిర ఇంజనీరింగ్ సముదాయం, నిరంతర ప్రాసెసింగ్ వేదిక, సిరిపురం చేనేత క్లస్టర్‌కు 500 కెఎల్‌డి వికేంద్రీకృత మురుగునీటి శుద్ధి కేంద్రం సహా నాలుగు అత్యాధునిక పరిశోధనఅభివృద్ధి కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాలను విలువైన ఉత్పత్తులుగా మార్చే సాంకేతికతలు రైతులు, అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఇలకు కొత్త అవకాశాలను సృష్టిస్తాయని తెలిపారు. పరిశోధనలను పరిశ్రమలకు అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి, ఆవిష్కరణలు, ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రయోగశాలల్లో పుట్టే ఆవిష్కరణలు మార్కెట్‌కు చేరి ప్రజలకు ఉపయోగపడేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఎస్ఐఆర్ఐఐసిటి డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి, సిఎస్ఐఆర్‌కు చెందిన వివిధ సంస్థల డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్మణ్‌ను విమర్శించే స్థాయి ఆర్ఎస్‌కు లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ని విమర్శించే స్థాయి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు లేదని టిపిసిసి నాయకులు మానవతా రాయ్ అన్నారు. 'మన ఇద్దరి స్థాయి ఒక్కటే కాబట్టి తాను సవాల్‌ను స్వీకరిస్తున్నానని, అయితే సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కాకుండా, జులై 2న ఉదయం 11 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలి' అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సవాల్ విసిరారు. గాంధీ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఖద్దరు ధరించిన ప్రతి ఒక్కరూ గాంధేయవాదులు కారని, అలాగే గుండు కొట్టించుకున్నంత మాత్రాన ఎవరూ అంబేద్కర్‌వాదులు కాలేరని అన్నారు. బిఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గిపోవడంతో బాల్క సుమన్ మాదిరిగానే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా గురుకులాల అంశంలో అసత్య ప్రచారం కోసం ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

## ట్రంప్‌నకు భారీ షాక్

(మొదటి పేజీ తరువాయి)

జరిగే కీలక ఎన్నికలకు ముందుగా ట్రంప్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఇది ఆయనకు పెద్ద నష్టం కలిగించే తీర్పు.ముఖ్యంగా ఉపాధి వెతుక్కుంటూ జీవించడంకోసం ప్రవాసం వెళ్లే విదేశీకుటుంబాల మహిళలు అమెరికాలో బిడ్డకు జన్మ ఇస్తే, వారికి వెంటనే పౌరసత్వ హక్కులు వస్తాయి. దీనిని ట్రంప్ మొదటినుండీ వ్యతిరేకిస్తున్నారు. విదేశీ మహిళలు గర్భందాల్చి అమెరికాకు వచ్చిన తర్వాత ప్రసవించి బిడ్డలకు జన్మనివ్వడం ద్వారా ఇక్కడ పౌరసత్వాలను అనాయాసంగా సంపాదిస్తున్నారని ట్రంప్ వాదిస్తున్నారు. ఈ విషయంపై అమెరికా వ్యాప్తంగా అనేకమంది కోర్టుకు వెళ్ళారు.దేశంలో అక్రమంగా చొరబడిన వారు లేదా తాత్కాలిక వీసాలపై అమెరికాకు వచ్చేవారు బిడ్డలను కనడంతో ఆ బిడ్డలకు వెంటనే అమెరికా పౌరసత్వం లభించడం 150 సంవత్సరాలుగా చెల్లుబాటు అవుతున్న చట్టబద్ధమైన అంశం. ఇది సంప్రదాయంగా మారింది.



## బాధ్యతల స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కె.రామకృష్ణా రావు పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సిఎస్గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతో పాటు కె.రామకృష్ణా రావుకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

## 23 శాతం ధమాల్

(మొదటి పేజీ తరువాయి)

నమోదైంది. కేవలం వరి మాత్రమే కాకుండా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి సాగు కూడా గత ఏడాదితో పోలిస్తే తక్కువగా నమోదైంది. సాధారణంగా జూన్ నెలలో నైరుతి రుతుపవనాల రాకతో ఖరీఫ్ పంటల సాగు ప్రారంభమవుతుంది. తాజా గణాంకాల ప్రకారం, ప్రధాన ఖరీఫ్ పంట అయిన వరి సాగు విస్తీర్ణం జూన్ 25 నాటికి 25.17 శాతం తగ్గి 25.75 లక్షల హెక్టార్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే సమయానికి ఇది 34.41 లక్షల హెక్టార్లుగా ఉండేది. పప్పుధాన్యాల సాగు 30.47 శాతం తగ్గి 14.92 లక్షల హెక్టార్లకు (గత ఏడాది 21.46 లక్షల హెక్టార్లు) పడిపోగా, నూనెగింజల సాగు విస్తీర్ణం 53.33 శాతం తగ్గి 36.41 లక్షల హెక్టార్ల నుండి 16.99 లక్షల హెక్టార్లకు పడిపోయింది. పప్పుధాన్యాలలో కంది (తుర్/అర్హర్) సాగు 8.45 లక్షల హెక్టార్ల నుండి 3.56 లక్షల హెక్టార్లకు తగ్గింది. నూనెగింజల విషయానికొస్తే, వేరుశనగ సాగు విస్తీర్ణం 15.29 లక్షల హెక్టార్ల నుండి 8.87 లక్షల హెక్టార్లకు, సోయాబీన్ సాగు 19.97 లక్షల హెక్టార్ల నుం డి 6.92 లక్షల హెక్టార్లకు తగ్గింది. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం 36.07 లక్షల హెక్టార్ల నుండి 31.84 లక్షల హెక్టార్లకు తగ్గింది. ఇదే కాలంలో పత్తి సాగు 45.36 లక్షల హెక్టార్ల నుండి 34.61 శాతం తగ్గి 29.66 లక్షల హె క్టార్లకు పడిపోయింది. అయితే, చెరకు సాగు విస్తీర్ణం 56.64 లక్షల హెక్టార్ల నుండి 57.31 లక్షల హెక్టార్లకు స్వల్పంగా పెరిగింది. అలాగే జనపనార (జూట్), మెస్తా సాగు విస్తీర్ణం కూడా 6.13 లక్షల హెక్టార్ల నుండి 6.25 లక్షల హెక్టార్లకు స్వల్పంగా పెరిగింది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) ప్రకారం ఖరీఫ్ పంటల విత్తనం వేయడానికి అత్యంత కీలకమైన నైరుతి రుతుపవనాలు జూన్ 24 నాటికి సాధారణం కంటే 42 శాతం తక్కువగా నమోదయ్యాయి. అందులో మధ్య భారతదేశంలో 59 శాతం, తూర్పు, ఈశాన్య భారతదేశంలో 41 శాతం, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో 28 శాతం, వాయువ్య భారతదేశంలో 22 శాతం లోటు నెలకొంది. ప్రస్తుతం భూమధ్యరేఖకు సమీపంలోని పసిఫిక్ మహాసముద్రంపై 'ఎల్ నినో' పరిస్థితులు నెలకొని ఉన్నాయి. జూన్–సెప్టెంబర్ రుతుపవనాల కాలంలో ఇవి మరింత బలపడే అవకాశం ఉంది. జలాశయాల్లోని నీటి నిల్వలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) పర్యవేక్షిస్తున్న 166 ముఖ్యమైన జలాశయాలలో జూన్ 25 నాటికి ఉన్న మొత్తం 'లైవ్ స్టోరేజ్' (వినియోగానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వ) 48.405 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బిసిఎం)గా ఉంది. ఇది ఆయా జలాశయాల పూర్తి స్థాయి సామర్థ్యంలో (ఎఫ్ఆర్ఎల్ ) 26.37 శాతానికి సమానం. ఈ నిల్వ పరిమాణం గత ఏడాది నిల్వలో 73.21 శాతంగానూ, సాధారణ స్థాయి నిల్వలో 105.67 శాతంగానూ ఉంది. మొత్తం 166 జలాశయాలలో, 111 జలాశయాలు సాధారణ నిల్వలో 80 శాతం కంటే ఎక్కువ స్థాయిని నమోదు చేయగా, 55 జలాశయాలు 80 శాతం లేదా అంతకంటే తక్కువ స్థాయిలో ఉన్నాయి. వీటిలో 29 జలాశయాలు సాధారణ నిల్వలో 50 శాతం లేదా అంతకంటే తక్కువ స్థాయిని కలిగి ఉన్నాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com